# జనబలం

ప్రజలే ప్రభువులు

మార్చి 2026 లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాస పత్రిక రూ.10/-



## పశ్చిమాసియాలో యుద్ధం.. ప్రజల భవితవ్యం



## రైజింగ్ తెలంగాణ... స్వర్ణాంధ్రలకు సీక్రెట్

## ఏపీ 'AI డాక్టర్ - సంజీవని'తో యూనివర్సల్ హెల్త్ కేర్?




## డేటా సెంటర్లు ... అణువిద్యుత్

## భారత్ వాణిజ్య ఒప్పందాలు-16వ ఆర్థిక సంఘం సిఫార్సులు





# పిల్లల భవిష్యత్తు పట్ల ప్రయివేటు పాఠశాలలూ శ్రద్ధ వహించాలి

## - డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ -

బట్టీ విధానం, కాపీ కొట్టే అవకాశం లేకుండా విద్యార్థులు సొంతంగా, సృజనాత్మకంగా ఆలోచించేరీతిలో పాఠశాల విద్యను మార్చాలని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్.డి.ఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. పరీక్షల పద్ధతిని మారిస్తే, ఈ రకమైన మంచి ప్రమాణాల విద్యకు డిమాండ్ పెరుగుతుందన్నారు. విద్యార్థులు ప్రమాణాలకు తగ్గట్లు నేర్చుకుంటున్నారో లేదో ఒత్తిడి లేకుండా బేరీజు వేసేలా పరీక్షల పద్ధతులు ఉండాలన్నారు. విజయవాడలో విశ్వం ఎడ్యుటెక్ ఆధ్వర్యంలో ప్రయివేటు పాఠశాలల యాజమాన్య సంఘం ప్రతినిధులతో సమావేశంలో ముఖ్య అతిథిగా జేపీ మాట్లాడుతూ.. విద్య పిల్లల భవిష్యత్తుకు, సమాజానికి ఉపయోగపడాలన్నారు. ఈ దశలో ప్రభుత్వ విద్యా, ప్రయివేటు విద్యా అన్న చర్చ కంటే -- ప్రతి బిడ్డకూ నాణ్యమైన విద్య ప్రభుత్వ లక్ష్యం కావాలన్నారు. తల్లిదండ్రులు ఓ పక్క విద్య కోసం పన్నులు కడుతూ కూడా, మెరుగైన విద్య వస్తుందేమోనన్న ఆశతో ప్రయివేటు స్కూళ్లలో అదనంగా ఫీజులు కడుతూ పిల్లల్ని చేరుస్తున్నారన్నారు. వారి కష్టానికి, పిల్లల భవిష్యత్తుకి ప్రయివేటు బడుల యాజమాన్యాలు విలువనివ్వాలన్నారు. విద్యాప్రమాణాల్ని పెంచేందుకు కృషి చేయాలన్నారు. తెలివితేటలు ఏ ఒక్కరి సొంతకాదని, విద్యార్థుల మేధాశక్తిని పెంచేందుకు విశ్వం ఎడ్యుటెక్ ప్రత్యేక పరీక్ష నిర్వహిస్తోందన్నారు. వివిధ విద్యాసంస్థలు, సంఘాల నాయకులు జేపీ అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నామని, ప్రస్తుత పరీక్షల నిర్వహణ విధానాన్ని మార్చాల్సుందన్నారు. కార్యక్రమంలో ఇండిపెండెంట్ ప్రయివేటు స్కూల్స్ మేనేజ్ మెంట్ అధ్యక్షుడు శ్రీకాంత్ బాబు, విజయవాడ చిల్డ్రన్స్ స్కూల్స్ అండ్ ట్యుటోరియల్ అసోసియేషన్ ప్రతినిధి మోహన్ రెడ్డి, మామిడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలే ప్రభువులు

# జనబలం

లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాసపత్రిక

మార్చి 2026

సంపుటి 27 సంచిక 03

## జనబలం చందా రుసుము వివరాలు

| | | |
|---|---|---|
| సంవత్సర చందా | : | రూ. 100.00 |
| మూడు సంవత్సరాలకు చందా | : | రూ. 290.00 |
| ఐదు సంవత్సరాలకు చందా | : | రూ. 475.00 |
| జీవితకాలపు చందా | : | రూ. 1200.00 |

సంపాదకవర్గం

బండారు రామ్మోహనరావు

శిరమని నరేష్

వర్కింగ్ ఎడిటర్


దూసనపూడి సోమసుందర్

*జనబలంలో ప్రచురితమవుతున్న వ్యాసాలలో రచయిత(త్రు)లు వెలిబుచ్చే అభిప్రాయాలు కేవలం వారి సొంతం. జనబలం సంపాదకవర్గం ఆ అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నట్టు కాదు.*

### చందాదారులకు విజ్ఞప్తి

చందా మొత్తాలను, ప్రకటనల ధర మొత్తాలను చెక్కుగాని, డి.డి. ద్వారా గాని FOUNDATION FOR DEMOCRATIC REFORMS పేర పంపవచ్చును. NEFT సౌకర్యము ద్వారా పంపదలచినవారు SBI PUNJAGUTTA BRANCHలోని SB A/C. No. 52086568057కి IFSC CODE No. SBIN0020072కు పంపి, Transaction I.D. No. మరియు తారీఖు తప్పనిసరిగా తెలియజేయవలెను. నగదు రూపంలో చెల్లించదలచిన వారు లోక్‌సత్తా సంస్థ కేంద్ర కార్యాలయంలో ఇచ్చి రశీదు పొందవలెను.

### కార్టూన్ కార్నర్




సరే అయితే! గతంలో కంటే కాస్త తగ్గించి ఇవ్వు!!

05 SHANTI చట్టం: అణువిద్యుత్ లక్ష్యాలపై భారత్ పునరాలోచించటం మేలు

07 పశ్చిమాసియాలో యుద్ధం..ప్రజల భవితవ్యం

12 'అధికార వికేంద్రీకరణ -- స్థానిక ప్రభుత్వాల సాధికారత'

16 వాణిజ్య ఒప్పందాలు.. ఆర్థిక సంఘం సిఫార్సులు

18 ఏపీ 'AI డాక్టర్- సంజీవని'తో యూనివర్సల్ హెల్త్ కేర్?

25 'స్ప్రింట్+మారథాన్ ఎంట్రప్రెన్యూర్'లా ప్రభుత్వం పనిచేయాలి

28 గిగ్ ఎకానమీ.. మహిళల సాధికారత

30 సమాచార హక్కుకు సమాధి?

కార్యాలయ చిరునామా : H.NO. 6-3-678, B-106 , పాషా కోర్ట్స్, 71 , సోమాజీగూడ, త్రిభువన్‌దాస్ జ్యూయలరీ వెనుక, హైదరాబాద్-500 082 ఫోన్: 040-23310288, 040-23419949

Email: accountsdept@loksatta.org

సంపాదకీయం

# పశ్చిమాసియాలో మంటలు

"మూడో ప్రపంచ యుద్ధం వస్తుందో రాదో నాకు తెలియదు కానీ, నాలుగో ప్రపంచ యుద్ధం మాత్రం అప్పటికి మిగిలిన మనుషులు రాళ్లు రాప్పలతో కొట్టుకుంటారు" అని ఒక మహానుభావుడు అన్నారు. ఆ మాటలు అక్షర సత్యం. ఫిబ్రవరి 28న మొదలైన అమెరికా, ఇజ్రాయిల్ వర్సెస్ ఇరాన్ కేవలం మూడు దేశాలకే పరిమితమైన యుద్ధం..ప్రస్తుతం 13 దేశాలకు విస్తరించింది. మరొక రెండు దేశాలు ఇందులో జతకలవబోతున్నాయి. ప్రపంచ దేశాలను కొందరు వ్యక్తులుగా చూస్తే అందరమూ అద్దాల గదిలో ఉన్నాము. ఎవరి అద్దం లోపట నుండి మొదటి రాయి విసిరితే విసిరిన వాడి అద్దాల గదితో పాటు మిగతా దేశాల అద్దాలన్నీ పగిలిపోతాయి. అందుకే అన్ని దేశాలు యుద్ధము వద్దు ..శాంతి ముద్దు అంటూనే యుద్ధానికి పురి గోల్పోతున్న దేశాల పట్ల ఖండన మండనలు, దూషణ భూషణ తిరస్కారాలు, ఆశీర్వచనాలు, శాపనార్థాలు పెడుతూ కాలం వెళ్లబుచ్చుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రపంచంలోని అగ్రరాజ్యాలతో పాటు ఏ దేశము మొదట యుద్ధానికి పూనుకోదు.

"ఏ తప్పు చేయని వాడే మొదట రాయి విసిరాలి" అన్న ఒక తెలుగు సినిమా లోని పాటలాగా ప్రపంచ దేశాలలో అగ్రదేశాలు అనుకుంటున్న దేశాల తప్పులు ఎవరికి వారికి ఉన్నాయి. "గురివింద గింజ తన నలుపు ఎరగనట్లు"అమెరికా, రష్యా చైనా లాంటి దేశాలతో పాటు కొన్ని యూరోపియన్ దేశాలు కూడా ఇలాంటి తప్పులలో భాగమయ్యాయి. వాళ్ళ ప్రాంతంలో వారు మిగతా దేశాలను నయానో భయానో భౌగోళికంగా కాకపోయినా ఆ దేశాలను ప్రభావితం చేసి రాజకీయ, ఆర్థిక రంగంలో ఆక్రమించుకొని పరోక్షంగా పాలిస్తున్నాయి. ఇలాంటి తరుణంలో "తప్పులెన్ను వారు తమ తప్పులెరగరు" అన్న వేమన పద్యం లాగా చివరికి వారు తమ తప్పులు తమ అధికార పీఠం కింద కప్పిపుచ్చుకుంటున్నారు. వారు మిగతా దేశాలను తప్పుపట్టే అవకాశం లేదు. కొంతవరకు ఉన్నా కూడా వాటిని కేవలం "లిప్ సింపతీ"కోసం వాడుతున్నారు తప్ప, ఈ యుద్ధాలు ఆగాలని, తప్పు చేసిన వారిని చట్టం ముందు నిలబెట్టాలనే చిత్తశుద్ధి లేదు. అందుకే ఈ యుద్ధంలో అమెరికా, ఇజ్రాయిల్ మీద కానీ అటుపక్క ఇరాన్ మీద కానీ పరుషమైన వ్యాఖ్యలు అగ్ర రాజ్యాలు అనుకుంటున్న చైనా రష్యా కూడా చేయడం లేదు. స్పందించకపోతే స్పందించలేదు అంటారు కనుక "కర్ర విరగకుండా పాము చావకుండా" స్పందిస్తున్నారు.

ఇలాంటి పరిస్థితికి కారణం ఏమిటి అని ఆలోచిస్తే మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత ఏర్పడిన ఆనాటి (లీగ్ ఆఫ్ నేషన్స్) నానా జాతి సమితి నుండి రెండో ప్రపంచ యుద్ధం తర్వాత వచ్చిన ఐక్యరాజ్యసమితి వరకు ప్రపంచ శాంతికి కట్టుబడి చిత్తశుద్ధితో పని చేయడానికి అవసరమైన స్వేచ్ఛ, స్వాతంత్రాలు ఆయా వ్యవస్థలకు ఇవ్వకపోవడం వల్ల ఏర్పడిన ప్రమాదమే తప్ప మరొకటి కాదు. ఒకనాడు నానా జాతిసమితి రెండో ప్రపంచం యుద్ధం ఆపలేక పోయినందువల్ల ఆవిర్భవించిన కేవలం 25 సంవత్సరాలకే ముసలిది అయిపోయి పనికిరాకుండా పోయింది. ఆ తర్వాత వచ్చిన ఐక్యరాజ్యసమితి ఏర్పడి సుమారు 80 సంవత్సరాలు దాటింది. అందుకే ఇది కూడా పనికి రాకుండా పోతుంది. దీనికి కారణమేమిటంటే ప్రపంచ దేశాలలో చాలావరకు చట్టబద్ధ పాలన లోపించడం తో పాటు ఆధిపత్య భావన పెట్రేగిపోయి ప్రతిదానికి అసహనమే సమాధానంగా దాడులు, ప్రతీకార దాడులు పరిష్కారంగా ఎంచుకోవడం వల్ల వచ్చిన ఉపద్రవం. మరి ఈ ఉపద్రవాన్ని తట్టుకోవాలంటే ప్రపంచవ్యాప్తంగా వ్యవస్థల పట్ల గౌరవము ఆయా దేశాలలో చట్టబద్ధ పాలన మళ్లీ నెలకొల్పడమే అసలైన పరిష్కారం.

వాతావరణం, పర్యావరణం, మాదకద్రవ్యాలు, యుద్ధాల గురించి అందరూ మాట్లాడతారు. కానీ దాన్ని బాగు చేసేవారు ఎవరు లేరు అనే ఆవేదన కనబడుతుంది. కానీ సామూహిక చర్యల వల్ల మాత్రమే ఇలాంటివి పరిష్కారం అవుతాయనేది వాస్తవం. ఎలాగంటే ఉదాహరణకు ఎలుకల నిర్మూలన కోసం ఒక రైతు మాత్రమే తన పొలంలో నివారణ చర్యలు తీసుకుంటే సాధ్యం కాదు అలాగే ఆ ప్రాంతంలో ఉన్న అందరూ రైతులు తమ పొలాలలోని ఎలుకల నిర్మూలనకు ఒకేసారి చర్యలు తీసుకుంటే తప్పక ఎలుకల నిర్మూలన సాధ్యమవుతుంది. ప్రస్తుతం ప్రపంచం ముందున్న అనేక సవాళ్లు అవరోధాలను ఎదుర్కోవాలంటే కొత్త వ్యవస్థల రూపకల్పన వాటి కొనసాగింపునకు ప్రపంచ దేశాల సమిష్టి సహకారం, ఆలోచన తోడైతే తప్పక ఇలాంటి విపత్తుల నుండి మనం దూరం చేయబడతాం. మరి పిల్లి మెడకు ఎవరు గంట కట్టాలి అనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. ప్రతి సంక్షోభం నుండి పరిష్కారం కూడా పుడుతుంది. ఇది మనకు మానవ పరిణామ క్రమంతో పాటు మానవాభివృద్ధి చరిత్ర తెలిపిన పాఠం. ఈ విషయాన్ని ఆకళింపు చేసుకుంటే ప్రపంచ వ్యాప్తంగా ప్రజాస్వామిక భావజాలాన్ని పెంపొందించడం, చట్టబద్ధ పాలనను సాధించడం, మనిషి భావోద్వేగాలను భావోద్రేకంగా మార్చే లింగ వివక్ష, వర్ణ వివక్ష కులము, మతము, ప్రాంతము, భాష వీటిని పక్కన పెట్టి "సర్వేజనా సుఖినోభవంతు సమస్త లోకా సుఖినోభవంతు" అని వేద సూక్తిని తీసుకున్నప్పుడు మాత్రమే సాధ్యమవుతుంది.

**చట్టబద్ధ పాలనే పరిష్కారం**

ప్రస్తుతం ప్రపంచంలో అమలులో ఉన్న అన్ని పాలనా వ్యవస్థలలో ప్రజాస్వామ్య వ్యవస్థ లో మాత్రమే తక్కువ లోపాలున్నాయి. ప్రజాస్వామ్యంలోని లోపాలకు ప్రజాస్వామ్యాన్ని తిరస్కరించడం కాదు మరింత ప్రజాస్వామ్యమే మంచి మందు. ఇది గమనిస్తే చట్టబద్ధ పాలనతో మాత్రమే ప్రపంచంలోని అనేక సమస్యలకు పరిష్కారం దొరుకుతుంది.

-బండారు రామ్మోహనరావు

# SHANTI చట్టం: అణువిద్యుత్ లక్ష్యాలపై భారత్ పునరాలోచించటం మేలు

- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్-

అణు ఇంధనానికి సంబంధించిన 'శాంతి' (సస్టైయినబుల్ హార్నెసింగ్ అండ్ అడ్వాన్స్ మెంట్ ఆఫ్ న్యూక్లియర్ ఎనర్జీ ఫర్ ట్రాన్స్ ఫార్మింగ్ ఇండియా) చట్టాన్ని భారత ప్రభుత్వం తీసుకొచ్చింది. భూతాపం, సౌర ఇంధనానికి ప్రాధాన్యత ఉన్నకొద్దీ పెరుగుతున్న నేపథ్యంలో.. విద్యుత్ రంగ సవాళ్లను నిశితంగా విశ్లేషించుకోవటానికి ఇదో అవకాశం.

1879లో థామస్ అల్వా ఎడిసన్ ఫిలమెంట్ ద్వారా వెలుగునిచ్చే విద్యుత్ బల్బుని కనుగొన్నాక, 1893లో నికోలా టెస్లా ఫాస్ఫోరిసెంట్ వెలుతురు బల్బుని ప్రపంచానికి పరిచయం చేశారు. అప్పట్నుంచి విద్యుచ్ఛక్తి ఆధునిక సమాజంలో అంతర్భాగమైంది. మన ఇళ్లను వెచ్చగా మార్చటం,మోటార్లకు శక్తినివ్వటం, మన యంత్రాలు నడిచేలా చేయటానికి విద్యుత్ అనివార్యమైంది. దీంతో ఆధునిక పరిశ్రమ, ఆర్థిక వ్యవస్థలో విద్యుదుత్పత్తి, పంపిణీ విడదీయలేని భాగమయ్యాయి. ఒక శతాబ్దానికి పైగా ప్రపంచానికి బొగ్గు ప్రధాన ఇంధనవనరు అయ్యింది. మరో శిలాజ ఇంధనం సహజ వాయువు, నీటి ప్రవాహం నుండి కాలుష్యరహిత జలవిద్యుత్తు.. ఇతర విద్యుచ్ఛక్తి వనరుల య్యాయి. అణుయుగం ప్రారంభం కావటంతో అణు విచ్ఛిత్తి గొలుసుకట్టు ప్రతిచర్యలను నియంత్రించటం, తద్వారా ఉద్భవించిన వేడి నుండి విద్యుత్‌ని ఉత్పత్తి చేయటం నేర్చుకున్నాం.



ప్రస్తుతం ప్రపంచ విద్యుదుత్పత్తిలో అణు ఇంధనం 9% దాకా వాటా కలిగివుంది. 31 దేశాలలో 440 అణువిద్యుత్ కేంద్రాలు క్రియాశీలంగా ఉన్నాయి. వీటి మొత్తం ఉత్పాదక సామర్థ్యం 400 గిగావాట్లు (400,000 మె.వా). కర్బనరహిత విద్యుత్ లో అణువిద్యుత్తు వాటా ప్రస్తుతం 20% దాకా ఉంది. అమెరికా (97 గిగావాట్లు), ఫ్రాన్స్ (63 గి.వా), చైనా (67 గి.వా), రష్యా (27 గి.వా), దక్షిణ కొరియా (26 గిగావాట్లు)తో అణువిద్యుదుత్పత్తిలో అగ్ర స్థానాల్లో ఉన్నాయి. విద్యుదుత్పత్తిలో అణుశక్తి వాటా పరంగా చూస్తే, ఫ్రాన్స్ ప్రథమ స్థానంలో (67%) ఉంది. పెద్ద ఆర్థిక వ్యవస్థలలో ఈ అణువాటా రకరకాల స్థాయిల్లో ఉంది. అమెరికా (18%), చైనా (5%), రష్యా (19%), దక్షిణ కొరియా (30%), బ్రిటన్ (14%). జపాన్ లో అణువిద్యుత్ వాటా 20% నుండి 10 శాతానికి పడిపోయింది. 2011లో జపాన్‌లో ఫుకుషిమా అణు ప్రమాదం తర్వాత జర్మనీలో ప్లాంట్లు 23% నుండి సున్నా అయ్యాయి.

అణువిద్యుత్తు కార్బన్ తటస్థమైనది, ఆధారపడ తగినది కావటంతో.. ప్రపంచవ్యాప్తంగా జలవిద్యుత్ తర్వాత రెండో అతి పెద్ద స్వచ్ఛ ఇంధనంగా ప్రాముఖ్యతను సంతరించుకుంది. ఇటీవలి సంవత్స రాలలో సౌర, పవన విద్యుత్తుత్పత్తి ఉన్నట్టుండి పెరిగింది. దీంతో, రోజువారీ వినియోగంలో ఒడిదుడుకులు లేకుండా విద్యుత్ సరఫరా చేయగలసుస్థిర, కాలుష్య రహిత ఇంధన వనరుల్ని వేగిరం కనుగొనాల్సిన అవసరం ఏర్పడింది. భూతాపాన్ని ఎదుర్కొనేందుకు బొగ్గును మండించి విద్యుత్తును తయారుచేసే థర్మల్ విద్యుత్ కేంద్రాలను దశలవారీగా మూసివేయటం లక్ష్యమైంది. ఈ నేపథ్యంలో అణువిద్యుత్ ఆకర్షణీయ ఎంపికగా కనిపించింది. 2008లో భారత్ అమె రికాతో 123 ఒప్పందాన్ని కుదుర్చుకుంది. దీనివల్ల అప్పటివరకూ ఉన్న అణుఆంక్షలు తొలగి.. సాంకేతికత, ఇంధనాలు అందుబాటులోకి వచ్చాయి. భారత్-అమెరికా అణు ఒప్పందం అణు ఇంధనంపై పెద్ద చర్చను రేకెత్తించింది. భవి ష్యత్తు శుద్ధ ఇంధన వనరుగా అణువిద్యుత్‌ను పలువురు భావించారు. కానీ కొద్దికాలానికే జరిగిన ఫుకుషిమా అణుప్రమాదం అన్ని అంచనాల్నీ తలకిందులు చేసింది. మార్చి 11, 2011న 9.1 తీవ్రతతో జపాన్‌లో తొహోకు భూకంపం సంభవించింది. దీంతో సునామీ విరుచుకు పడింది. ఈ ఉత్పాతాలు పలు విధ్వంసక పరిణామాలకు

దారితీశాయి. విద్యుత్ సరఫరా నిలిచి పోయింది. ఆపద్ధర్మ ఇంధన వనరుల వ్యవస్థకు నష్టం వాటిల్లింది. కార్యకలాపాలను నిలిపివేసిన (షట్ డౌన్) తర్వాత రియాక్టర్లను చల్లబరచలేకపోవటం, రేడియో ధార్మిక కాలుష్యాలను నియంత్రించటం, బయటికి వ్యాపించకుండా ఆపటంలో వైఫల్యం చోటుచేసుకుంది.. పర్యవసానంగా, సుమారు 160,000 మంది ప్రజలు నిరాశ్రయులయ్యారు. శుద్ధి, పరిహార వ్యయాలుగా 180 బిలియన్ డాలర్ల ఆర్థిక నష్టం సంభవించింది. 1986లో ఇప్పటి ఉక్రెయిన్‌లోని చెర్నోబిల్ ఉదంతం తర్వాత రెండో పెద్ద భయానక అణు ప్రమాదం ఇది.

అణువిద్యుత్తు ఆధారపడ తగినది, చాలావరకు సురక్షితమైనదన్నది వాస్తవం. కానీ, ప్రమాదావకాశాలు తక్కువైనా, రేడియో ధార్మిక కాలుష్యం వల్ల నష్టం తీవ్రంగా ఉంటుంది. ఉక్రెయిన్, జపాన్‌లోని విధ్వంసక ఉదంతాలతో వణికి పోయిన సమాజాలు.. అణువిద్యుత్ కేంద్రాల వినియోగంపై పునరాలోచనలో పడ్డాయి. ఇన్సూరెన్స్ ఖర్చులు, భారీ పరిహారాల భారం -వెరసి వ్యయాలు చాలా ఎక్కువ. కాబట్టి ప్రయివేటు పెట్టుబడి కష్టం. మూలధన వ్యయం తడిసి మోపెడవుతుంది. ఒక్కో మెగావాట్‌కి రూ.15-25 కోట్ల దాకా వెచ్చించాల్సుంటుంది. చాలా అణు కర్మాగారాల వ్యయం అంచనాల్ని మించటం, అనుకున్న సమయంలో పూర్తికాకపోవటం సాధారణం. ఉపయోగించిన ఇంధనాన్ని తరలించటం మరో పెద్ద సమస్య. ఈ ప్రక్రియ సంక్లిష్టంగా ఉంటుంది. చాలా ఖరీదైనది కూడా. ప్రమాదావకాశాలు, పర్యవసానాల తీవ్రత ఎక్కువగా ఉంటాయి. భూమిలో 1.6 కిలోమీటర్ల లోతున గుంతల్లో రాతి బిలాల లోపల చిన్న మాడ్యులర్ రియాక్టర్లను ఏర్పాటు చేయటం ద్వారా భద్రతా సమస్యల్ని కనిష్ట స్థాయికి తగ్గించవచ్చేమో పరిశీలించారు. కానీ అవి ఇప్పటికీ నిరూపితంకాని సాంకేతికతలు.

'శాంతి' చట్టం ప్రయివేటు అణువిద్యుత్ కర్మాగారాలకు ఒక నియంత్రణా చట్రాన్ని ఏర్పరిచింది. యాజమాన్య పరిహార బాధ్యతను పరిమితం చేసింది. ప్రభుత్వం పరిహార పరిధిని నిర్వచించకుండా వదిలేయటం, విద్యుత్ ఖర్చు భారీగా పెరగటం పట్ల ఆందోళనలు వ్యక్తమయ్యాయి. భారత్ లాంటి పెద్ద దేశం, అంతర్జాతీయంగా బలమైన పాత్ర పోషిస్తున్న దేశం అణుఇంధనాన్ని విస్మరించలేదు. ప్రస్తుతం మనకు 25 అణు రియాక్టర్లున్నాయి. వాటి మొత్తం సామర్థ్యం 8880 మెగావాట్లు. దేశం మొత్తం విద్యుదుత్పత్తిలో ఇది కేవలం 3%. ఫుకుషిమా ప్రమాదం తర్వాత అన్ని అణు కర్మాగారాలను మూసివేసిన జర్మనీని మినహాయిస్తే, జీ-20 దేశాలన్నిటిలోకీ అతి తక్కువ అణువిద్యుత్ వాటా ఉన్న దేశం భారత్.

ఈ నేపథ్యంలో, మరికొన్ని అణు ప్లాంట్లను ఏర్పాటు చేయటం, అణువిద్యుత్ వాటాను పెంచటం ఆచరణ సాధ్య విధాన మార్గంగానే కనిపిస్తుంది. కానీ 2047 నాటికి 100 గిగావాట్ల సామర్థ్యాన్ని లక్ష్యంగా పెట్టుకోవటం మితిమీరిన, ప్రమాదావకాశాలకు ఆస్కారమున్న నిర్ణయం. అధిక ఖర్చుతో దీర్ఘకాలిక విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు, నిర్వచించని మొత్తాల్లో ప్రభుత్వం పరిహారం చెల్లించే విధంగా ఒప్పందాల్ని కుదుర్చుకుంటే, తర్వాత మోయలేని భారమయ్యే అవకాశముంది.

గత దశాబ్దకాలంలో సౌర విద్యుదుత్పత్తి ఖర్చులు బాగా తగ్గాయి. ఇటీవలి బిడ్‌లలో ధరల ప్రతిపాదనలు కిలోవాట్‌కి సుమారు రూ.2.50 పైసలు. వాస్తవిక అంచనాల ప్రకారం, నిల్వ చేసిన సౌర విద్యుత్ సరఫరాకి కిలోవాట్ కి రూ.5.50 నుండి రూ.6.00 వరకు ఖర్చవుతుంది. ఇది సమంజసమైన ధర. ఉత్పత్తి సమయంలో సౌర విద్యుత్తులో కొంతభాగం వినియోగమవుతుంది. విద్యుత్ వాహనాలు, సాగునీరు, నీటి పంప్‌లు పగటిపూట మాత్రమే వినియోగించేలా వేళలు నిర్దేశిస్తే, సౌర విద్యుత్తు సగటు ఖర్చు బహుశా కిలోవాట్‌కి రూ.4 లోపు ఉండొచ్చు. మెరుగైన సాంకేతికతలతో (ఉదా: పెరోవ్ స్కయిట్) సౌర విద్యుదుత్పత్తి ఉన్నకొద్దీ చౌకగా మారుతోంది. బ్యాటరీలు కూడా నాణ్యతలో పెరుగుతూ ధరల్లో తగ్గుతున్నాయి. సౌరశక్తిని నిల్వ చేసేందుకు జలాశయాల నీటిని పైకి తీసుకెళ్లి రాత్రి వేళల్లో, సూర్యకాంతిలేని ఇతర సమయాల్లో టర్బయిన్ల ద్వారా ఆ నీటిని కిందికి విడుదల చేసి విద్యుత్ ను ఉత్పత్తి చేస్తారు. గురుత్వాకర్షణ శక్తిగా పైన నీటిలో నిల్వ ఉండే సౌర శక్తి ఈ రకంగా సుస్థిర, సురక్షిత విద్యుత్‌గా మారుతుంది. అయితే ఈ తరహా ప్రాజెక్టులు పూర్తికా వటానికి కొంత సమయం పడుతుంది.

వీటన్నిటినీ పరిగణలోకి తీసుకుని మనం ఆచరణసాధ్యంగా వ్యవహరించటం సరైన విధానమవుతుంది. ఇప్పుడు అనుకుంటున్న 100 గిగావాట్ల కంటే బాగా తక్కువ అణువిద్యుత్ సామర్థ్యాన్ని లక్ష్యంగా నిర్దేశించుకోవటం మేలు. జాతీయ భద్రతావసరాల విషయంలో మనం ఎక్కడా రాజీపడం. పూర్తిస్థాయి చర్యలు తీసుకుందాం. కానీ అది పౌర అణువిద్యుత్ పరిధి మించిన కార్యక్రమం.. ఇదే సమయంలో థోరియం అణు రియాక్టర్లు; భూగర్భంలో బాగా లోతులో అణు రియాక్టర్లు, అణు స్థావరాల ఏర్పాటుకు సంబంధించి అత్యాధునిక పరిశోధనలు నిర్వహించాలి. అణువిద్యుత్‌ను సుస్థిర విద్యుత్ వనరుగా వినియోగించుకునే విషయంలో మాత్రం మనం ఆచితూచి వ్యవహరించటం వివేచన అవుతుంది. ✧

# పశ్చిమాసియాలో యుద్ధం..ప్రజల భవితవ్యం




**ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ ..ప్రతీకారంగా ఆ దేశాలపై ఇరాన్..పరస్పర దాడులకు దిగుతున్నాయి. పశ్చిమాసియాలో అల్లకల్లోల పరిస్థితులు నెలకొన్నాయి. దీనికి కారణం ఏమిటి? ఇరాన్ ఉగ్రవాదాన్ని ఎందుకు పెంచి పోషిస్తోంది.. పశ్చిమాసియాలో నెలకొన్న తాజా పరిస్థితి, ఇది మూడో ప్రపంచ యుద్ధానికి దారి తీస్తోందా? తదితర అంశాలపై లోక్‌సత్తా, ఎఫ్‌డీఆర్ వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ ఇంటర్వ్యూ జనబలం పాఠకుల కోసం..**

**ప్రశ్న: పశ్చిమాసియా దేశాల్లో యుద్ధానికి కారణాలను వివరిస్తారా?**



**జేపీ:** ఒక పెను విషాదం వెనకాల మనం చరిత్రను చూడాలి. నిన్న, మొన్న ఏం జరిగిందనేది కాకుండా, వెనకాల చాలా మౌలికమైన కారణాలు ఉంటాయి. ముందుగా ఇరాన్ గురించి ఆలోచిస్తే మనకందరికీ గుండె చెరువవుతోంది. చాలా దేశాల్లో ఉన్నట్టు ఇరాన్‌లో అంతర్ యుద్ధాలు, హింస గతంలో లేవు. ఓ సుదీర్ఘ చరిత్ర, నాగరికత ఉన్నటు వంటి దేశం ఇరాన్ 2400 సంవత్సరాల క్రితం పర్షియన్ సామ్రాజ్యం ఉండేది. ప్రపంచంలో చాలా గొప్ప సామ్రాజ్యం. దేరియస్‌ను ఓడించి పర్షియన్ సామ్రాజ్యాన్ని గెలిచాకే అలెగ్జాండర్ ప్రపంచ విజేత అయ్యాడు. లేకపోతే అలెగ్జాండర్‌కు ఆ ఖ్యాతి వచ్చేది కాదు. ఇరాన్ ఒకప్పుడు ఆధునిక నాగరికతలో భాగస్వామ్యం ఉన్న దేశం. మధ్య యుగాల చాంధసం అక్కడ కనిపించేది కాదు. కొన్ని దేశాల్లో మనకు ఈ చాంధసం కనిపిస్తోంది.. ఉదాహరణకు ఆఫ్ఘనిస్థాన్.. వాళ్లు ఏనాడు కూడా ఆ తెగల నుంచి బయట పడలేదు.. ఆధునికత వైపు అడుగులు వేయలేదు. ఇరాన్ అలా కాదు.. గణనీయమైన నాగరికత ఉన్న దేశం. ఆధునిక యుగంలో గత వందేళ్లుగా చూసుకున్నా కూడా ఆధునికీకరణలో భాగస్వామిగా ఉన్న దేశం. ఇరాన్‌లో మత చాంధసం ఒక స్థాయికి మించి ఉండదు. మహిళలకు హక్కులున్నాయి. వారి హక్కులను కాలరాయలేదు. ఆ సమాజంలో వాళ్ళు పాటించేది ఇస్లామ్, షియా ఇస్లామ్. అయినా కూడా ఇతర మతస్థులను చంపడం కానీ లేదా వెలివేయడం కానీ చేయలేదు. ఇతర మతాలు వారు అక్కడి నుంచి పారిపోవాల్సిన అవసరం లేదు. మంచి విద్య, ఆధునిక టెక్నాలజీ ఉన్నాయి. వైద్యం వంటి వృత్తుల్లో మంచి నైపుణ్యం ఉంది. ఇలా ఆధునిక నాగరికత ఉన్న దేశం ఇరాన్. అలాంటి దేశం ఇవాళ ఒక తీవ్రమైన సంక్షోభంలో చిక్కుకుంది. దీనికి

ప్రధాన కారణం తెలుసుకోవాలంటే...కొంచెం 50 ఏళ్ల క్రితానికి వెళ్లాలి. 'షా' అంటే ఆ దేశ చక్రవర్తి. చక్రవర్తి పరిపాలనలో ఆ దేశం ఉన్నా పార్లమెంట్ కూడా ఉండేది. ఎన్నికలు జరిగేవి. ప్రభుత్వం, ప్రతిపక్షం ఉండేవి. 'షా' కి పరిమితమైన అధికారాలు ఉండేవి. పూర్తి ప్రజాస్వామ్యం కాకపోయినా కూడా ప్రజాస్వామ్య ప్రభుత్వం ఒకటి నడిచేది. మొసద్ దగ్గర అభ్యుదయ భావాలు కలిగిన ఓ వ్యక్తి ప్రధానమంత్రి అయ్యాడు. వలస రాజ్యాలకు వ్యతిరేకంగా గట్టి భావజాలం ఉన్నవాడు. ఇరాన్‌కు ప్రధాన ఆదాయ వనరు ముడి చమురు. బ్రిటన్ ఒకప్పుడు ప్రపంచంలోనే అగ్రరాజ్యం..అతిపెద్ద సామ్రాజ్యం. కాబట్టి సహజంగానే ఆయిల్ కంపెనీలు బ్రిటన్ చేతుల్లో ఉన్నాయి. ఇరాన్‌లో ఉన్న చమురు ఇరాన్ వాసులకే దక్కాలని వాటిని ప్రధాని జాతీయీకరణ చేశాడు. మా ప్రయోజనాలకు భంగం కలిగిస్తున్నాడని అతడ్ని తొలగించాలని బ్రిటన్ గట్టిగా పట్టుబట్టింది. అమెరికా దానికి ఒప్పుకోలేదు. అయినా గట్టిగా పట్టుబట్టి , అమెరికాను ఒప్పించి రెండు దేశాలు కలిసి మోసట్‌తో ప్రతిష్టను దిగజార్చే ఒక ఇంటెలిజెన్స్ ఆపరేషన్ ఒకటి చేపట్టాయి..ప్రధానిపై దేశంలో రకరకాల పుకార్లు పుట్టించి, ప్రజల్లో అప్రతిష్ట పాలుజేశారు. ప్రజల్లో వ్యతిరేకత వస్తుందేమోనని ఆ ప్రధానిని తప్పించడానికి ఆనాటి చక్రవర్తి సిద్ధపడలేదు. అయితే బ్రిటన్, అమెరికా షా మెడలు వంచి ప్రధానిని తొలగించేలా చేశారు. ఆతర్వాత ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం లేకుండా నిషేధించారు. ఆ తర్వాత షా కి సర్వాధికారాలు వచ్చాయి. అయినా ఆయన ఆధునికీకరణ వైపే మొగ్గు చూపాడు. మతం ప్రాధాన్యత తగ్గించి ఆధునిక భావాలతో విద్యను అమలు చేశాడు. టెక్నాలజీ, మౌలిక సదుపాయాలు, దేశ రక్షణ ఇలా అన్నీ ఆధునికీకరించాడు. ప్రతీ సమాజంలో అందునా ప్రాచీన సంప్రదాయ సమాజంలో ఆధునికీకరణకు వ్యతిరేకులు, ఆధునికీకరణ వల్ల లాభపడేవారు కొందరుంటారు. నష్టపోయేవారు కొందరు ఉంటారు..ఉదాహరణకు మనకి 1991లో నూతన ఆర్థిక విధానాలు వచ్చినప్పుడు మన నాయకత్వం చాలా ముందు చూపుతో వ్యవహరించింది. పీవీ నరసింహారావు కానీ, ఆ తర్వాత వచ్చిన వాజ్‌పేయికానీ చాలా ముందు చూపుతో వ్యవహరించారు. అందర్నీ కలుపుకుని పోయే ప్రయత్నం చేశారు. కాబట్టి ఈ దేశంలో తీవ్ర ప్రతిఘటన రాలేదు. అయినా కానీ కొన్ని పార్టీలు, సంఘాలు ప్రపంచ వాణిజ్య ఒప్పందానికి వ్యతిరేకంగా దేశంలో ఉద్యమాలు నిర్వహించాయి.. ట్రేడ్ యూనియన్లు సమ్మెలు చేశాయి. అవన్నీ జరిగినా మన నాయకత్వంలో ఉన్న ముందు చూపువల్ల మనం వాటిని అమలు చేయగలిగాం. అంటే ప్రజాస్వామ్య



బద్ధంగా కనుక అందర్నీ కలుపుకుపోయేతత్వం ఉన్నట్టయితే ప్రతిపక్షం ప్రజాస్వామ్య బద్ధంగా,..ప్రజల ఆకాంక్షలకి గొంతిచ్చే అవకాశం, మతాతీతంగా ఉన్నట్టయితే అప్పుడు ఒకవేళ ప్రభుత్వం మీద కోపం వచ్చినా కూడా ప్రతిపక్షాలకి వెళుతుంది. అప్పుడు రాజకీయంలో వాళ్లు గెలుస్తారు..వీళ్లు ఓడుతారు. మీకు గుర్తుందో లేదో 1991లో ఆర్థిక సంస్కరణలు వచ్చాయి..1994 ఎన్నికల్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, కర్ణాటకలో ఎన్నికలు వచ్చాయి..ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోయింది. ఏపీలో ఎన్టీఆర్, కర్ణాటకలో రామకృష్ణ హెగ్డే అధికారంలోకి వచ్చారు. చాలా మంది ఇది ఆర్థిక సంస్కరణలకు వ్యతిరేకంగా వచ్చిన తీర్పు అని ప్రచారం చేశారు. నాలాంటి వాళ్లం గట్టిగా చెప్పాం. ఆనాటి ముఖ్యమంత్రి ఎన్టీరామారావుగారికి కూడా చెప్పాను..ఈ తీర్పు ఆర్థిక సంస్కరణలకు వ్యతిరేకంగా కాదు..సమాజంలో కష్టపడే వాళ్ల బాధను గమనించని ఆర్థిక వ్యవస్థ ఉండడం చేత అని చెప్పాను..కాబట్టి ఆర్థిక సంస్కరణలు కావాలి..అదే సమయంలో సామాన్యుడి బతుకును కూడా ఆలోచించాలి. అంతేకానీ సంస్కరణలకు వ్యతిరేకంగా కాదు. అదే పంథాను రామకృష్ణ హెగ్డే, ఎన్టీ రామారావు అనుసరించారు. కాబట్టి ప్రజాస్వామ్య బద్ధంగా గనుక ప్రతిపక్షాలు ఉంటే ఒకవేళ ఆర్థిక సంస్కరణలు లేకపోతే ఆధునికీకరణ వల్ల నష్టపోతున్న వర్గాలకు ఒక అండ ఉంటుంది. అక్కడ ముసాబీకు వంటి వారు లేకుండా చేసేసరికి ఏమైంది. ప్రతిపక్షం ఒకే పక్షమైంది. అది మతపక్షం. మామూలుగా ఎలాంటి రాజ్యమున్నా సరే. నియంతృత్వమైనా, రాచరికం ఉన్నా, మత సంస్థల మీద పెద్దగా వాళ్లు ఎక్కుపెట్టరు.. ఎంతకంటే మతం అనేది కొన్ని వేల సంవత్సరాలుగా ప్రజల మనస్సుల్లో పాతుకుపోయింది. మతానికి వ్యతిరేకంగా వీరు ఏమైనా చేస్తే ప్రజల్లో ప్రతిఘటన వస్తుంది. కాబట్టి ఆ మతంలో ఉన్న


వాళ్లు లేదా మత సంస్థలు, మతాచార్యులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా బహిరంగంగా ప్రకటనలు ఇచ్చి వారిని దింపేస్తామంటే అప్పుడు మత సంస్థలపై గురి పెడతారు. అలా కాకుండా వారి మతాన్ని వారు ప్రచారం చేసుకున్నంత కాలం సాధారణంగా అధికారంలో ఉన్న వాళ్లు వదిలేస్తారు. హిట్లర్ ఆపనే చేశాడు. క్రిస్టియన్ చర్చి వల్ల తనకేమీ ఇబ్బంది లేదనుకున్నప్పుడు చర్చిలను వదిలేశాడు. వాళ్ల పని వాళ్లు చేసుకున్నారు. అలాగే సోవియట్ రష్యా. సోవియట్ ఆధీనంలో తూర్పు యూరప్ దేశాలు ఉన్నాయి. అక్కడ మత సంస్థలను వదిలేశారు. వాళ్ళు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రకటనలు చేసి ఆర్గనైజ్ చేస్తే ఊరుకునే వారు కాదు..అలా లేకుండా ఉంటే వాళ్ల పని వాళ్లు చేసుకునేవారు. చివరకు అదే తూర్పు జర్మనీలో జర్మనీ ఏకీకరణకు కారణమైంది. నేను అక్కడ లీప్జిగ్ అనే నగరానికి వెళ్ళాను. తూర్పు జర్మనీలో ఒక ప్రీస్ట్ ఉన్నాడు. ప్రతీ ఆదివారం కూడా జీసస్ క్రీస్తు బోధనలతో పాటు, పాలనలో ఉన్న లోపాలను ఎత్తి చూపేవాడు. కానీ నేరుగా కమ్యూనిస్టు పార్టీలకు వ్యతిరేకంగా మాట్లాడేవాడు కాదు. ఆ పాలనలో ఉండే తప్పును ఎండగట్టే ప్రయత్నం చేశాడు. అధికారంలో ఉన్న నాయకుల్ని వ్యక్తిగతంగా తిట్టలేదు. కానీ తన మతాన్ని, మత సాంప్రదాయాన్ని ఉపయోగించి రాజ్యంలో ఉన్న లొసుగుల్ని బయటపెట్టేవాడు. అవే ప్రజల్లో ప్రచారమయ్యేవి. ఆ ప్రీస్ట్ చెప్పేది వినేందుకు వేలాది మంది గుమిగూడేవారు. ఆ చర్చిలో స్థలం సరిపోకపోయే సరికి ఊరంతా మైకులు పెట్టేవారు. ప్రతీ ఆదివారం ఊరంతా కిక్కిరిసిపోయి ఉండేది. చివరికి అదే బెర్లిన్‌లో పతనానికి దారి తీసింది. అదే పద్ధతిలో అంతకు ముందు బ్రిటన్ కానీ అమెరికా కానీ చేసిన పొరబాటు వల్ల షా మీద వ్యతిరేకత వచ్చినా అదంతా సొమ్ము చేసుకుంది మత సంస్థలు. ఆ కారణంగా షా దేశం నుంచి వెళ్లిపోవాల్సి వచ్చింది. ఖమేనీ అధికారం చేపట్టాడు. ఆధునికీకరణను కొనసాగించి, తమ మత విశ్వాసాల్ని పరిమితమైన మోతాదులో కనుక వ్యాప్తి చేసి, తమ దేశ ప్రజల సౌభాగ్యం కోసం, వారి ఆర్థిక పరిపుష్టి కోసం, ప్రజల సంక్షేమ కోసం పనిచేస్తే ఒక రకంగా ఉండేది. వీళ్లేం చేశారు. మత చాంధసాన్ని అడ్డు పెట్టుకుని ప్రజల సంక్షేమం తప్ప మిగతా అన్నీ పట్టించుకున్నారు. వెంటనే అమెరికా ఎంబసీ మీద దండయాత్ర చేసి ఆక్రమించారు. హిట్లర్ లాంటి నరహంతకుడు కూడా ఏనాడు అమెరికా కానీ, బ్రిటన్ కానీ ఫ్రాన్స్ కానీ సోవియట్ యూనియన్ కానీ, వాళ్ల ఎంబసీలను ఆక్రమించలేదు. రెండో ప్రపంచ యుద్ధం జరుగుతున్న కాలంలో కూడా వాళ్లు దౌత్యపరమైన ఇబ్బందులు పెట్టలేదు. వాళ్లను

తమ దేశ ప్రజల సౌభాగ్యం కోసం వారి ఆర్థిక పరిపుష్టి కోసం ప్రజల సంక్షేమ కోసం పనిచేస్తే ఒక రకంగా ఉండేది. వీళ్లేం చేశారు. మత చాంధసాన్ని అడ్డుపెట్టుకుని ప్రజల సంక్షేమం తప్ప మిగతా అన్నీ పట్టించుకున్నారు. వెంటనే అమెరికా ఎంబసీ మీద దండయాత్ర చేసి ఆక్రమించారు.

చంపలేదు వాళ్లను జైల్లో పెట్టలేదు. అలాంటిది వీళ్లను చెరబట్టి నానా హింసల పాలు చేశారు. అలాగే దేశ ప్రజల సంక్షేమం గురించి పట్టించుకోకుండా ఇజ్రాయిల్ నాశనం కావాలా..అసలు ఉండడానికి వీల్లేదని వాదించారు. పాలస్తీనియన్లకు స్వతంత్ర రాజ్యం కావాలి. రెండు రాజ్యాలు అవసరం. పాలస్తీనియన్ల హక్కులు కాపాడాలనే వాదనను ప్రపంచం అంతా అంగీకరిస్తుంది. అమెరికా అంగీకరించింది. ఇజ్రాయిల్‌లో చాలా ప్రభుత్వాలు అంగీకరించాయి. భారతదేశం దానికి కట్టుబడి ఉంది. అసలు ఇజ్రాయెల్ ఉండడానికే వీల్లేదు. నామరూపాలు లేకుండా చేయాలని .. డెత్ టూ అమెరికా, డెత్ టూ ఇజ్రాయెల్..అని అధికారికంగా ప్రకటించారు. అమెరికా లాంటి దేశం ఉండకూడదు నాశనం కావాలని కోరుకున్నారు. అంతటితో ఆగకుండా అణ్వాయుధాలను సేకరించి ఇజ్రాయెల్‌ను భస్మీపటలం చేస్తాం, అమెరికాను అతలాకుతలం చేస్తామన్నారు అక్కడితో కూడా ఆగకుండా నాలుగు టెర్రరిస్టు దళాల్ని అధికారికంగా ఏర్పాటు చేశారు. ఇజ్రాయెల్‌ను దెబ్బ కొట్టాలని వాళ్లకు అపారమైన ఆయుధ సంపత్తిని అందిం చారు. ఒక స్వతంత్ర దేశంలోని సైన్యానికి ఎన్ని ఆయుధాలు ఉంటాయో ఒక టెర్రరిస్టు బృందానికి అధికారికంగా అన్ని ఆయుధాలు ఇచ్చారు. అలాగే రెండేళ్ల క్రితం హమాస్.. ఎంత దారుణానికి ఒడిగట్టిందో చూశాం. అక్కడి నుంచి గాజాలో ఏం జరిగిందో మనం చూశాం.

లాటే హౌచిస్ యెమన్‌లో ముస్లిం బ్రదర్ హుడ్ ఇరాక్, సిరియా ప్రాంతాల్లో ఈ రకంగా ఆధునిక ప్రపంచ చరిత్రలో ఏ స్వతంత్ర దేశం బలపడని రీతిలో అధికారికంగా ప్రభుత్వమే టెర్రరిస్టు దళాలను పబ్లిక్‌గా బస్తీమే సవాల్ అని బహిరంగంగా ప్రోత్సహించింది. ఈ నేపథ్యంలో ప్రస్తుత సంఘటనను చూడాలి. వాళ్లే కనుక ఈ అణ్వాయుధాల వ్యాప్తిని అరికట్టడానికి సిద్ధపడి బహిరంగా ప్రకటన చేసినట్లయితే ఇంకో రకంగా ఉండేది. అలాకాకుండా

అణ్వాయుధాల మీద కూర్చున్నారు. ఒబమా సమయంలో ఒక ఒప్పందం కుదుర్చుకున్నారు..కానీ ఆ ఒప్పందం లోపభూయిష్టం అన్నది వాస్తవం. కొంతకాలం పాటు అణ్వాయుధాల వ్యాప్తికి అవకాశం లేకుండా ఆగుతాము.. తర్వాత మా ఇష్టం అన్నారు...రెండోది: టెర్రరిస్టు దళాలను తయారు చేశారు..వారిని ఏం చేస్తారంటే? అది మా ఇష్టం. అవన్నీ కొనసాగుతాయని చెప్పారు. ట్రంప్ దాన్ని ఏకపక్షంగా రద్దు చేశాడు. అణు విద్యుత్ కోసం అయితే మామూలుగా 3.5శాతం యూరేనియంను వాళ్లు ఎన్‌రిచ్ మెంట్ చేయాలి. కానీ 60 శాతం వరకు చేశారు. 60శాతం ఎన్‌రిచ్‌మెంట్ ఏ శాంతియుత ప్రయోజనాలకూ అవసరం ఉండదు. అది కేవలం అణ్వాయుధాల కోసం మాత్రమే, అదేమంటే బస్తీమే సవాల్ అంటున్నారు. ఇక టెర్రరిస్టుల గొడవ కొనసాగుతున్నాయి. ఆ దేశం లోపలి ప్రజల జీవితాలు అతలాకుతలం చేశారు. పాపం అమాయకులైన ఆడ పిల్లల హిజాబ్ వేసుకున్నాకా కూడా జుట్టు కొంచెం కనపడిందన్న కారణంతో వారందరినీ అరెస్ట్ చేసి చంపేయడం, ప్రజలు తిరగబడితే క్రూరంగా అణిచివేయడం జరిగింది. ఇటీవల అమెరికా కానీ ఇతర దేశాలుకానీ ఆర్థిక ఆంక్షల కారణంగా అక్కడి పరిస్థితుల గందరగోళంగా ఉన్నాయి. మంచి దేశం.. ఒక రకంగా మధ్య స్థాయిలో సంపన్నవంతమైన దేశంలో జీవితాలు అతాలకుతలం అయ్యే సరికి శాంతియుతంగా ప్రజలు తిరగబడ్డారు..నెలా పదిహేను రోజుల క్రితం వారిని ఊచకోత కోశారు. 30 వేల మంది దాకా అమాయకుల్ని, నిరాయుధుల్ని చంపేశారని అంటున్నారు. అంటే ఆ రాజ్యానికి ఎవరు ఎదురు వచ్చినా సరే.. మేం వాళ్లని బతకనివ్వమని చెప్పి బలమైన సందేశాన్ని ఇచ్చారు. ఈనేపథ్యంలో ఈ సంప్రదింపులు జరిగాయి. అమెరికా సైన్యాన్ని మోహరిస్తే అందరం ఏం అనుకున్నామంటే ఇరాన్ దారికొస్తుందని. సంప్రదింపుల్లో ఏం జరిగిందో తెలియదు..బహుశా అణ్వాయుధ వ్యాప్తిని అరికట్టడమే లక్ష్యం అనుకున్నట్టయితే యుద్ధం ఆగి ఉండేది. ఇరాన్ కొంచెం దిగి వచ్చేదేమో? కానీ ఈ పరిస్థితులను చూస్తుంటే అణ్వాయుధాలవ్యాప్తి ఒక్కటే లక్ష్యం కాదు, అక్కడ ఇరాన్‌లో రాజ్యం చేస్తున్న ముల్లాలను దింపాలని చూస్తున్నట్టు కనిపిస్తుంది..అప్పుడు ఎలాంటి ఒప్పందమూ సరిపోదు. అక్కడ ప్రభుత్వంలో ఉన్నవాళ్లు మీ ప్రభుత్వం పోవాలి.. మీరందరూ రాజ్యం చేయడానికి వీల్లేదు అంటే సర్వాధికారాలతో రాజ్యం చేస్తున్న వాళ్లు తన మరణశాసనం తాను రాసుకుంటాడా? కాబట్టి యుద్ధమే మార్గం అవుతుంది. బహుశా ఆ కారణం కావొచ్చు. కానీ ఈ వేళ చివరికి నష్టపోతుంది ఇరాన్ ప్రజలు. దీనివల్ల కనుక ఇరాన్‌లో కొత్తగా




ఏర్పడిన నాయకత్వం పూర్తిగా అణ్వాయు ధాలకు స్వస్తి చెప్పి ఈ ప్రజల్ని ఊచకోత కోయడం ఆపేస్తే జననష్టం అయినా కూడా కొంచెం మంచి ఫలితం వచ్చినట్టు లెక్క. . అలా కాకుండా అధికారంలో ఉన్న వాళ్లు దిగిపోయినట్టయితే ప్రత్యామ్నాయంగా ప్రజాస్వామ్యబద్ధంగా , ప్రజల ఆకాంక్షల మేరకు ప్రభుత్వం వస్తే ప్రజలకు మేలు జరుగుతుంది. అలా కాకుండా ముల్లాల రాజ్యమే కొనసాగి.. వారు అణ్వాయుధాల వ్యాప్తి అరికట్టడానికి ఒప్పుకున్నా కూడా ఆ దేశం లోపల మాత్రం గతంలో లాగే ఊచకోతను కొనసాగిస్తే ఇరాన్ ప్రజలు భయంకరమైన సంక్షోభంలో చిక్కుకుంటారు. ఏం జరుగుతుందో మనం చూడాలి. ఈ ప్రభుత్వమే కొనసాగినా లేదా కొత్త ప్రభుత్వం ఏర్పడినా ఇరాన్ ప్రజల హక్కులను, ప్రయోజనాలను కాపాడుతుందని ఆశిద్దాం. ప్రపంచంలో ఉగ్రవాదాన్ని అణిచివేసి, అణ్వాయుధాల వ్యాప్తిని అరికడతారని ఆశిద్దాం. కానీ ఏం జరుగుతుందో మనం చెప్పలేం.

**ప్రశ్న: ఇది మూడో ప్రపంచ యుద్ధానికి దారి తీస్తుందని అంటున్నారు...దీనిపై మీరు ఏం అంటారు?**

**జేపీ:** మూడో ప్రపంచ యుద్ధానికి అవకాశం లేదు. ఏం జరిగినా కూడా వెంటనే చాలా మంది ప్రపంచ యుద్ధం వస్తుందేమో అని అంటుంటారు. ఇక్కడ ఇరాన్‌కు అనుకూలంగా అగ్ర రాజ్యాలు జోక్యం చేసుకోవు. అణ్వాయుధాలు ఉపయోగించే అవకాశం లేదు. అణ్వాయుధాలు ఉపయోగించిన కారణంగా వారి మీద మళ్లీ అణ్వాయుధాలు ఉపయోగించి దాని కారణంగా వేరే అగ్రరాజ్యాలు కూడా వస్తే అప్పుడు అలాంటి పరిస్థితులు వస్తాయి. అలాంటి పరిస్థితి ప్రస్తుతం లేదు. ఉదాహరణకు ఉక్రెయిన్ యుద్ధంలో మీరు చూస్తే నిజంగా అమెరికా, యూరప్ నాటో దళాలు గనుక గట్టిగా పూనుకుంటే రష్యాను నిలువరించి ఉండేయి. కానీ రష్యా తెగింపు ధోరణికి వెళ్లి మా తల్లి రష్యాకే దెబ్బ



తగిలితే ప్రపంచంలో ఇంక మానవాళి బతికితే ఏంటి? చస్తే ఏంటని రష్యా విదేశాంగ మంత్రి అన్నాడు. అంటే మీరు గనుక మమ్మల్ని ఎదిరిస్తే అమెరికాయే ప్రత్యక్షంగా దిగినట్టయితే మేం అణ్వాయుధాలను పూర్తిగా వదిలేస్తాం. మేం భస్మీపటలం అయితే అవుతాం అనే పరిస్థితికి వచ్చారు. ఆ భయం కారణంగా అమెరికా జోక్యం చేసుకోలేదు. లేకపోతే రష్యాను నిలవరించడం పెద్ద విషయం కాదు. ఆ పని ఉక్రెయిన్నే చేయగలుగుతుంది. అమెరికా నాటో దళాలు పూనుకున్నట్టయితే ఐదు నిమిషాల్లో యుద్ధం ఆగిపోయి ఉండేది. ఈ ప్రపంచ భస్మీపటలం అయిపోతోందేమో, పరిస్థితి చేజారిపోతోందేమోనని అంత అన్యాయం జరుగుతున్నా కూడా ఉక్రెయిన్ ప్రజలకు సహించి ఊరుకున్నారు. ఇక్కడా పరిస్థితి లేదు.

ఇరాన్‌పై దాడి నేపథ్యంలో రష్యా భీకరమైన ప్రకటనలు చేసింది. చైనా ఖండించింది కానీ భీకరమైన ప్రకటన చేయలేదు. ఎందుకంటే ఇరాన్ అంటే ఎవరికీ సానుభూతి లేదు. ప్రపంచ ప్రజలకీ సానుభూతి లేదు. ఆ దేశాలకి ఇరాన్ కారణంగా తమ దేశాల్ని భస్మీపటలం చేసుకోవాలనే కోరిక లేదు. కాబట్టి ప్రపంచయుద్ధం సమస్య ఉత్పన్నం కాదు.


జీవితాలు అతలాకుతలం కావాలంటే ప్రపంచ యుద్ధం రావక్కర్లా.. ఇవాళ అరబ్ దేశాలన్నిటి మీదా ఇరాన్ దాడులు చేసింది. మరి అవన్నీ కూడా శాంతియుతంగా జరుగుతున్నాయి..ఈ మధ్యకాలంలో ఆధునికీకరణకు దారి తీస్తున్నాయి..ఒకప్పుడు సౌదీ అరేబియా చాలా చాంధసభావాలకు ప్రతీక. ప్రపంచంలో చాంధసవాదాన్ని పెంచిన దేశం. అలాంటిది ఇప్పుడు ఆ దేశం అవన్నీ పక్కన పెట్టేసి ఆధునికీకరణ, ఆర్థిక ప్రగతి, ప్రపంచశాంతి, ఇరాన్‌తో శాంతి కోరుకుంటున్నాయి. వాళ్లమీద దాడికి దిగారు. ప్రపంచంలో

**జీవితాలు అతలాకుతలం కావాలంటే ప్రపంచ యుద్ధం రావక్కర్లా.. ఇవాళ అరబ్ దేశాలన్నిటి మీదా ఇరాన్ దాడులు చేసింది.యుద్ధం కారణంగా ఇన్సూరెన్స్ కంపెనీలు ఆ ఓడలకు ఇన్సూరెన్స్ ఇవ్వడం లేదు. అక్కడి నుంచి రవాణా ఆగిపోయింది. రేపొద్దున ఆయిల్ ధరలు పెరుగుతాయి. ఆయిల్ అందడం అలస్యం అవుతుంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటుంది. విమానయానాలు ఆగిపోయాయి. ఆర్థిక వ్యవస్థ దెబ్బతింది. లక్షలాది మంది ప్రపంచ దేశాల్లో ఉన్నవాళ్లు వాళ్లంతా కొంచెం గందరగోళంలో ఉన్నారు. కాబట్టి ప్రపంచ యుద్ధం రావక్కర్లేదు. చాలా అతలాకుతలం అవుతుంది.**

30,40 శాతం ఇంధనం అంతా కూడా అక్కడి నుంచి వస్తుంది. అక్కడ నుంచి యుద్ధం కారణంగా ఇన్సూరెన్స్ కంపెనీలు ఆ ఓడలకు ఇన్సూరెన్స్ ఇవ్వడం లేదు. అక్కడి నుంచి రవాణా ఆగిపోయింది. రేపొద్దున ఆయిల్ ధరలు పెరుగుతాయి. ఆయిల్ అందడం అలస్యం అవుతుంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటుంది. విమానయానాలు ఆగిపోయాయి. ఆర్థిక వ్యవస్థ దెబ్బతింది. లక్షలాది మంది ప్రపంచ దేశాల్లో ఉన్న వాళ్లంతా కొంచెం గందరగోళంలో ఉన్నారు. కాబట్టి ప్రపంచ యుద్ధం రావక్కర్లేదు. చాలా అంశాల్లో ప్రపంచం అతలాకుతలం అవుతుంది. ఇది గనుక వారం పది రోజుల్లో తేలిపోతే కొంత ఇబ్బంది అయినా కూడా ప్రపంచం తట్టుకుంటుంది. రెండు వారాలు దాటిపోయినట్టయితే ఆయిల్ ధరలు పెరగడం , ప్రపంచ వాణిజ్యం, ఆర్థిక వ్యవస్థలు దెబ్బతింటామఅయి. యుద్ధం పర్యవసానాలు తీవ్రంగా ఉంటాయి. ✧

## రైజింగ్ తెలంగాణ, స్వర్ణాంధ్ర, వికసిత్ భారత్‌కి కీలక సీక్రెట్

# ‘అధికార వికేంద్రీకరణ -- స్థానిక ప్రభుత్వాల సాధికారత’




తెలంగాణ ప్రభుత్వం ఇటీవల అట్టహాసంగా ‘రైజింగ్ తెలంగాణ 2047’ విజన్ డాక్యుమెంట్‌ని విడుదల చేసింది. ఆ వివరాల్ని రిపోర్ట్ చేస్తూ, ప్రయత్నం ప్రశంసనీయమని, అయితే విజన్‌కి తగ్గ విధానాలు ప్రశ్నార్థకమని ‘జనబలం’ జనవరి సంచికలో తెలియచేశాం. ప్రధానంగా తెలంగాణ దార్శనిక పత్రానికి స్ఫూర్తిగా తీసుకున్న గ్వాంగ్ డాంగ్‌తో పోలుస్తూ వివరించాం. ఇదే విమర్శనాత్మక సూచనను తెలంగాణ రైజింగ్ కమిటీలో ప్రత్యేక సలహాదారుగా ఉన్న నోబెల్ గ్రహీత అభిజిత్ బెనర్జీ కూడా తాజాగా చేశారు. దార్శనిక పత్రం విడుదల కార్యక్రమంలో ఆయన వర్చువల్‌గా అమెరికా నుండి పాల్గొన్నా, ఆ సూచన చేయలేదు గానీ.. ఇటీవల సాహితీ ఉత్సవం కోసం హైదరాబాద్ వచ్చిన సందర్భంగా చర్చా గోష్టిలో స్పష్టంగా ప్రకటించారు. తెలంగాణకే కాదు, మొత్తం భారతదేశానికీ ఇది తక్షణావసరమని, ఎఫ్.డి.ఆర్/ లోక్‌సత్తా జేపీ దశాబ్దాలుగా గొంతు చించుకుంటున్న విషయాన్ని పునరుద్ఘాటించారు. భారతదేశ అసలు సక్సెస్ సీక్రెట్ ’అధికార వికేంద్రీకరణ–స్థానిక ప్రభుత్వాల సాధికారత’ అని స్పష్టం చేశారు. అయితే, స్వతంత్రం వచ్చినప్పటి నుంచి వాయిదా పడుతున్న ఆ దిద్దుబాటును పాలకుల అహం దెబ్బతినకుండా, చాలా మర్యాదగా ఆయన అందమైన ప్యాకింగ్ లో చెప్పారు.

వికేంద్రీకరణ, పాలన, ప్రభుత్వోద్యోగాల వేటలో సమయం, ఆదాయం వృధా, ఆర్థికాభివృద్ధి అంశాలపై ఆర్థికవేత్తలు అభిజిత్ బెనర్జీ, కార్తిక్ మురళీధరన్ హైదరాబాద్ లిట్ ఫెస్ట్ సందర్భంగా మీడియాతో కార్యక్రమంలో ఇచ్చిన హేతుబద్ధ సూచనలు:

⏭ భారతదేశంలో అధికారమంతా కేంద్రం లేదా రాష్ట్ర రాజధానుల వద్దే ఉంటోంది. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్ల తర్వాత వికేంద్రీకరణ సమయం ఆసన్నమైంది. ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలి

⏭ స్థానిక సంస్థలైన మునిసిపల్ కార్పొరేషన్లు, పురపాలక సంఘాలు, గ్రామ పంచాయతీలకు అధికారాల్ని, నిధుల్ని ఇవ్వాలి.

⏭ ప్రపంచంలోనే అత్యంత వికేంద్రీకృత ఆర్థిక వ్యవస్థ కావటం వల్ల చైనా విజయం సాధిస్తోంది. స్థానిక నగరాలు, గ్రామాలు తమ అభివృద్ధిని తామే చూసుకుంటాయి. భారత్ కూడా అదే దిశలో వెళ్లాలి.

⏭ అధికార వికేంద్రీకరణకు అధికారంలో ఉన్నవారెవరూ సులభంగా అంగీకరించరు. అధికారం ఒకరు ఇస్తే తీసుకునేది కాదు.

⏭ రాష్ట్రాలు ఎంతసేపూ కేంద్ర ప్రభుత్వం అన్ని అధికారాలను తన దగ్గర పెట్టుకుందని విమర్శిస్తుంటాయి కానీ.. అదే రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు మాత్రం స్థానిక సంస్థలకు అధికారాల వికేంద్రీకరణకు అంగీకరించరు.

⏭ సుమారు 7 కోట్ల జనాభా ఉన్న బ్రిటన్ లో 650 మంది ఎంపీలున్నారు. 140 కోట్ల జనాభా ఉన్న భారత్ లో 543 మంది ఉన్నారు. మన దేశంలో పార్లమెంట్ పనిచేయటం లేదు.

⏭ ప్రాజెక్టులను కాంట్రాక్టర్లకు అప్పగించటంలో ఉన్న ఆసక్తి రాజకీయ నాయకులకు వాటిని పూర్తిచేయటంపై ఉండదు. పూర్తయిన వాటి నిర్వహణకు నిధుల కేటాయింపు కొరవడి అవి నిరుపయోగమవుతున్నాయి. ఉదాహరణకు, మహారాష్ట్రలో నీటిపారుదల రంగంపై రూ.5 లక్షల కోట్లు వ్యయం చేసినా కొత్తగా సాగులోకి వచ్చిన ఆయకట్టు జీరో.

⏭ ఆర్థిక వ్యవస్థలు ఎప్పుడు పెరుగుతాయో, ఎప్పుడు ఆగిపోతాయో అంచనా వేయలేం. 2047 నాటికి భారత్ 30 ట్రిలియన్ డాలర్ల లక్ష్యాన్ని చేరుకోవటంపై ఇప్పుడే జోస్యం చెప్పలేం.

⏭ చాలామంది యువత ప్రభుత్వోద్యోగాల కోసం సం



వత్సరాల తరబడి సమయం వెచ్చించి, ఆలస్యంగా ఉత్పత్తి మార్కెట్ లోకి వస్తున్నారు. ఈ భ్రమాజనిత మనస్తత్వం దేశ ఆర్థిక వ్యవస్థను వెనక్కి నెడుతోంది.

⏭ దేశంలో లక్షల మంది జీవితాల్ని మార్చి కూడా విఫలమైన విధానాలున్నాయి. అలాంటిది – వ్యవసాయానికి ఉచిత విద్యుత్తు. అదో చిక్కు ముడి. అందులో నుండి భారత్ బయటపడాల్సి ఉంది. ఎందుకంటే, ఉచిత విద్యుత్ వల్ల నీటి వినియోగం బాగా పెరుగుతోంది. పంజాబ్ లాంటి చోట్ల వరి పండించటం విపరీతంగా పెరిగింది. దుష్ప్రభావాలు ఎక్కువ ఉంటాయి. వరి వద్దంటే రైతులు వ్యతిరేకించటానికి కారణం ప్రభుత్వం తమకు న్యాయం చేస్తుందన్న నమ్మకం లేక పోవటం. ఈ పథకాన్ని ఎక్కువకాలం కొనసాగించటం సాధ్యం కాదు. జాతీయ స్థాయిలో ఈ అంశంపై దృష్టి పెట్టాలి.

⏭ కేంద్రం, రాష్ట్రాల్లో బ్యూరోక్రసీ చేసే నియామకాలు క్షేత్రస్థాయి అవగాహనతో చేయటం లేదు.

⏭ దేశంలో అధికారుల బదిలీలు ఒక పద్ధతిలేకుండా జరగటం వల్ల, ఒక ప్రాజెక్టును మొదలుపెట్టినవారు అది పూర్తయ్యేవరకూ ఉండటం లేదు. దీనివల్ల జవాబుదారీతనం తగ్గుతోంది.

⏭ భారత్‌లో పోషకాహార లోపం సమస్యగా ఉంది. పేదలకు ఆదాయం పెరిగినప్పుడు, పోషకాహారం కొనటం లేదు. ఆహారేతర వస్తువుల కొనుగోలు, ఇతర సౌకర్యాలకు ఖర్చు పెడుతున్నారు. దీంతో, ఆహార ఎంపిక పేదల జీవితాల్లో ఓ సంక్లిష్ట అంశంగా మారింది. అంగన్ వాడీ స్థాయి నుండి పిల్లలకు పోషకాలు, విటమిన్లు ఉన్న ఆహారం అందించే ప్రయత్నం ప్రభుత్వపరంగా జరగాలి. అదే విధంగా, మహిళలకు సాధికారత కల్పించి, పోషకాహారం, కుటుంబంలో ఆరోగ్యకరమైన అలవాట్లపై అవగాహన పెంచాలి.

**ఉత్సవంలో గోపాలకృష్ణ గాంధీ**

"మహాత్మాగాంధీ మనవడిగా, రాజాజీ (సి.రాజగోపాలాచారి) మనవడిగా నాకు లభించిన వారసత్వం ఒక అదృష్టం. కానీ నా వ్యక్తిగత కృషికి అది ప్రత్యామ్నాయం కాదు. నా ఇంటి పేరు గాంధీకి న్యాయం చేయాల్సిన బాధ్యత నన్ను జీవితాంతం వెంటాడుతోంది. మా తల్లిగారి తండ్రి రాజాజీ రాజకీయ వినయం, ప్రజాస్వామ్యం పట్ల అపార నిబద్ధత గల నాయకులు. దేశ చివరి గవర్నర్ జనరల్ గా పనిచేసిన ఆయన.. 1950లో గణతంత్ర దేశంగా భారత్ అవతరించిన రోజునే ఢిల్లీలోని తన కార్యాలయాన్ని విడిచి పెట్టారు. ఆయనను నెహ్రూ మొదటి రాష్ట్రపతిగా చూడాలని అనుకున్నా.. పార్టీ ఒప్పుకోలేదు. రాజేంద్ర ప్రసాద్ ఆసక్తిని, అర్హతను గుర్తించిన రాజాజీ.. రాష్ట్రపతి పదవి గురించి ఆలోచించకుండా ఢిల్లీ వదిలి వచ్చేశారు. ఆ తర్వాత మూడు గదుల చిన్న ఇంటికి మారిపోయారు. సిబ్బంది లేరు.




సేవకులు లేరు. అలాగే నెహ్రూ, రాజాజీ మధ్య కఠిన విభేదాలు కూడా పరస్పర గౌరవాన్ని కోల్పోకుండా హుందాగా సాగాయి. 1962 చైనా యుద్ధం, అందులో స్వాతంత్ర్య సమరయోధుడు, నాటి రక్షణ మంత్రి వీకే కృష్ణ మీనన్ పాత్రపై అనేక విమర్శలున్నాయి. వ్యక్తుల్ని నిందించటానికి కాకుండా, సందర్భాన్ని అర్థం చేసుకోవటానికి కూడా చరిత్రను ఉపయోగించాలి. నేను ఐఏఎస్ లో చేరటానికి తాత రాజాజీ ఇచ్చిన సలహాయే కారణం. దేశం గురించి తెలుసుకోకుండా, దేశంపై పుస్తకం రాయటం సాధ్యంకాదన్న రాజాజీ మాటలు నా జీవిత దిశను మార్చాయి. 'భారతీయులు స్వాతంత్ర్య పోరాటానికి చేసిన కృషి కారణంగానే నా కేబినెట్ లో భారతీయ మూలాలున్నవారు ఉన్నారు' అని నెల్సన్ మండేలా స్వయంగా చెప్పారు".

✧

# స్థానిక ప్రభుత్వాల సాధికారతపై ముఖ్యమంత్రి వెంటనే అఖిలపక్షం ఏర్పాటు చేయాలి

-సి.హెచ్.విద్యాసాగర్‌రావు
మహారాష్ట్ర మాజీ గవర్నర్

తెలంగాణలో గ్రామ పంచాయతీ, పురపాలక సంఘాల ఎన్నికలు స్వావలంబన, స్వపరిపాలన లక్ష్యంగా జరగాలని, ప్రజల భాగస్వామ్యంతో గ్రామాల నుంచి పట్టణాల వరకు సర్వతోముఖాభివృద్ధి సాధ్యం కావాలని ప్రజాస్వామికవాదులు ఆశించారు. కానీ అందుకు విరుద్ధంగా ఈ ఎన్నికల ప్రక్రియ ఒక జూదంగా మారి పోయింది. పదవి కోసం ఎంతటి స్థాయి కైనా దిగజారే నాయకులతో తరతరాల నుంచి అందిపుచ్చుకున్న ఈ వ్యవస్థ మటుమాయమయ్యే పరిస్థితి ఏర్పడింది.

ముగ్గురు పిల్లలు ఉంటే ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం ఉండదని కన్నబిడ్డను సైతం చంపుకున్న అమానవీయ, పైశాచిక ఘటనలు పతనమవుతోన్న ఎన్నికల ప్రక్రియకు పరాకాష్ఠ. ఎన్నికల్లో ఓడిపోతే-- ఓటర్లకు పంచిన డబ్బులు, చీరలు తిరిగి ఇవ్వాలంటూ అభ్యర్థులు ఇల్లిల్లూ తిరగడం, ఓటర్లచే ప్రమాణాలు చేయించుకోవడం ఇటీవలి కాలంలో పరిపాటిగా మారింది. తెల్లవారితే ఎన్నికలనగా రాత్రి వీధుల్లో కుప్పలుతెప్పలుగా కనిపించే ఖాళీ కవర్లు ఎన్నికల ప్రక్రియను అపహాస్యం చేస్తున్నాయి. ఎన్నికల ఫలితాలు వెలువడక ముందే క్యాంపు రాజకీయాలు చేయడం, సిద్ధాంతాలను పక్కకుపెట్టి విరుద్ధ భావజాలం ఉన్నవారితో సంప్రదింపులు జరపడం, సొంత అభ్యర్థులను కాదని ఇండిపెండెంట్లకు మేయర్, డిప్యూటీ మేయర్, చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ పదవులను ఎర వేయడం మనం చూస్తూనే ఉన్నాం.

పంచాయతీరాజ్ వ్యవస్థకు రాజ్యాంగబద్ధ హోదా ఇస్తే గ్రామాల్లో సామాజిక విభజనలు బలోపేతం అవుతాయని బాబాసాహెబ్ అంబేద్కర్ భావించారు. అయితే మహాత్మాగాంధీ, ఇతర పెద్దలు భారతదేశ రాజకీయ చట్రంలో పంచాయతీలు పరిపాలనా విభాగాలుగా ఉండాలని ఒత్తిడి తీసుకురావడంతో విధాన నిర్దేశక సూత్రాల కింద ఆర్టికల్ 40లో పంచాయతీల కోసం నిబంధనను చేర్చారు.

బ్రిటిష్ వారు పంచాయతీ వ్యవస్థను తమ ఆధీనంలో ఉంచుకొని, శిస్తు వసూలు, వ్యాపార లావాదేవీలకు ఉపయోగపడే వ్యవస్థను తయారు చేసేందుకు తపించారు. అయితే, తమ మనుగడకు, తమ పరిపాలన కొనసాగింపునకు వ్యవస్థీకృత పంచాయతీ వ్యవస్థ అవసరమని గ్రహించి సంస్కరణలు మొదలుపెట్టారు.

18వ శతాబ్దం ప్రారంభంలో భారతదేశ సంపద ప్రపంచ సంపదలో 23శాతం ఉండేదని, అది యూరప్ దేశాల మొత్తం సంపదతో సమానమని బ్రిటిష్ చరిత్రకారుడు అంగస్ మెడిసన్ రాశారు. ఈ గత వైభవానికి కారణం స్వావలంబన, స్వపరిపాలన. ఈ వ్యవస్థను పునరుద్ధరించాలని స్వాతంత్ర్యం తరువాత ఎన్నో విధానపరమైన చర్యలు తీసుకున్నా అనుకున్నది సాధించలేకపోతున్నాం.

ప్రజలు భాగస్వాములై గ్రామసభ ద్వారా ప్రతి గ్రామాన్ని ప్రజాస్వామ్య వ్యవస్థగా తీర్చిదిద్దాలని మహాత్మాగాంధీ అన్నారు. కొందరు పైన కూర్చున్నంత మాత్రాన నిజమైన ప్రజాస్వామ్యం పనిచేయదని తెలిపారు. ప్రతి గ్రామంలో క్రింది స్థాయి నుంచి, పట్టణాల్లో వార్డు నుంచి ప్రజాసభలను నిర్వహించాలని, ప్రజలు భాగస్వాములైనప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. పండిట్ నెహ్రూ స్థానిక స్వపరిపాలన ఒక్కటే ప్రజాస్వామ్య వ్యవస్థకు మూలమని, కింది స్థాయిలో సరైన పునాది లేకపోతే ప్రజాస్వామ్యం నిర్వీర్యమవుతుందని తెలిపారు. గ్రామసభనే ప్రజాస్వామ్యానికి ప్రాతినిధ్యం వహిస్తుందని, గ్రామపంచాయతీ –– గ్రామసభల మధ్య సంబంధం క్యాబినెట్, అసెంబ్లీ మధ్య ఉండే సంబంధంలా ఉండాలని జయప్రకాశ్ నారాయణ ఉద్బోధించారు. ఓటున్న ప్రతి ఒక్కరూ గ్రామసభ, పురపాలక సంఘాలు, వార్డులవారీగా సమావేశమై చర్చించుకుంటేనే నిజమైన స్వరాజ్యం సాకారం అవుతుందని మన పెద్దలు విశ్లేషించారు.

వివిధ కమిటీలను నియమించి విస్తృతంగా చర్చించిన తర్వాత 73, 74 రాజ్యాంగ సవరణల ద్వారా పంచాయతీరాజ్, పురపాలక సంఘాల ఎన్నికలు, రిజర్వేషన్లు, ఆర్థిక వ్యవస్థకు రాజ్యాంగ హోదా కల్పించారు. దానివల్ల 1993లోనే ఈ వ్యవస్థలు రాజ్యాంగబద్ధమయ్యాయి. కానీ ఈ సవరణల ద్వారా సంక్రమించిన అంశాలను మూడు దశాబ్దాల కాలం గడిచినా, మన రాష్ట్రంలో పంచాయతీలకు, మునిసిపాలిటీలకు, కార్పొరేషన్లకు బదిలీ చేయలేదు. అదే విధంగా విధులు, నిధులు, అధికారాలు, సిబ్బందిని కూడా ఈ సంస్థలకు బదిలీ చేయలేదు. ఇవి ఇచ్చి ఉంటే ఈ సంస్థలకు చేతినిండా పని ఉండేది. పల్లెల నుంచి పట్టణాల వరకు స్వావలంబన, స్వపరిపాలన సాధించడానికి మార్గం

సుగమం అయ్యేది. అన్ని రాజకీయ పార్టీలు చర్చించి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌లకు, కార్పొరేషన్ మేయర్లకు ప్రత్యక్షంగా ఎన్నికలు జరిపిస్తే ప్రజాస్వామ్య విలువలను ఇనుమడింపజేసినవారమవుతాం.

73, 74 రాజ్యాంగ సవరణ ద్వారా సంక్రమించిన అంశాలను పూర్తిగా బదిలీ చేసి కేరళ, కర్ణాటక సహా మరికొన్ని రాష్ట్రాలు చక్కటి ఉదాహరణలుగా నిలిచాయి. మన రాష్ట్ర ప్రభుత్వం కూడా ఆ దిశలో పయనించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. తెలంగాణ పంచాయతీలలో కేవలం 29కి 14, పురపాలక సంఘాలలో 18కి 17 అంశాలనే, అదీ కాగితాలపైన మాత్రమే బదిలీ చేసి, వీటి మనుగడనే ప్రమాదంలోకి నెట్టే ఉత్తర్వులను జారీ చేసి, ప్రజాప్రతినిధులకు సంకెళ్లు వేశారు. దాంతో ఇటు ప్రభుత్వం--ప్రజాప్రతినిధులు వేల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి ఎన్నుకున్న మునిసిపల్ చైర్‌పర్సన్‌లు, కార్పొరేషన్ మేయర్లు ఉత్సవ విగ్రహాల మాదిరిగా కొలువుదీరారు. ఈ పరిస్థితులను వెనువెంటనే మార్చడానికి ముఖ్యమంత్రి అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ✧

### ఎస్.బి.ఐ ఫౌండేషన్ 'యూత్ ఫర్ ఇండియా' ఫెలోషిప్‌కి దరఖాస్తుల ఆహ్వానం

కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్)లో భాగంగా ఎస్.బి.ఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'యూత్ ఫర్ ఇండియా' ఫెలోషిప్ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సంస్థ వర్గాలు తెలిపాయి. పదమూడు నెలలపాటు కొనసాగే ఈ కార్యక్రమంలో యువత నేరుగా గ్రామాల్లో ఉంటూ అక్కడి సమస్యల పరిష్కారానికి కృషి చేయాల్సుంటుంది. 21-32 ఏళ్ల వయసున్న పట్టభద్రులు, ఓవర్సీస్ సిటిజన్స్ ఆఫ్ ఇండియా (ఓసీఐ) హోల్డర్లు, భూటాన్, నేపాల్ పౌరులు, ఎస్.బి.ఐ ఉద్యోగులు apply.youth-forindia.org ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. వికసిత్ భారత్ 2047 లక్ష్యానికి అనుగుణంగా గ్రామీణ-పట్టణ వ్యత్యాసాలు తొలగించి మార్పు తెచ్చే యువ నాయకులను ఈ ఫెలోషిప్ ద్వారా తీర్చిదిద్దుతామని బాధ్యులు తెలిపారు. వివరాలకు 99688 07709, 88606 21599 నంబర్లలో కూడా సంప్రదించవచ్చు.

## Form IV

Statement about ownership and other particulars about Monthly magazine **Janabalam**

1.Place of Pubilcation : Hyderabad

2.Periodicity of its pubication : Monthly

3. Printers
a. Name : Dr. Jayaprakash Narayan
b. Nationality : Indian
c: Address : H.NO. 6-3-678, B-106, Pasha Court 71, Somajiguda, Behind TRIBHUVANDAS JEWELLERS (TBZ), Hyderabad - 500 082

4. Publisher's Name : Dr.Jayaprakash Narayan
Nationality : Indian
Address : H.NO. 6-3-678, B-106, Pasha Court 71, Somajiguda, Behind TRIBHUVANDAS JEWELLERS (TBZ), Hyderabad - 500 082

5. Editior's Name : Dr.Jayaprakash Narayan
Nationality : Indian
Address : H.NO. 6-3-678, B-106, Pasha Court 71, Somajiguda, Behind TRIBHUVANDAS JEWELLERS (TBZ), Hyderabad - 500 082

6. Name and Address of Individual(S) Who own the news paper and partners of Shareholders holding more than one percent of the capital : Foundation for Democratic Reforms for loksatta, Represented by Dr. Jayaprakash Narayan, National Co ordinator , H.NO. 6-3-678, B-106, Pasha Court 71, Somajiguda, Behind TRIBHUVANDAS JEWELLERS (TBZ), Hyderabad - 500 082

I, Dr. Jayaprakash Narayan,Hereby declare that the Particulars above are true to the best of my knowledge and belief.

(Sd)
Dr. Jayaprakash Narayan
Signature of the Publisher

# వాణిజ్య ఒప్పందాలు.. ఆర్థిక సంఘం సిఫార్సులు

-డాక్టర్ జయప్రకాష్ నారాయణ్-

**2026, జనవరి చివరివారం నుండి ఓ పక్షం రోజులపాటుభారత్‌లో అరుదైన పరిణామాలు ఓ సమాహారంలా చోటుచేసుకున్నాయి. మన ఆర్థికాభివృద్ధి అవకాశాల మీద గణనీయ ప్రభావం చూపే అవకాశమున్న ఘటనలవి.**

మొదటిది, 16వ ఆర్థిక సంఘం నివేదిక సమర్పణ. జీడీపీకి తాము సమకూరుస్తున్న సంపదకు తగ్గట్లు పన్నుల్లో తమ వాటాఉండాలని పలు దక్షిణాది, పశ్చిమ రాష్ట్రాలు డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో..ఈ నివేదిక ప్రాధాన్యతను సంతరించుకుంది. ఎఫ్.సి తాజా నివేదిక మూడు రకాలుగా ముఖ్యమైనది: ఎ) ఆర్థిక వనరుల బదిలీలో భాగంగా యూనియన్ పన్నుల్లో రాష్ట్రాలకు 41% వాటాని కమిషన్ కొనసాగించింది. అదనంగా, స్థానిక సంస్థలకి గ్రాంట్ ల కింద రూ.8 లక్షల కోట్లను ప్రతిపాదించింది. ఇందులో 45% పట్టణ ప్రాంత స్థానిక సంస్థలకు వెచ్చించాలి. ఈ రెండు సిఫార్సులూ దీర్ఘకాలంలో ఎంతో ప్రయోజనాన్ని అందించేవి. మూలధన వ్యయాలకు వడ్డీలేని రుణాల్నీ మనం కలుపుకొంటే.. రాష్ట్రాలకు యూనియన్ బదిలీ చేస్తున్న వాటా రుణరహిత ఆదాయంలో 51.7%. మొత్తం పన్నులు, పన్నేతర ఆదాయాల్లో పెట్టుబడి (క్యాపిటల్) ఆదాయాన్ని మినహాయించిచూస్తే56.5%. స్థూల పన్ను ఆదాయాల లెక్క ప్రకారమైతే 59.6%.

దేశంలోని మొత్తం ప్రభుత్వ వ్యయంలో 60% దాకా రాష్ట్రాలు ఖర్చు చేస్తున్నాయి. ఇది ఒక ఫెడరల్ దేశంలో అత్యధిక వాటా. మొత్తం ప్రభుత్వ వ్యయంలో యూనియన్ కేవలం 37% ఖర్చు చేస్తోంది. రాష్ట్రాలకు బదిలీలు, జీతాలు, పెన్షన్లు, వడ్డీ చెల్లింపులు తదితర తప్పనిసరి వ్యయం పోగా..యూనియన్ ఖజానాలో వ్యవస్థీకృత ద్రవ్య లోటు ఏర్పడుతోంది. అదనపు వనరులకి ఆర్థికావకాశాలు లేవు. ఆర్థిక ఫెడరలిజంలో మన నిజమైన సవాలు - మూడో అంచెలోని స్థానిక ప్రభుత్వాలు బలహీనంగా ఉండటం. మొత్తం ప్రభుత్వ వ్యయంలో స్థానిక ప్రభుత్వాలు కేవలం 3% ఖర్చు చేస్తున్నాయి. ఇది జీ 20 దేశాలన్నిటిలోకీ అతి తక్కువ వాటా! కేరళ మినహాయించి అన్ని రాష్ట్రాల్లో స్థానిక ప్రభుత్వాలు నిర్వీర్యమైపోయాయి. రాష్ట్రాలు ఆర్థిక క్రమ శిక్షణను పాటించటంతోపాటు.. స్థానిక ప్రభుత్వాలకు మరిన్ని వనరులు, అధికారాల్ని వికేంద్రీకరించాల్సి ఉంది; ఫెడరలిజంలోని అసలైన అసంపూర్ణ ఎజెండా అది.

బి) సమాఖ్య వ్యవస్థలోనిపైఅంచెలోకి వాటాను ఇంకా పెంచటం కాకుండా, మరింత సమతూకంతో కూడిన



సమాంతర వికేంద్రీకరణకు ఆర్థిక సంఘం బాటలు వేసింది. ఇది సరైన నిర్ణయం. మొట్టమొదటిసారిగా, జీడీపీకి రాష్ట్రాలు సమకూరుస్తున్న వనరులకు 10% మొగ్గు (వెయిటేజీ) ఇచ్చారు. దీనివల్ల, పశ్చిమ, దక్షిణాది రాష్ట్రాల వాటా పెరిగింది. ఇతర రాష్ట్రాలకు కొద్దిగా తగ్గింది. గత ఆర్థిక సంఘం కేటాయింపుల్ని సమూలంగా మార్చటం కాకుండా.. మరింత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల ఫిర్యాదులను పరిగణలోకి తీసుకొనే ఒక పరిష్కార మార్గసూచీ అందుబాటులోకి వచ్చింది. అంతేకాదు, అభివృద్ధి మార్గాన్ని అనుసరించటానికి అన్ని రాష్ట్రాలకూ ఒక ప్రోత్సాహకాన్ని ఏర్పాటు చేసినట్లయింది. మౌలిక వసతుల నిర్మాణం, పెట్టుబడుల్ని ఆకర్షించటం, అభివృద్ధిని ప్రోత్సహించటం విషయంలో మనం పోటీ ఫెడరలిజం దశలో ఉన్నాం. కాబట్టి, ప్రాతిపదికలకు సంబంధించి ఈ క్రమానుగత మార్పు అవసరం, ఆహ్వానించదగినది.

సి) రాష్ట్రాల ఆర్థిక ఆరోగ్యాన్ని మెరుగుపరచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్న అంశాన్ని ఆర్థిక సంఘం సరిగానే గుర్తించింది. దృష్టి కేంద్రీకరించింది. కొన్ని రాష్ట్రాలు ప్రజాధనం నిర్వహణలో ప్రశంసనీయంగా వ్యవహరిస్తున్నాయి. సంక్షేమం, అభివృద్ధి అవసరాల మధ్య కేటాయింపుల్ని సమతూకంతో చేస్తున్నాయి. గుజరాత్, ఒడిశా, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్‌ను ఈ విషయంలో మెచ్చుకోవాలి. ఆంధ్రప్రదేశ్, పంజాబ్, హిమాచల్ ప్రదేశ్, పశ్చిమ బెంగాల్,

కేరళ, తెలంగాణ వంటి కొన్ని రాష్ట్రాలు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాయి. భారత ఆర్థిక స్థిరత్వానికి, పరపతికి గ్యారంటీ ఇవ్వాల్సింది యూనియన్ ప్రభుత్వమే. అన్ని రాష్ట్రాలూ ఆర్థిక క్రమశిక్షణతో వ్యవహరించేలా పర్యవేక్షిం చేందుకు తగిన అధికారాల్ని రాజ్యాంగం అందిస్తోంది. కానీ కొన్నేళ్లుగా ఆ బాధ్యతను యూనియన్ ప్రభుత్వం జారవిడిచింది. అధికరణం 293 కింద ద్రవ్య నిబంధనల్ని నిక్కచ్చిగా అమలు చేయటంపై ఇంకా మీనమేషాలు లెక్కించకూడదు. రెవెన్యూ లోటు భర్తీ కోసం రాష్ట్రాలకు నిధుల కేటాయింపుని ఆర్థిక సంఘం నిలిపివేయటం ఈ కోణంలో అవసరమైన చర్యే. ఇంత ఉదారంగా నిధుల బదిలీ తర్వాత కూడా రెవెన్యూ లోటును యూనియన్ భర్తీ చేయటం సహేతుకం కాదు. రాష్ట్రాలు ఆర్థికంగా బాధ్యతాయుత వైఖరితో వ్యవహరించటానికి అది ప్రోత్సాహకంగా పనిచేయదు. అటువంటి అపాత్ర వితరణ.. ఆర్థిక క్రమశిక్షణ పాటించే రాష్ట్రాల పట్ల అన్యాయమవుతుంది.

రెండో ప్రధాన పరిణామం యూనియన్ బడ్జెట్‌లో పాటించిన పటిష్ఠ ఆర్థిక నియంత్రణ. ద్రవ్య లోటు తగ్గించటం, అప్పులు-జీడీపీ నిష్పత్తి, ఆస్తులు సృష్టించే వ్యయాలకు రికార్డు స్థాయి కేటాయింపులు కొనసాగించారు. 2026-27 ఆర్థిక సంవత్సర బడ్జెట్ లో అనూహ్యతలు లేవు. నాటకీయతలేని విజ్ఞత ఉంది. తాత్కాలిక జనాకర్షక పథకాలను ప్రకటించి సంచలన చర్చనీయం కావాలనే ఆరాటం లేదు. కార్మిక శక్తికి సంఘటిత ఉపాధి రంగంలో పెద్దఎత్తున అవకాశాలనిచ్చే చిన్న పట్టణాలను గ్రామాల మధ్య అభివృద్ధి చేయటం, పెట్టుబడుల ఉపసంహరణలపై మాత్రం మరింత శ్రద్ధ పెట్టాల్సింది. అది మినహాయించి.. మౌలిక సదుపాయాలు, దీర్ఘకాలిక వృద్ధి అవసరాలు, అంతర్జాతీయ అనిశ్చితుల మధ్య సత్తా చాటేందుకు సన్నద్ధ చర్యలు ఆహ్వానించదగినవి.మన అభివృద్ధి సామర్థ్యాన్ని ఆవిష్కరించటానికి మరిన్ని సంస్కరణలు అవసరం.వాటిని వేరేగా వెలువరిస్తారేమో వేచిచూద్దాం. 2025-26 ఆర్థిక సర్వే గురించి కూడా చెప్పుకోవాలి. ఆక్షేపణలకు అవకాశ మివ్వకుండా.. ఎవరినైనా ఒప్పించగలిగే రీతిలో సర్వేను రూపొందించారు. మన బలహీనతల్ని అధిగమించి, బలాల మీద పునర్నిర్మించుకోవటం ద్వారా అభివృద్ధిని పెంపొందిం చటానికి బడ్జెట్, ఆర్థిక సర్వే ఒక పటిష్ఠ మార్గసూచీని అందించాయి.

మూడో పరిణామం, యూరోపియన్ యూనియన్ తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్.టి.ఏ). కొన్ని అవరోధాలను అధిగమించాల్సుంది. అందువల్ల అమలుకు కొన్ని నెలలు పట్టవచ్చు, కానీ ఈ ఒప్పందం కచ్చితంగా సానుకూల పరిణామం. తయారీ, ఎగుమతుల రంగంలో, ఒక సంక్లిష్ట విస్తృత మార్కెట్ లో మనం కూడా గట్టి పోటీదారులుగా నిలదొక్కుకోవాలనే మన సంకల్పానికి అది నిదర్శనం. అనేక అంశాలకు సంబంధించి లోతైన చర్చలు సుదీర్ఘకాలం కొన సాగాక ఆ ఒప్పందం కుదిరింది. యూరోపియన్ యూని యన్ లోని 27 సభ్య దేశాల్లో ఏ ఒక్కటి వీటో చేసినా ప్రతిష్టంభన ఏర్పడుతుంది. ఇలాంటి పరిస్థితుల మధ్య ఎంతో చాతుర్యంతో ఈ ఒప్పందాన్ని ఖరారు చేయగలి గారు. మనం కష్టపడి పనిచేస్తే.. మన ఉత్పాదకతను, పోటీతత్వాన్ని పెంచుకునేందుకు మధ్యకాలిక, దీర్ఘకాలిక వ్యవధిలో ఈ ఎఫ్.టి.ఏ ఓ గొప్ప అవకాశాన్ని అందిస్తోంది. చివరిగా, అమెరికాతో వాణిజ్య ఒప్పంద ప్రకటన. తక్షణ, మధ్య, దీర్ఘకాలిక కోణంలోఇదో గణనీయ పరిణామం. భారతీయ వస్తువులపై 18% సుంకం.. మన పోటీదారులపై విధించిన మొత్తం కంటే తక్కువ. ఫెడరల్ సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఇంకొంత వెసులుబాటు రావొచ్చు. కానీ మొత్తంగా, సుంకం అనేది దిగుమతిదారులు, వినియోగ దారులపై విధించే పన్ను. మనం పట్టించుకోవాల్సిందల్లా -- మన పోటీదారులకన్నా ఎక్కువ సుంకం మనం భరిస్తున్నామా? అనేది. అమెరికా వస్తువులపై భారత్ లో తక్కువ లేదా శూన్య సుంకాల వల్ల పెద్ద తేడా ఉండక పోవచ్చు. ఎందుకంటే, అమెరికా వాణిజ్య వస్తువులు సాధా రణంగా చాలా ఖరీదైనవి, భారతీయ మార్కెటలో పోటీ పడనివి. అమెరికా ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ. అతిపెద్ద మార్కెట్. వేగంగా పెరగాలని ఆకాంక్షించే ఏ పెద్ద దేశమూ అమెరికా మార్కెట్ అవకాశాన్నివదులుకుని తట్టుకో వటం సాధ్యం కాదు. ఆ ఒప్పందం వల్ల తక్షణమైతే రూపా యి పతనానికికళ్లెం పడుతుంది. విదేశీ పరోక్ష, ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్.ఐ.ఐ, ఎఫ్.డి.ఐ) మెరుగుపడతాయి.

భవిష్యత్తులో పెట్టుబడులకు కార్పొరేట్ సంస్థలు ఉత్సాహం ప్రద ర్శిస్తాయి.మొత్తంగా, రోజుల వ్యవధిలో చోటుచేసుకున్న ఈ నాలుగు పరిణామాల పరంపర మధ్యకాలికంగా మన ఆర్థిక వ్యవస్థ ముఖచిత్రాన్ని దేదీప్యం చేస్తాయి. అయినా కూడా అంతర్జాతీయంగా కొన్ని అనూహ్యతలు ఎదుర వ్వొచ్చు. అమెరికా ద్రవ్య, వాణిజ్య విధానాలు లేదా ఏఐ బుడగను సృష్టించే మాదిరి భారీ, అసంబద్ధ పెట్టుబడులు ఇందుకు కారణం కావచ్చు. కానీ కొన్నేళ్లుగా యూనియన్ ప్రభుత్వం ప్రదర్శిస్తున్న అభినందనీయ ఆర్థిక క్రమశిక్షణ మనకు కలిసొచ్చే అంశం. మూలధన వ్యయాలకు భారీ పెట్టుబడులు కావచ్చు, అభివృద్ధి విధానాలకు విస్పష్ట సానుకూల సంకేతాలు కావచ్చు, మనం భవిష్యత్తు ముప్పుల్ని నింపాదిగా ఎదుర్కోగలిగే సహేతుక స్థితిలో ఉన్నాం. ✦

# ఏపీ 'AI డాక్టర్–సంజీవని'తో యూనివర్సల్ హెల్త్ కేర్?

ఏప్రిల్ నుండి జులై 2026 నాటికల్లా ఆంధ్రప్రదేశ్‌లో ఏఐ ఆధారిత 'సంజీవని' కార్యక్రమం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలందరికీ 'యూనివర్సల్ హెల్త్ కేర్' అందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ఇదో డిజిటల్ హెల్త్ రికార్డుల ప్రాజెక్ట్. పైలట్ కార్యక్రమంగా కుప్పంలో దీన్ని 2024 నవంబర్‌లో ప్రారంభించారు. ఇందులో భాగం గా కుప్పంలో ఒక 'డిజిటల్ నెర్వ్ డేటా సెంటర్' (డి.ఐ.ఎన్.సి)ను ప్రారంభించారు. వైద్య శిబిరాలు, గ్రామాల వారీగా ప్రతి ఇంటికీ వెళ్లటం, పి.హెచ్.సిలు, సి.హెచ్.సి లలో సుమారు 49,000 మందికి (ఈ సంఖ్య ఇంకా ఎక్కువని కొన్ని వార్తాకథనాలు పేర్కొంటున్నాయి. అయితే స్వతంత్ర బేరీజు విధానం లేకపోవటం వల్ల కేవలం ఒక విశ్వసనీయ మీడియా సంస్థ పేర్కొన్న గణాంకాన్నే ప్రస్తావిస్తున్నాం) జీవనశైలి వ్యాధి పరీక్షల్ని నిర్వహించారు. వైద్య పరీక్షలు, డేటా, వ్యాధుల అంచనా మొత్తాన్నీ ఏఐ ద్వారా నిర్వహించారు. సమాచారాన్ని డిజిటల్ రికార్డు చేసి డిజిటల్ నెర్వ్ సెంటర్ కి పంపారు. అక్కడ వ్యాధుల సరళిని గ్రామాలు, ప్రాంతాల వారీగా విశ్లేషించి, సాధారణమైనవైతే రోగులకు దగ్గరలోని ప్రాథమిక, కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలకు పంపారు. అక్కడ అవసరమైన మందుల్ని, ఇతర ఆరోగ్య సంరక్షణ సేవల్ని అందించారు. చికిత్స అవసరమైతే ఏరియా ఆస్పత్రి నుండి తృతీయ స్థాయి వరకూ వ్యాధి తీవ్రతను బట్టి చికిత్సకు పంపారు. వ్యాధులకు మందులు తీసుకుంటున్న లేదా వ్యాధులు అవకాశం వచ్చేవారికి ఆ సమయానికి అలర్ట్ సందేశాన్ని నెర్వ్ సెంటర్ నుండే డిజిటల్ రికార్డును అనుసరించి పంపుతారు. రోగులకు సంబం ధించిన పూర్తి సమాచారం అందుబాటులో ఉంటుంది కాబట్టి.. ఎప్పుడు ఏ చికిత్సకు రిఫరెన్స్ కావాలన్నా వెంటనే వివరాలు అందుబాటులో ఉంటాయి. దీనివల్ల, వ్యాధులు రాకుండా ముందస్తు జాగత్త లేదా నివారణ, ప్రాథమిక వైద్యంతో నియంత్రణ, సకాలంలో ఆస్పత్రి చికిత్స సమర్థంగా సాధ్యమై యూనివర్సల్ హెల్త్ కేర్ అందించటం సాధ్యమవుతుందని, రాబోయే కాలంలో ఇది మొత్తం భారతదేశానికి, అనేక ఇతర దేశాలకు మార్గదర్శక ఆరోగ్య విధానమవుతుందని చంద్రబాబు భావిస్తున్నారు. జనవరి 1, 2026 నుండి పైలట్ ప్రాజెక్ట్ ని చిత్తూరు జిల్లా మొత్తానికీ విస్తరించారు. సంక్రాంతి తర్వాత ఒక హెల్త్ సెంటర్‌ని పరిశీలించటంతోపాటు రెండు గ్రామాల ప్రజలు, ముఖ్యంగా మహిళలతో సమావేశమై సంజీవని పథకం ద్వారా వారికి జరిగిన పరీక్షలు, వ్యాధులున్నవారి నుండి ఆయా వివరాలు, వారికిచ్చిన వైద్య సలహాలు, చికిత్సలు మొదలైనవాటి గురించి తెలుసుకున్నారు.

ముందుగా ఆరోగ్య రంగం పట్ల చర్చ పెరగటం, సామాన్య ప్రజలకూ ఆరోగ్యం అందించేందుకు విధానపరమైన ప్రయత్నం చేయటం అభినందనీయం. అయితే ఇందులో ఏఐ సాంకేతికత



వల్ల వేగం తప్ప కొత్తగా వచ్చిన మార్పేమీ లేదు. ఏఐ వల్ల ప్రజలు, ముఖ్యంగా మహిళలు సంకోచం లేకుండా తమ ఆరోగ్య సమస్యల్ని చెప్పుకోగలిగారని ముఖ్యమంత్రి చెబుతున్నారు. అందులో కొంత వాస్తవం ఉండొచ్చు, ఆయన చాలా శ్రద్ధ తీసుకుని సమావేశం జరపటం కూడా ఆ వాస్తవాన్ని బలపరిచేది అయివుండవచ్చు.

సంజీవని ప్రాజెక్టు పట్ల పాలనా యంత్రాంగం చెప్పిన వివరాలు, ముఖ్యమంత్రి సమావేశం కూడా అద్భుత ఫలి తాలు వచ్చాయన్న అభిప్రాయాన్నేమీ కలగించవు. చంద్రబాబు కూడా ఫలితాల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారంతే. ఏఐ సాంకేతికత ద్వారా లబ్ధి పొందే అవకాశం ఉన్న రంగాలలో వైద్య ఆరోగ్యం కీలకమైనదని అన్ని దేశాల నిపుణులూ చెబుతున్నారు. కచ్చితంగా మనం ఆ అవకాశాన్ని సద్వినియోగం గావించుకోవాలి. కానీ ఇప్పుడున్న వ్యవస్థ మీద ఏఐ సాంకేతికతను నిర్మించటం వల్ల ఎంత ఫలితం ఉంటుందన్నది అసలు సమస్య. ముఖ్యమంత్రికి చాలా అనుభవం ఉంది. అదేవిధంగా ఈ విషయంలో చాలామంది సలహా లిచ్చి ఉండవచ్చు. కానీ ఆరోగ్య రంగానికి మన దేశం మిగిలిన చాలా దేశాలతో పోలిస్తే, చాలా తక్కువ మొత్తం కేటాయించటం పెద్ద సమస్యే అయినా.. భోర్ కమిటీ నివేదిక తదితరాల నేపథ్యంలో స్వతంత్రం వచ్చిన తొలినాళ్లలోనే మనకు ప్రాథమిక స్థాయి ఆరోగ్య కేంద్రాల మౌలిక వసతులు బాగానే సమకూరాయి. కానీ, డాక్టర్ల వ్యవస్థే సవ్యంగా లేనప్పుడు, భవనాలు తాళాలు వేసు కోవటానికి తప్ప ఎందుకు పనికొస్తాయి? పలు చోట్ల డాక్టర్లు లేరు, ఉన్నచోట ఎప్పుడొస్తారో తెలియదు, కొన్నిచోట్ల సంవత్సరాల తరబడి గైర్హాజరు, ఎంత సమర్థంగా చూస్తారో తెలియదు, వారి మీద హుకుం జారీ చేయటం పాలకులు జబ్బలు చరుచుకోవటానికి తప్ప ప్రజలకు వైద్యం అందటానికి పనికిరాదు.. వెరసి చాలా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు భూత్ బంగ్లాల్లా తయారయ్యాయి. ఏవో కొన్ని

మాత్రమే గొప్ప సేవలను అందిస్తున్నాయి.

ఇటీవల ప్రభుత్వాస్పత్రులకు వస్తున్న కేసుల్లో అత్యధికం దిగువస్థాయిలో వైద్యం చేయగలిగినవేనని ఆరోగ్యశాఖ అధికారులే గుర్తించారు. ఎందుకిలా జరుగుతోంది అని ఆలోచిస్తే, 1) సర్కారువారి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల మీద నమ్మకం లేదు 2) ఒకవేళ వెళ్లినా అక్కడున్న డాక్టర్లు సొంత పనుల మీద ఆసక్తితో పేషెంట్లను ఆస్పత్రులకి పంపు తున్నారట. తెలంగాణలోనూ ఇదే పరిస్థితి. ప్రాథమిక స్థాయిలో నయం కావాల్సిన వ్యాధులకు పీ.హెచ్.సీలు, వెల్ నెస్ సెంటర్లు, బస్తీ దవాఖానాలు విఫలం కావటం వల్ల ఏటా 20-30% పెరుగుతున్నారని అధికారులు గుర్తిం చారు. హైదరాబాద్ ఉస్మానియా ఆస్పత్రిలో మధ్యాహ్నం వరకూ ఓపీ చూస్తే, 3,000 మంది రోగులు వస్తున్నారు. అందులో ఆస్పత్రి అడ్మిషన్ అవసరమైనవారు కేవలం 100 మంది. అత్యధికులు ప్రాథమిక వైద్యంపై నమ్మకం లేక, ప్రయివేటు ఆస్పత్రిలో చూపించుకునే స్తోమతులేక హైరానాపడుతూ పెద్దాస్పత్రులకు వస్తున్నారు. ఇలాంటి వ్యవస్థ మీద ఏఐ మెరుపులు అద్దాలనుకోవటం విల వైన సమయం వృథాతోపాటు.. కీలక సమయంలో ఆర్థిక వ్యవస్థ ఉత్పాదకతను దెబ్బతీయటమవుతుంది.

చంద్రబాబు ప్రభుత్వం ఏఐ ఆధారిత సేవల్ని, మెడికల్ రికార్డులతో అందిస్తామని, ఇందుకు సాంకేతిక సహకారం ఇవ్వాలని మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్‌ని కోరినప్పుడు, ఆయన కూడా సందేహం వ్యక్తం చేశారన్నది మనం విస్మరించ కూడదు. బహుశా చంద్రబాబు పట్ల గౌరవంతో ఆమోదించారు. ఇది ఏపీలో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేసి విజయవంతమైతే, ప్రపంచవ్యాప్తంగా తమ హెల్త్ కేర్ స్వచ్ఛంద సంస్థ ద్వారా అమలు చేస్తామన్నారు. గేట్స్‌కి టెక్, ఆరోగ్య సేవల్లో అనుభవం ఉంది. ఆయనకే నమ్మకం కలగలేదంటే, చంద్రబాబు మన దేశంలోని వైద్య విధాన నిపుణులతో కూర్చుని ఇంకొంచెం చర్చించాల్సింది. ఫిబ్రవరి 16, 2026న బిల్ గేట్స్ ఏపీ వచ్చినప్పుడు పౌర సేవలు, వ్యవసాయం తదితర రంగాలతో పాటు కుప్పంలో సంజీవని పైలట్ ప్రాజెక్టు గురించి కూడా ముఖ్యమంత్రి వివరించారు. గేట్స్ మెచ్చుకున్నట్లు మీడియా తెలియ చేసిందిగానీ, కుప్పంలో ఆరోగ్య ఫలితాలను తెలియ చేయ లేదు. ఆ ట్రెండ్స్ విశ్లేషణ లేదు. డబ్ల్యూహెచ్‌ఓ, అశోకా యూనివర్సిటీ సహకారంతో నేషనల్ హెల్త్ ఏఐ స్ట్రాటజీ వర్క్ షాప్ నిర్వహించినట్లు తెలిపారు. జాతీయ స్థాయికి యూనివర్సల్ హెల్త్ పాలసీగా విస్తరించాలనే ఏపీ ప్రభుత్వ ఆలోచన మంచిదే. కానీ పది మంది వైద్య నిపుణులతోనే కాకుండా.. వైద్యంతోపాటు పబ్లిక్ పాలసీ రూపకల్పనపై లోతైన అవగాహన ఉన్న నిపుణులతో చర్చించటం అవసరం. ప్రతి ఇంటికీ ఓ ఏఐ డాక్టర్‌ని ఇవ్వటం తమ లక్ష్యమని ముఖ్యమంత్రి గేట్స్ కి తెలిపారు. ఇలాంటివి ఆయా నిపుణులతో సమగ్ర అధ్యయనం, అన్ని దశల్లో సమీక్షలు లేకుంటే.. అనుకోని పరిణామాలకు, ప్రజల ప్రాణాలతో చెలగాటానికి దారితీసే అవకాశం ఉంది.




ఇంటికెళ్లి ఏవైనా అత్యవసర సేవలు, గర్భిణీ స్త్రీలను కాన్పు సమయం నిర్ణయించి ఆ టైమ్‌కి ఆస్పత్రిలో చేర్చటానికి అంబులెన్స్ పంపటం వంటి వాటి వరకు టెక్నాలజీ సేవలు అద్భుతంగా ఉపయోగపడతాయి. అంతేకాదు, వైద్య సమాచార సేకరణ, ప్రాథమిక విశ్లేషణలో వైద్యునికి సహాయకారిగా ఏఐని ఉపయోగించవచ్చు. అంతేగానీ.. దశాబ్దాలుగా విఫలమైన వ్యవస్థతో ఆధునిక వ్యవస్థను సంధానించటం, డాక్టర్ల వైఫల్యాన్ని ఏఐ ద్వారా పరిష్కరించా లనుకోవటం సమస్యని ఇంకా జటిలం చేసే అవకాశం ఉంది. ఆ వ్యవస్థ విఫలమైంది కాబట్టే, తాత్కాలిక ఉప శమనంగా వైఎస్ రాజశేఖర రెడ్డి 'ఆరోగ్యశ్రీ' పథకాన్ని తీసుకొచ్చినప్పుడు ప్రజలు ఓట్లుపరంగా కూడా ఎంతో ఆదరించారు. ఆ పథకం వల్ల కొంతకాలంపాటు ఉపశమనమే తప్ప ప్రజలకు ఆరోగ్యం అందదని అప్పట్లోనే ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్.డి.ఆర్), లోక్ సత్తా వ్యవ స్థాపకులు, జాతీయ ఆరోగ్య మిషన్ రూపశిల్పి డాక్టర్ జయ ప్రకాష్ నారాయణ్ విమర్శించారు. ఈ పద్దెనిమిదేళ్లలో అదే నిజమని రుజువైంది. ఆరోగ్యశ్రీ కొంతమేరకు అవసరం. కానీ అది ఒక ఇన్సూరెన్స్ ఆధారిత పథకమే తప్ప.. ప్రభుత్వ ఆరోగ్య విధానం కాదు. భారతదేశంలో ప్రభుత్వ ఆరోగ్య విధానం అధ్వాన్నంగా ఉండటం వల్ల ఏటా సుమారు 40-50కోట్ల ఉత్పాదక సంవత్సరాలు ప్రజలకు వృథా అవుతున్నట్లు అంచనా. అంటే, ఆరోగ్య కారణాల వల్ల పనిచేసే కాలం దేశానికి అంత వృథా అవుతోంది. ఆరోగ్యశ్రీ, అదే నమూనాను అనుసరించి వచ్చిన 'ఆయు ష్మాన్ భారత్' వల్ల మహా అయితే ఆ సమయాన్ని ఓ 20 కోట్ల సంవత్సరాలకి తగ్గించగలిగి ఉంటారు. కానీ ఆరోగ్యం కోసం జేబుల్లో నుంచి ప్రజలు అతి ఎక్కువ ఖర్చు చేస్తున్న దేశాల్లో భారత్ ఇప్పటికీ ప్రపంచంలోనే మొదట స్థానంలో ఉంది. అంతర్జాతీయ సగటు కంటే కూడా భారతీ యులు ఎక్కువ సొంత డబ్బు ఆరోగ్యం కోసం ఖర్చు పెడుతున్నారు. ఈ నేపథ్యంలో, ఇప్పుడున్న పథకాల్లోని లోపాల్ని సరిదిద్దేలా సాంకేతిక అవకాశాల్ని ఉపయోగిం చుకోవాలి. ఏఐ ఎంత ఆధునికమైనా, డాక్టర్ల పర్యవేక్షణతోనే ఉపయోగించాలని నిపుణులు స్పష్టం చేస్తున్నారు, ఆ హెచ్చరికలకు ఇప్పటికే తగిన సాక్ష్యాలు కూడా కని పిస్తున్నాయి.

కాబట్టి, ప్రభుత్వ వైద్య విధానంలో ఏఐ వినియోగానికి నమూనాని మార్చాలి. ప్రతి ఒక్కరికీ ఏఐ డాక్టర్ (వినటానికే ఆందోళన కలిగించేలా ఉంది)కి బదులు..ప్రజలకు వ్యక్తిగత ఆర్థిక భారంలేకుండా నాణ్యమైన వైద్య ఆరోగ్య సేవలు అందించటం లక్ష్యంగా ఏఐ సాంకేతికతని డాక్టర్ పర్య వేక్షణలో సమర్థంగా ఉపయోగించటానికి, ముఖ్యంగా ప్రాథమిక ఆరోగ్య స్థాయిలో నమూనాను మారిస్తేనే 'యూనివర్సల్ హెల్త్ కేర్' లక్ష్యాన్ని చంద్రబాబు సాధించ గలరు. ఈ నమూనాను చర్చించే ముందు.. మన వైద్య రంగంలో ఉన్న సమస్యలు, కార్పొరేట్ ఆస్పత్రుల ఆధునిక సాంకేతికతలకు, లాభాలకు గండి కొట్టకుండా, తక్కువ ఖర్చుతో ప్రజలందరికీ నాణ్యమైన ఆరోగ్యాన్ని కొంతమేర ప్రయివేటు నైపుణ్యాలను కూడా అందుబాటులోకి తేవటానికి ఉన్న బలాల్ని చూద్దాం.

**ఏమిటి మన వైద్య ఆరోగ్య రంగంలో సమస్యలు?**

⏭ గ్రామీణ ప్రాంతాల ప్రజలకు, ముఖ్యంగా మహిళలకు సరైన వైద్యం అందటం లేదు. గ్రామీణ ప్రజలకు దగ్గరలో నాణ్యమైన వైద్యం అందకపోవటం వంటి మౌలిక కోణంలో ఆలోచించి సమస్యల్ని పరిష్కరిస్తే, నిజమైన అవసరాలకే సంక్షేమ వ్యయం చేసి, మరింత ఎక్కువ డబ్బుని అభివృద్ధికి, దీర్ఘకాలిక భవిష్యత్తుకి వెచ్చించవచ్చు.



⏭ కొన్ని నెలల క్రితం వే 2 న్యూస్ అనే డిజిటల్ మీడియా సంస్థ విజయవాడలో నిర్వహించిన సదస్సులో కిమ్స్ వ్యవస్థాపకులు డాక్టర్ భాస్కరరావు చాలా స్పష్టంగా ప్రాథమిక వైద్యం ప్రాధాన్యాన్ని , ఫ్యామిలీ డాక్టర్ అవసరాన్ని చెప్పారు. అంతకుముందు జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా ఇచ్చిన ఇంటర్వ్యూలలో ఏఐజీ ఆస్పత్రి వ్యవస్థాపకులు డాక్టర్ నాగేశ్వర రెడ్డి, కిమ్స్ సహ వ్యవస్థాపకులు డాక్టర్ రఘురామ్ కూడా ఇదే మాట చెప్పారు. కానీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఏఐ ఆధారిత యూనివర్సల్ హెల్త్ కేర్ కాన్సెప్ట్ లో ఈ అంశం ప్రస్తావనకు రాలేదు.

⏭ ఏపీ ప్రభుత్వం మూడు విడతలు అన్ని జిల్లాల్లో ఎన్.సి.డి (అసాంక్రమిక వ్యాధులు/జీవనశైలి వ్యాధులు) ఆరోగ్య సర్వేలు చేసింది. ఇందులో 41 రకాల ఆరోగ్య సమస్యలపై 79 లక్షల మందిని పరీక్షించారు. సర్వే నాలుగోసారి కొనసాగిస్తోంది. యూనియన్ ప్రభుత్వం మహిళలకు ఆరోగ్య పరీక్షలని నిర్వహించే 'స్వస్థ్ నారి, సశక్తి పరివార్ అభియాన్' కార్యక్రమాన్ని అమలు చేసింది. వాటిల్లో తేలింది ఏమిటంటే..డయాబెటిస్,

## విధానపరంగా జర జాగ్రత్త అంటున్న అంతర్జాతీయ నిపుణులు

యూనివర్సిటీ ఆఫ్ వాషింగ్టన్ స్కూల్ ఆఫ్ మెడిసిన్ లోని ఇన్స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ మెట్రిక్స్ అండ్ ఎవాల్యుయేషన్ (ఐ.హెచ్.ఎం.ఈ) డైరెక్టర్ డాక్టర్ క్రిస్టోఫర్ ముర్రేతోపాటు 16,500 మంది శాస్త్రవేత్తలు, పరిశోధకులు చేసిన గ్లోబల్ బర్డెన్ ఆఫ్ డిసీజ్ (జీబీడీ) అధ్యయనంలో.. ఆరోగ్యం లేకుండా జీవనకాలం పెరగటం, జీవనశైలి వ్యాధులు విజృంభించటం పెద్ద ఆరోగ్య సవాళ్లుగా మారుతున్నాయి. వాస్తవ గణాంకాల ఆధారంగా పాలకులు మేలైన వైద్య ఆరోగ్య విధానాలను రూపొందించటానికి ఈ నివేదిక (లాన్సెట్ లో ప్రచురించారు) మేలుకొలుపు కావాలని ముర్రే పేర్కొన్నారు.

క్యాన్సర్, గుండెజబ్బులు, కీళ్ల నొప్పులు, అధిక రక్తపోటు, ఊబకాయం వంటి అసాంక్రమిక వ్యాధులు సాంక్రమిక/ అంటు వ్యాధుల్లా విజృంభిస్తున్నాయి. వీటికి నివారణ దశ నుండి నియంత్రణ దాకా చర్యలు, మరీ ఎక్కువైతే ఆస్పత్రి చికిత్సకు రెఫరల్.. ఒక క్రమపద్ధతిలో, మానవీయ కోణంలో, రోగులు తమ భావాల్ని, సందేహాల్ని పంచుకునేలా చేయటం అవ సరం. రోగికి, డాక్టర్కి మధ్య వ్యాధికి సంబంధించిన సమాచారంలో అంతరం చికిత్సలో లోపానికి దారితీయకూడదు. కొందరు డాక్టర్లతో మాట్లాడితే, సగం జబ్బు తగ్గిపోయిందని రోగులు భావిస్తుంటారు. ఆ సహానుభూతి, సంభాషణ మెరుగైన వైద్యంలో భాగం. ముఖ్యంగా వృద్ధుల జనాభా పెరుగుతున్న కొద్దీ ఈ అవసరం పెరుగుతుంది. ఇందుకు ఫ్యామిలీ డాక్టర్లు ప్రతిరోజూ అందుబాటులో ఉండే ఏర్పాటు అవసరం. గత ప్రభుత్వం పేరుకి ఈ విధానం అమలు చేస్తే, ప్రస్తుత కూటమి ప్రభుత్వం.. అంతకుముందువారు చేసింది మేమెందుకు కొనసాగించాలన్నట్లు ఆ పేరు కూడా ప్రస్తావించటం లేదు.

⏭ ఖాళీల భర్తీ, మౌలిక సదుపాయాల కల్పన, వైద్య ఆరోగ్యానికి ప్రాధాన్యత పెంచినా, 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుండి సెప్టెంబర్ వరకు 13 విభాగాల పనితీరును అంచనా వేస్తే.. అన్నింటికీ మూలమైన ప్రాథమిక ఆరోగ్యం అధ్వాన్నంగా ఉందని, అసాంక్రమిక వ్యాధులు (ఎన్.సి.డిలు) విజృంభిస్తూ తొలిదశలో శ్రద్ధ లేకపోవటం వల్ల ఆస్పత్రి దాకా వెళ్లాల్సి వస్తోందని, పలు సందర్భాల్లో సమయం మించిపోతోందని తేలింది. వందకి 50 మార్కులు ఒక్క విభాగంలో కూడా దాటలేదు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (పీ.హెచ్.సీ) పనితీరు ఘోరంగా ఉంది. గుంటూరు జిల్లా తురకపాలెంలో వరుస మరణాలను వైద్య సిబ్బంది అసలు గుర్తించనేలేకపోయారు. ఎన్.సి.డి విభాగం నాసిరకంగా ఉంది. ప్రభుత్వం 3.0 సర్వే చేసినా, క్షేత్రస్థాయిలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నా, మెరుగైన వైద్యం అందించటంలో వైఫల్యం కనిపిస్తోంది. చాలా కేసుల్ని

పెద్దాస్పత్రులకు తరలించటంలో జాప్యం జరుగుతోంది. అంటే.. ఒకటి, జబ్బులు ముదిరిపోయాయి, అటువంటి కేసుల్లో కూడా సరైన చికిత్సను అందించలేకపోతున్నారు. తూర్పు గోదావరి జిల్లా బలభద్రపురంలో క్యాన్సర్ కేసుల వ్యవహారం ఎవరో ప్రయివేటు వ్యక్తులు చెబితే తప్ప ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బందికి తెలియలేదు. రెండు, అధిక రక్తపోటు, మధుమేహం వంటి వ్యాధుల రోగులకు ఒక్కసారి మందులిస్తే చాలదు. నియంత్రణలో భాగంగా మధ్యలో తలెత్తే దుష్పరిణామాలను కూడా పరిగణలోకి తీసుకోవాలి.

⏭ అప్పులు తీసుకొచ్చి మరీ సంక్షేమ పథకాలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తోంది. కానీ ఆరోగ్య విధానం సక్రమంగా లేకపోవటం వల్ల, చికిత్సలకయ్యే ఖర్చు భరించలేక ఏటా 26 లక్షల మంది రాష్ట్రంలో కొత్తగా పేదలవుతున్నారు. తెలంగాణలో, దేశంలో ఈ సంఖ్య 19 లక్షలు, 5.5 కోట్ల వరకు ఉంది.

⏭ స్థానిక ప్రభుత్వాలకు నిధులు, అధికారాలు లేకపోవటం వల్ల.. సరైన మంచినీరు అందక, పారిశుద్ధ్యం లేక, కాలుష్యం పెరిగిపోతూ దేశంలో ఏటా లక్షల మంది పిల్లలు సహా మరణిస్తుంటే, ఎవరో ఒకరికి జబ్బు బాగా ముదిరాక ప్రభుత్వం సీఎం సహాయ నిధి ద్వారా సాయం చేయటాన్ని గొప్ప మాన వీయ కథనంగా ప్రభుత్వం చెప్పుకోవటం, మీడియా ప్రచారం చేయటం.

⏭ ఇన్సూరెన్స్ పథకం అమెరికా వంటి దేశాల్లో ఘోరంగా విఫలమైనా, మళ్లీ అదే తరహా బీమా ఆధారిత ఆరోగ్య విధానాన్ని రూపొందించటం. ప్రస్తుతం రేషన్ కార్డులున్న వారికి రూ.25 లక్షల వరకు, ఇతరులకు రూ.2.5 లక్షల వరకు ఎన్.టి.ఆర్ వైద్య సేవ పథకం ద్వారా అందిస్తున్నారు.

⏭ ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ సేవల వల్ల ఖర్చు ఎక్కువ, ఫలితం తక్కువ. అందులో చికిత్స అందిస్తున్న వ్యాధులన్నీ సరైన ప్రాథమిక వైద్యం అందక ముదిరినవే. అదే ప్రాథమిక స్థాయిలోనే వాటిని కట్టడి చేస్తే, ఖర్చుకు తగ్గ ఫలితం వచ్చి ఆ కుటుంబం ఉత్పాదకత, దేశ ఆర్థికాభివృద్ధి పెరుగుతాయని గమనించి ఫ్యామిలీ డాక్టర్ ప్రాథమిక వైద్యాన్ని ఆరోగ్య విధానానికి పునాది చేయకపోవటం.

⏭ అనేకమంది ఎంబీబీఎస్ క్వాలిఫైడ్ అయినా.. నిరుద్యోగులుగానో, తక్కువ ఆదాయానికి ఎక్కడో పనిచేస్తుండటం.వారికి కనీస వేతనం ఇవ్వటానికి అవసరమైన అవకాశాల్ని డిమాండ్ ఉన్నా అందివ్వలేకపోవటం.

⏭ జనాభాలో యువత సంఖ్య ఎక్కువ ఉన్నా, జీవనశైలి వ్యాధులు ఎక్కువవుతుండటం

⏭ జనాభాపరంగా భారత్ లో రోజుకు 19,500 మంది అరవయ్యేళ్ల వయసును దాటుతున్నారని అంచనా. ఇది 279% పెరుగుదల, ప్రపంచంలోనే అత్యధికం. 65 ఏళ్లు దాటినవారు 2036 నాటికి మొత్తం జనాభాలో 15% ఉంటారని, 2050 నాటికి 34.7 కోట్లకు చేరతారని, వీరిలో ప్రతి 10 మందిలో 9 మంది రెండు కంటే ఎక్కువ జీవనశైలి వ్యాధులతో బాధపడుతున్నారని అంచనా. అరవై ఏళ్లు దాటినవారిలో 48.4% మందికి అసలు వైద్యపరీక్షలే నిర్వహించలేదు. సీనియర్ సిటిజన్లు ఎక్కువగా గ్రామీణ ప్రాంతాలలో ఉండటంతో వైద్య సేవలకు దూరంగా ఉంటున్నారు. ఫ్యామిలీ డాక్టర్ వ్యవస్థ లేకుండా ప్రస్తుతం ఉన్న వ్యవస్థనే ఏఐతో కొనసాగించటం, ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ వంటి పథకాల ద్వారా ఆస్పత్రి వైద్యానికి ప్రాధాన్యత ఇవ్వటం వల్ల వృద్ధుల ఆరోగ్య సంరక్షణ ఖర్చు ప్రభుత్వానికి రాబోయే కాలంలో పెద్ద భారమయ్యే అవకాశముంటుంది.

## 2024-25తో పోలిస్తే యువతలో 50% కంటే పెరిగిన కొన్ని వ్యాధులు

యువతపై జీవన శైలి వ్యాధులు పంజా విసురుతున్నాయని, 2024-25తో పోలిస్తే కొన్ని వ్యాధులు 50% కంటే ఎక్కువ పెరిగాయని హైదరాబాద్ కి చెందిన ఓ కార్పొరేట్ ఆస్పత్రి విశ్లేషణలో తేలింది. తమ ఔట్ పేషెంట్ విభాగానికి 355 రోజులుగా వచ్చిన రోగుల ఆరోగ్య సమస్యలను విశ్లేషించి ఈ నివేదిక విడుదల చేశారు. డయాబెటిస్, అధిక రక్తపోటు, గుండె వ్యాధులు, బ్రెయిన్ స్ట్రోక్, ఫ్యాటీ లివర్, క్లోమ గ్రంధి వాపు రోగుల సంఖ్య అన్ని రకాల వయసువారిలో 88% పెరిగాయి. పౌష్టికాహారం తగిన మోతాదులో తీసుకోకుండా వారాంతంలో ఎంజాయ్ మెంట్ పేరుతో ఆహారం తిని తాత్కాలికంగా ఎంటాసిడ్ మందుల్ని ఉపయోగిస్తున్నవారి సంఖ్య పెరగటంతో జీర్ణకోశ వ్యాధులు ఎక్కువవుతున్నాయి. గట్ హెల్త్ దెబ్బతినటం, సమయ పాలన, వ్యాయామం లేకపోవటం, అనవసరంగా సాంకేతిక పరికరాల స్క్రోలింగ్ వంటి వ్యసనాల వల్ల ఏకాగ్రతా సమయం బాగా తగ్గిపోయి డోపమైన్ విడుదలలో హెచ్చుతగ్గులు మానసిక సమస్యలకు దారితీస్తున్నాయి. ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థ పటిష్ఠంగా ఉంటే, వ్యాధుల నివారణ మెరుగవటమే కాకుండా.. ఔట్ పేషెంట్లు ఆస్పత్రుల్లో చేరాల్సిన సమస్య చాలావరకూ తగ్గుతుంది.

### వైద్య ఆరోగ్య రంగంలో మనకున్న బలాలు

⏭ అవసరానికి మించి వైద్యులు, నిపుణులు, టీకాల సాంకేతికతలో ప్రపంచ స్థాయి ప్రగతి, ప్రత్యామ్నాయ వైద్య విధానాలు వంటి సానుకూలతలన్నిటి వల్లా.. బడ్జెట్ లో కేవలం 1% అదనంగా కేటాయిస్తే, మనకంటే అనేకరెట్లు వైద్య ఆరోగ్య రంగానికి ఖర్చు చేస్తున్న దేశాలకు దీటుగా మంచి ఆరోగ్యాన్ని చిట్టచివరి పౌరుని వరకూ సౌకర్యవంతంగా, గౌరవప్రదంగా అందించవచ్చు. ప్రపంచబ్యాంక్ గణాంకాల ప్రకారం.. సరైన నివారణ, ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థ ఉంటే, ఆస్పత్రి ఖర్చు 30-40% తగ్గుతుంది. ఆ రకంగా ఆదా అయిన డబ్బు చాలు.. అదనంగా కేటాయించటానికి. ఉదాహరణకు, తెలంగాణ రూ.1900 కోట్లు, ఆంధ్రప్రదేశ్ రూ.2600 కోట్లు అదనంగా

కేటాయిస్తే చాలు. కొన్ని రాష్ట్రాలు మినహాయించి, చాలా రాష్ట్రాలు, జాతీయ స్థాయిలోనూ ఇదే తరహాలో తక్కువ ఖర్చుతో ప్రపంచ స్థాయిలో 80-90 శాతం ప్రమాణాలతో మంచి ఆరోగ్యాన్ని ప్రతి ఇంటికీ అందించవచ్చు.

**ఏపీలో యూనివర్సల్ ఆరోగ్యానికి సరైన పరిష్కారాలేమిటి?**

⏭ ఇప్పుడున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను టీకాలు వంటి సేవలకు పరిమితం చేసి, నివారణ, నియంత్రణ ప్రాథమిక ఆరోగ్యానికి కొత్తగా ఫ్యామిలీ డాక్టర్ వ్యవస్థను తీసుకురావాలి. ఏఐ సాంకేతికతను డిజిటల్ రికార్డుల తయారీ సహా ఫ్యామిలీ డాక్టర్ల పరిధిలోకి తేవాలి.

ం ఫ్యామిలీ డాక్టర్ల మధ్య పోటీ, తమకు నమ్మకమున్న డాక్టర్‌ని ఎంచుకునే స్వేచ్ఛ రోగులకు ఉండే ఏర్పాటు చేయాలి. దీనివల్ల ప్రభుత్వ ఆరోగ్య సంరక్షణ విధానం లక్ష్యమైన 'ప్రజలందరికీ ఖర్చులేని నాణ్యమైన ఆరోగ్యం' నెరవేరుతుంది.

⏭ అయితే గ్రామాలకు డాక్టర్లు వెళ్లటం కష్టం, ప్రజల్ని వైద్యం కోసం నగరాలకి వెళ్లమనటం ఆర్థిక భారం కాబట్టి.. మధ్యే మార్గంగా గ్రామాల మధ్య చిన్న పట్టణాలను అభివృద్ధి చేయాలి.

⏭ డాక్టర్ల మధ్య వైద్యసేవల్లో పోటీ, ప్రజలకు ఎంపిక స్వేచ్ఛ కోసం.. ప్రతి చిన్న పట్టణంలో పది, పదిహేను మంది ఫ్యామిలీ డాక్టర్లు ఒకేచోట ఉండేలా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను నిర్మించాలి. అక్కడే ఏఐ ఆధారిత వైద్య పరీక్షల కేంద్రం, జనరిక్ మందుల దుకాణం ఉంటాయి. ప్రజల వైద్య రికార్డుల్నిడిజిటల్ గా భద్రపరిచే బాధ్యతనూ ఫ్యామిలీ డాక్టరే నిర్వహిస్తారు. ఇలాంటి ఫ్యామిలీ డాక్టర్ ప్రాథమిక సెంటర్లు తొలిదశలో అసెంబ్లీ నియోజకవర్గానికి ఒకటి ఏర్పాటు చేసి క్రమంగా విస్తరించవచ్చు.

⏭ ఎంబీబీఎస్ వైద్యులకు కొద్దిపాటి ఫ్యామిలీ మెడిసిన్ శిక్షణ ఇస్తే ఫ్యామిలీ డాక్టర్లవుతారు. వివిధ కారణాల వల్ల వైద్య కళాశాలలో సబ్జెక్ట్ పరిజ్ఞానం పెద్దగా లేనివారు ఇక్కడ తేలిగ్గా రోగుల నుంచి చికిత్సల అవగాహనను పెంపొందించు కోగలుగుతారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి వచ్చేవారి రికార్డుల ద్వారా వీరికి ఆస్పత్రుల్లోని బెడ్ సైడ్ సేవల ద్వారా లభించే వైద్య పరిజ్ఞానం అందుతుంది. ఇదే సమయంలో వీరిలో బాగా పోటీపడగలవారు కొంతకాలం తర్వాత పోస్టు గ్రాడ్యుయేషన్, పరిశోధనలు, ఇతరత్రా ఉన్నత చదువులకి వెళ్లగలుగుతారు.

⏭ ఔట్ పేషెంట్ సేవల్ని పూర్తిగా ఫ్యామిలీ డాక్టర్ కి పరిమితం చేసి, ఆ డాక్టర్ రెఫరల్ తో తప్ప పైన ఆస్పత్రి చికిత్సకు వెళ్ల కుండా వడపోత విధానాన్ని అమలు చేయాలి. అత్యవసర కేసులకు మాత్రమే మినహాయింపు. ఎంత మంది రోగులు ఒక డాక్టర్ సేవల్ని వినియోగించుకుంటే, ఆ మేరకు రోగికి ఇంత చొప్పున ప్రభుత్వం ఫీజు చెల్లించాలి. గ్రామాల్లోని శిక్షణ లేని వైద్య సేవల సిబ్బందిని ఫ్యామిలీ డాక్టర్ సెంటర్ తో అను సంధానం చేసి, వారికి సహాయకులుగా పనిచేసే అవకాశం కల్పించాలి.

**శిక్షణ పొందిన డాక్టర్ కి ఏఐ ప్రత్యామ్నాయం కాదు**

కృత్రిమ మేధ (ఏ.ఐ) డాక్టర్ కి ప్రత్యామ్నాయం కాదు. అది ఎంబీబీఎస్‌లు, ఎం.ఎస్ లు చదవలేదు. అయినా సరే, చాలా మంది ఏ.ఐ ని వ్యక్తిగత వైద్యుడి కిందే జమకట్టేస్తున్నారు. ఏ చిన్న ఆరోగ్య సమస్య వచ్చినా, సలహా కోరుతున్నారు. ప్రిస్క్రిప్షన్ అడుగుతున్నారు. పెద్ద డాక్టర్ దగ్గరకు వెళ్లే ముందు, తర్వాత కూడా ఏ.ఐని అభిప్రాయం అడుగుతున్నవారున్నారు. సమాచారంలో తేడా వస్తే, ఏ.ఐ వైపే మొగ్గు చూపుతున్నారు. డాక్టర్‌కి ఏమీ తెలియదంటూ అభాండాలు వేస్తున్నారు. అక్కడితే ఆగకుండా, ఏఐ అప్లికేషన్ ను పక్కన పెట్టుకుని, అడిగిన వాళ్లకు, అడగనివాళ్లకూ వైద్య సలహాలు ఇచ్చేస్తున్నారు. ఇది ఎంత ప్రమాదకరమో ఇటీవల డాక్టర్ నాగేశ్వరరెడ్డి సహా పలువురు వైద్యులు చెబుతున్నారు. ఫిబ్రవరి 2026లో యూనియన్ ప్రభుత్వం ఆరోగ్య రంగంలో ఏఐ వ్యూహం ముసాయిదా కోసం జరుగుతున్న ప్రాంతీయ సదస్సుల్లో భాగంగా విజయవాడలో జరిగిన కార్యక్రమంలో నిపుణులు కూడా ఇదే మాట చెప్పారు. సమస్యను గుర్తించకుండా ఏఐని ఫ్యామిలీ డాక్టర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు ప్రత్యామ్నాయంగా ఉపయోగిస్తే కొండ నాలుకకి మందేస్తే ఉన్న నాలుక ఊడిన చందంగా పరిస్థితి తయారవుతుందని ప్రభుత్వాలు, సమాజం గుర్తించాలి.

⏭ ఎంబీబీఎస్ డాక్టర్లందరికీ నెలకు లక్షన్నర, రెండు లక్షల ఆదాయం లభిస్తుంది. పోటీ వల్ల ఆదాయం కోసం ఇంకా ఎక్కువ సమర్థంగా సేవలందించటం పెరిగి రోగులకు లాభం జరుగుతుంది. ప్రజలకు దగ్గర్లో, జబ్బుల్ని తొలిదశలోనే సమర్థంగా నియంత్రించుకోగలిగే నమ్మకమైన వ్యవస్థ ఏర్పాట వుతుంది.

⏭ ఆయుర్వేదం, హోమియో, యోగా, ధ్యానం, ఫిజియో వంటి సాధనలు, థెరపీలన్నిటినీ ఫ్యామిలీ డాక్టర్ సెంటర్ పరిధిలోకి తేవాలి.

⏭ ఇప్పుడున్న ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ ను ద్వితీయ స్థాయి వైద్యానికి అనుసంధానం చేసి, అక్కడ కమ్యూనిటీ హెల్త్ సెం టర్లకి, ప్రయివేటు నర్సింగ్ హోంలకి పోటీ ఏర్పాటు చేయాలి.

ం దిగువ రెండు దశల్లో ఇలాంటి సమర్థ వైద్య ఆరోగ్య సేవల ఏర్పాటు చేస్తే, తృతీయ స్థాయి ఆస్పత్రుల మీద ఒత్తిడి తగ్గి ప్రభుత్వ ఆస్పత్రులు సమర్థంగా సేవలందించగలుగుతాయి. ఇక్కడ ప్రయివేటు భాగస్వామ్యాన్ని.. వైద్య విద్యార్థుల బోధనకు, కాస్త ఫీజు చెల్లించగలిగిన సంపన్నులకు రోజుకు కొంత సమయంపాటు తీసుకోవచ్చు. ఇందుకోసం ప్రత్యేక బ్లాకుల్ని నిర్మించవచ్చు. కానీ మొత్తంగా తృతీయ స్థాయి వైద్యం ప్రభుత్వం పరిధిలోనే ఉండాలి. లేకుంటే బడ్జెట్ అదుపు తప్పటం ఖాయం.

⏭ ఏ.ఐ తదితర సాంకేతికతల్ని డాక్టర్ ప్రత్యక్ష పర్యవేక్షణలోనే ఉపయోగించాలి. అమెరికా, బ్రిటన్, చైనా తదితర దేశాల్లోని గణాంకాలతో నిర్మితమైన ఏ.ఐని యధాతథంగా ఉపయోగించ కుండా..

(మిగతా 34వ పేజీలో)

# రూ.3,32,205.34 కోట్లతో ఏపీ 2026-27 బడ్జెట్

**2026-27 ఆర్థిక సంవత్సరానికి రూ. 3,32,205.34 కోట్లఅంచనా వ్యయంతో ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ ను ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ శాసనసభలో సమర్పించారు. వ్యవసాయ, అనుబంధ శాఖల బడ్జెట్ ను ఆ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ప్రవేశపెట్టారు.**



గతం కంటే ఓ పది వేల కోట్లు అదనంగా జోడించటానికి ఆంధ్రప్రదేశ్ చాలా కష్టపడింది. ఏదో పెంచాలి కాబట్టి పెంచినట్లుంది తప్ప.. నిజంగా అంత ఆదాయ స్థాయి కూడా లేదని గణాంకాలు చూస్తే అర్థమవుతుంది. రాష్ట్ర విభజన తర్వాత హైదరాబాద్ అండ లేకపోవటం వల్ల ఏపీ నష్టపోయిన మాట వాస్తవం గానీ, ఇంత సంక్షోభానికి కారణం మాత్రం స్వయంకృతం. ఏపీ కంటే చాలా ఎక్కువ ఆదాయమున్న రాష్ట్రాలు కూడా దుస్సాహసం చేయలేని రీతిలో సామాజిక పెన్షన్ల దగ్గర్నుంచి సంక్షేమం పేరుతో తాత్కాలిక వ్యక్తిగత పథకాలను అభివృద్ధిని పణంగా పెట్టి మరీ రెట్టింపు స్థాయిలో అందిస్తుండటం వల్ల ఏపీ దేశంలోనే అత్యంత సంక్షుభిత రాష్ట్రంగా మారింది. అంతకుముందు ప్రభుత్వం.. అభివృద్ధిని కోరేవారందరూ వర్గ శత్రువులు, సంక్షేమమే పరిపాలన అంటే అన్నట్లు వ్యవహరించగా.. వారిని ఓడించటానికి ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఇంకా ఎక్కువ హామీలనిచ్చింది. అభివృద్ధి పట్ల అపార శ్రద్ధను కనబరుస్తున్నా, తాయిలాల భారం విపరీతమై రాష్ట్రం తీవ్ర ఒడిదుడుకులకు లోనవుతోంది. లోక్‌సత్తా జేపీ లాంటి వారి సలహానుసరించి, వడ్డీల్ని తగ్గించుకోవటం ద్వారా ఏడాదికి ఓ రూ.1648 కోట్లు ఆదా చేయటం, రూ.లక్షన్నర కోట్ల దాకా ఉండొచ్చు అని అంచనా వేసిన (ఇంకా ఎంతో లెక్క తెలియదు) పెండింగ్ బిల్లుల్లో రూ.24,811 కోట్ల బకాయిలు చెల్లించటం మాత్రమే ఆర్థిక క్రమశిక్షణ దిశగా సాధించిన ప్రగతి.

రెవెన్యూ లోటుని రూ.22,002 కోట్లకే పరిమితం చేస్తామని ఆర్థిక మంత్రి పేర్కొన్నారు. ద్రవ్యలోటు రూ.75,868.09 కోట్లుగా అంచనా వేశారు. సామాజిక పింఛన్లకు పెద్దఎత్తున

**2026-27 ఏపీ బడ్జెట్ స్వరూపం (రూ. కోట్లలో)**

**మొత్తం : 3,32,205.34**

| | |
|---|---|
| మూలధన వసూళ్లు | : 98,065.20 |
| రెవెన్యూ వసూళ్లు | : 2,34,140.14 |
| మూలధన చెల్లింపులు | : 22,147.32 |
| రెవెన్యూ వ్యయం | : 2,56,142.64 |
| రుణాలు, అడ్వాన్స్‌లు | : 5,217.67 |
| మూలధన వ్యయం | : 48,697.71 |
| రెవెన్యూ లోటు | : 22,002.50 |
| ద్రవ్య లోటు | : 75,868.09 |

నిధులిచ్చారు. మహిళలు, బీసీలు, ఎస్.సి, ఎస్.టిల సంక్షేమానికి గణనీయంగా కేటాయింపులు చూపారు. సాగునీటి ప్రాజెక్టులు, రోడ్లు, వ్యవసాయానికి కేటాయింపులు తగ్గకుండా చూశారు. విద్యకు రూ.34,875 కోట్లు ఇచ్చారు. ఇందులో అత్యధికం పాఠశాల విద్యకు, కొంత యువత నైపుణ్యాలకు కేటాయించారు. మరోవైపు, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు యూనియన్ ప్రభుత్వ సహకారం తీసుకుంటామన్నారు. యూనియన్ బడ్జెట్ రాష్ట్రానికి ఏ విధంగా ఉపయోగపడే అవకాశముందో విశదీకరించారు.

**పింఛన్లకు రూ.27,719 కోట్లు**





ఎన్.టి.ఆర్ భరోసా పెన్షన్లకు రూ.27,719 కోట్లు కేటాయించారు. తల్లికి వందనం కార్యక్రమానికి రూ.9,668 కోట్లు ఇచ్చారు. అన్నదాతా సుఖీభవ పథకం కింద రైతులకు సాయం చేసేందుకు రూ.6600 కోట్లు కేటాయించారు. ఏడాదికి మూడు ఉచిత సిలిండర్లు ఇచ్చేందుకు దీపం 2.0 కింద రూ.2,601 కోట్లు ప్రతిపాదించారు. మహిళలు, యువతులు తదితరుల ఉచిత బస్సు ప్రయాణానికి రూ.1420 కోట్లు, బలహీన వర్గాల వారికి ఉచిత విద్యుత్తు, రాయితీపై విద్యుత్తు ఇచ్చేందుకు రూ.600 కోట్లు కేటాయించారు. వివిధ సామాజిక వర్గాల వారికి ఆర్థిక సాయం చేసేందుకు రూ.2,320 కోట్లు ఇచ్చారు. ఆటోడ్రైవర్లకు సేవలో కార్యక్రమానికి రూ.450 కోట్లు, మత్స్యకార సేవలో పథకానికి రూ.260 కోట్లు, ఉపకార వేతనాలకు రూ.3,836 కోట్లు, మధ్యాహ్న

భోజనానికి రూ.2,161 కోట్లు నిధులిచ్చారు. పురపాలక, పట్టణాభివృద్ధికి రూ.14,538.68 కోట్లు, ఇంధనం, విద్యుత్ కి రూ.13,934.25 కోట్లు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు రూ.22,914 కోట్లు కేటాయించారు. పర్యాటక రంగానికి ప్రాధాన్యతనిచ్చారు.

**సాగునీటి రంగానికి..**

పోలవరం ప్రాజెక్టును వచ్చే ఏడాది పూర్తి చేయాలనే లక్ష్యంతో రూ.6,105 కోట్లు కేటాయించారు. ఇదికాక ఇతర భారీ సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం పూర్తి చేసేందుకు రూ.9,906 కోట్లు ప్రతిపాదించారు. సాగునీటి రంగానికి



మొత్తంగా రూ.18,223 కోట్లు. వ్యవసాయ, అనుబంధ శాఖలకు రూ.53,752 కోట్లు కేటాయించారు. రైతుల కోసం రూ.500 కోట్లతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ధరల స్థిరీకరణకు రూ.300 కోట్లు చూపినా, ఒక్క ఏడాదిలోనే రైతులకు రూ.1200 కోట్లకు పైగా కేటాయించామని మంత్రి తెలిపారు. పేదల కోసం ఆరు లక్షల కొత్త ఇళ్లు నిర్మాణం పూర్తి చేస్తామని ప్రకటించారు. కొత్తగా 100 కోర్టులకు ఆమోదం తెలిపారు. ప్రతి జిల్లాలో ప్రత్యేక సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేయబోతున్నారు. పోలీసు వ్యవస్థను ఆధునీకరిస్తామన్నారు.

## రాబడులు పెరగకుండా రెవెన్యూ లోటు ఎలా తగ్గిస్తారు?

2025-26 ఆర్థిక సంవత్సరంలో రెవెన్యూ లోటును 33,185.97 కోట్లకు పరిమితం చేస్తామని ప్రభుత్వం చెప్పిందిగానీ, కేవలం 9 నెలల్లోనే 182% పెరిగి రూ.60,480 కోట్లకు లోటు చేరుకుంది. 2024-25 ఆర్థిక సంవత్సరం కన్నా 4% మాత్రమే రెవెన్యూ రాబడులు పెరుగుతుండగా, 2026-27లో రెవెన్యూ లోటు రూ.22,002.50 కోట్లకు ఎలా కట్టడి చేస్తారో వివరించలేదు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర రెవెన్యూ రాబడి జనవరి వరకు ప్రత్యేక మార్జిన్ సహా రూ.1,40,540 కోట్లుగా అధికారిక లెక్కలే పేర్కొంటుంటే, వచ్చే ఆర్థిక సంవత్సరం రూ.2.34 లక్షల కోట్లు ఆశిస్తున్నట్లు బడ్జెట్ లో పేర్కొన్నారు.

## అప్పుల లెక్కేది?

**వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ.98,065 కోట్ల మేర రుణాలు తీసుకుంటామని బడ్జెట్‌లో ప్రకటిం చింది.**

✦ 2026-27 చివరి నాటికి రుణం రూ.7,11,094 కోట్లకు చేరుతుందని అంచనా.

✦ 2025 డిసెంబర్ నాటికి కార్పొరేషన్ గ్యారంటీలు రూ.3,11,182 కోట్లు.

✦ పెండింగ్ బిల్లులు రూ.1 లక్ష కోట్లకు పైగానే ఇంకా ఉన్నట్లు అంచనా.

**కొత్త నిర్ణయాలు, ప్రాజెక్టులు**

✦ రాయలసీమలో గ్లోబల్ హార్టికల్చర్ హబ్ (రూ.30,000 కోట్లు) కు ఏర్పాట్లు. యూనియన్ సాయం, ప్రయివేటు భాగస్వామ్యం, బ్యాంకు రుణాలతో ఈ ప్రాజెక్టుకు రూపకల్పన.

✦ విశాఖ, అమరావతి, తిరుపతి ఆర్థిక జోన్ల అభివృద్ధి. యూనియన్ సాయం ఇందులో కీలకం.

✦ అమరావతి నిర్మాణానికి రూ.6,000 కోట్లు.

✦ వచ్చే ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ 1 నుంచి చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్తు అమలు.

✦చేనేత కార్మికులకు ఆర్థిక సాయం కింద రూ.245 కోట్లు.

✦ నార్వే, అబుధాబి సావరిన్ తరహాలో రూ.100 కోట్లతో ఏపీ సంపద నిధి (వెల్త్ ఫండ్) ఏర్పాటు. ప్రయివేటు భాగస్వాములను కూడా కలిపి ఆ నిధులతో ఇతర చోట్ల ప్రధాన ప్రాజెక్టులలో పెట్టుబడులు పెడతారు. ఆ ఫలితాల నుంచి రాష్ట్ర ఆర్థిక శక్తిని పెంచుకోవాలనేది ఆలోచన.

✦ క్వాంటమ్ కంప్యూటింగ్ సౌకర్యాలకు రూ.638 కోట్ల కేటాయింపు.

✦ దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం.

**మరికొన్ని ముఖ్యాంశాలు:**

✦ వైద్య రంగానికి రూ.19,306 కోట్లు

✦ వచ్చే మూడేళ్లలో మరో 15 లక్షల ఎకరాల్లో ఉద్యాన సాగు

✦వ్యవసాయ, వ్యవసాయేతరరంగాల్లో 9లక్షల ఉద్యోగాలు

✦ సూక్ష్మ సేద్యంలో ఆటోమేషన్

✦ లాజిస్టిక్స్, ప్యాకింగ్, బ్రాండింగ్

✦ ఐటీ సామర్థ్యాల పెంపుకి రూ.536 కోట్లు

✦ రోడ్లు, ఎయిర్ పోర్టులకి రూ.13,546 కోట్లు

✦ రూ.లక్ష కోట్లతో నగరాలు, చిన్న పట్టణాల అభివృద్ధికి 'అర్బన్ ఛాలెంజ్ ఫండ్'ను సద్వినియోగం గావించుకునేందుకు 25% వాటా చెల్లించటం

✦ మొత్తంగా అన్ని రంగాలలో కలిపి మూలధన వ్యయానికి రూ.53,915 కోట్లు కేటాయింపు. ఇది గతేడాది కన్నా రూ.13,000 కోట్లు ఎక్కువ. ✦

# 'స్ప్రింట్+మారథాన్ ఎంట్రప్రెన్యూర్'లా ప్రభుత్వం పనిచేయాలి

## -ఆర్థిక సర్వే 2026లో హెచ్చరికతో కూడిన ఆశావాదం-

2025-26 ఆర్థిక వృద్ధి రేటు 7.4% కంటే వచ్చే ఏడాది 2026-27 వృద్ధి రేటు స్వల్పంగా తగ్గే అవకాశం ఉన్నా.. అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా భారత్ తన స్థానాన్ని నిలబెట్టుకుంటుందని ఆర్థిక సర్వే 2026 తెలిపింది. అంతర్జాతీయంగా ఒడిదుడుకులు, వాణిజ్య సుంకాల బెడద వంటివి వెంటాడుతున్నాయని, అయినా ప్రపంచ సగటును మించి భారత్ వృద్ధి రేటు సాధిస్తుందని తెలిపింది. 2026-27లో మన దేశ వృద్ధి రేటు 6.8% నుండి 7.2% మధ్య ఉండవచ్చని అంచనా వేసింది. ప్రధాన ఆర్థిక సలహాదారు అనంత నాగేశ్వరన్ ఆధ్వర్యంలో రూపొందించిన 739 పేజీల 2026 ఆర్థిక సర్వేను యూనియన్ ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో ప్రవేశపెట్టారు.

ముఖ్యాంశాలు:

◈ యూనియన్ ప్రభుత్వం విధానపరంగా అవసరమైన సాహసోపేత మార్పులకు సిద్ధంగా ఉంది. ఇటీవలి సంవత్సరాలలో చేపట్టిన కొన్ని పాలసీ సంస్కరణలసంచిత ప్రభావం.. మధ్యకాలిక వృద్ధి అవకాశాలను 7 శాతం దాకా చేర్చింది. దీంతో అంతర్జాతీయ అనిశ్చితిని తట్టుకుని భారత్ స్థిరమైన వృద్ధిని సాధిస్తోంది.

◈ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ చర్యల వల్ల పేదరికం తగ్గింది. అట్టడుగు స్థాయిలో ఉండే 5% నుండి 10% మంది ప్రజల వినియోగ వ్యయం పెరిగింది. సబ్సిడీలు, పెన్షన్లు, నగదు బదిలీలతో పాటు విద్య, వైద్యంపై ప్రభుత్వ వ్యయం పెరగటం వల్ల సానుకూల ఫలితాలొస్తున్నాయి. అయితే, రాష్ట్రాల్లో నగదు బదిలీల వంటి ఆర్థిక జనాకర్షక పథకాల వ్యయం మూలధన వ్యయాన్ని మించటం ఆందోళన కలిగిస్తోంది.

◈ చాలా రాష్ట్రాల్లో బేషరతు నగదు బదిలీ (యూసీటీ) పథకాలు వేగంగా విస్తరిస్తున్నాయి. వాటి సంక్షేమ వ్యయంలో వీటి వాటా అధికమవుతుండటం ఆర్థిక ఒడిదుడుకులకు కారణమవుతోంది.

◈ 2026 ఆర్థిక సంవత్సరంలో మహిళలకు యూసీటీ కింద 1.7 లక్షల కోట్ల నగదు బదిలీ జరిగింది.

◈ 15-29 ఏళ్ల వయసున్న యువతలో కేవలం 4.9 శాతం మందికే ఒకేషనల్, టెక్నికల్ శిక్షణ అందుబాటులో ఉంటోంది. దీనిని విస్తరించాల్సిన అవసరం ఉంది.




◈ పాఠశాలల్లోనే నైపుణ్య శిక్షణ అందించాలి.

◈ 40 శాతం గిగ్ వర్కర్లు.. నెలకు రూ.15 వేల కంటే తక్కువ వేతనాన్నే పొందుతున్నారు.

◈ జీడీపీలో ద్రవ్యలోటును 4.4 శాతానికి తగ్గించే సరైన లక్ష్యం దిశగానే యూనియన్ ప్రభుత్వం సాగుతోంది. రాష్ట్రాల రెవెన్యూ లోటు పెరుగుతున్నా.. అవి జీడీపీలో 2.4 శాతం మూలధన వ్యయాన్ని కొనసాగించేలా జాతీయ స్థాయి ప్రభుత్వం సహకరిస్తోంది.

◈ ఏఐలో భారత్ ఆలస్యంగానే ప్రవేశించినా, లక్ష్యం దిశగా వేగంగా సాగుతోంది. అయితే అందులో ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదమూ పొంచివుంది.

◈ సుంకాల వల్ల దెబ్బతిన్న కార్మిక రంగానికి పాలసీలు, పన్ను సంస్కరణలతో ప్రభుత్వం ఊతమిచ్చింది. జీ.ఎస్.టి రేట్ల తగ్గింపు, కార్మిక చట్టాల సమూల ప్రక్షాళన ద్వారా వ్యాపారాలపై భారాన్ని తగ్గించటం, ఐరోపా కూటమితో కలిపి నాలుగు స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలపై ముందుకు సాగటం కలిసి వచ్చాయి.

◈ అమెరికా సుంకాల వల్ల డాలరుతో పోలిస్తే రూపాయి 5శాతం పడిపోయింది. అయితే దాని విలువ భారత ఆర్థిక గణాంకాల మీద పెద్దగా లేదు.

◈ ఏప్రిల్ 1 నుండి అమల్లోకి రానున్న కొత్త ఆదాయ పన్ను చట్టంతో మరింత సరళత్వంతోపాటు పన్ను చెల్లింపుదారులకు నిర్మాణాత్మక స్పష్టత రానుంది.

◈ వ్యవసాయ, ఆక్వా ఉత్పత్తులు, ఆహారం, పానీయం ఎగుమతులు వచ్చే నాలుగేళ్లలో 100 బిలియన్ డాలర్లకు చేరనున్నాయి. అయితే పాలసీల్లో తరచూ మార్పులు, సరఫరా వ్యవస్థల్లో అంతరాయాలు, అంతర్జాతీయంగా అనిశ్చితి, విదేశీ కొనుగోలుదారులు ప్రత్యామ్నాయ మార్గాలకు మళ్లటం వంటి ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది.

◈ ఇటీవలికాలంలో పలు రాష్ట్రాలు వ్యవసాయ రంగంలో

సంస్కరణలు చేపట్టాయి. భూ నిర్వహణ, మార్కెట్లు, నీటి నిర్వహణ, టెక్నాలజీ వినియోగం, భిన్న పంటల సాగు వల్ల వ్యవసాయ దిగుబడులు పెరిగాయి.

**డిజిటల్ ఎడిక్షన్ తగ్గించాలి**

◈ డిజిటల్ ఎడిక్షన్ ను తగ్గించేందుకు వయసు ఆధారిత సోషల్ మీడియా అందుబాటు వ్యవస్థను ప్రవేశపెట్టాలి.

◈ ఆన్ లైన్ బోధన టూల్స్ పై ఆధారపడటాన్ని తగ్గించాలి. పిల్లలకు బేసిక్ ఫోన్ల వంటివే అందచేయాలి. చదువు కోసమే రూపొందించే ట్యాబ్ లను ఇవ్వాలి.

◈ అల్ట్రా ప్రాసెస్డ్ ఆహార వాణిజ్య ప్రకటనలను ఉదయం 6 నుండి రాత్రి 11 గంటల వరకు నిషేధించాలి.

◈ సున్నిత సమాచారాన్ని మినహాయించేలా సమాచార హక్కు చట్టాన్ని పునర్వ్యవస్థీకరించాలి.

◈ ప్రయాణీకుల ఛార్జీల పెంపుతో సరకు రవాణాపై ఆధారపడే పరిస్థితి నుండి రైల్వే శాఖ నెమ్మదిగా బయటకు వస్తోంది. సరకు రవాణా ఆదాయం 68 శాతం నుంచి 65 శాతానికి తగ్గింది. భవిష్యత్తులో 62 శాతానికి తగ్గనుంది.

**పోషకాహారం -- జీవనశైలి వ్యాధులు**

◈ పోషకాహార అంతరాలతో పెరిగిపోతున్న జీవనశైలి వ్యాధులను అరికట్టేందుకు ఆరోగ్య సప్లిమెంట్లపై ప్రజలకు అవగాహన కల్పించాలి. ఇందుకోసం ఆహార సంబంధిత సంస్కరణలను తేవాలి. వైద్యపరంగా అందించే చికిత్సలకు ఎనర్జీ, పోషక పానీయాలు, ఒత్తిడి తగ్గించే సూత్రీకరణలు, బరువు తగ్గించే పానీయాలు సమానం కాదని ప్రజలకు తెలియచేయాలి.

◈ దేశంలోని చాలామంది ప్రజలు.. సూచించిన దానికంటే అధికంగా తృణ ధాన్యాలను వినియోగిస్తున్నారు. తక్కువ రక్షణ కల్పించే ఆహార పదార్థాలను ఎక్కువగా తీసుకుంటున్నారు. దేశంలో స్థూలకాయం వయసులతో సంబంధంలేకుండా పెరుగుతోంది.

**బంగారం, వెండి ధరలు అధికంగానే..**

అంతర్జాతీయ అనిశ్చితుల కారణంగా బంగారం, వెండి ధరలు 2026లోనూ అధికస్థాయిలో కొనసాగవచ్చని సర్వే అంచనా వేసింది. అయితే గతేడాది కంటే కొంత తక్కువ ఉండొచ్చని తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా యుద్ధాలు తగ్గి కుదుటపడితేనే, ధరలు తగ్గుతాయని పేర్కొంది.

◈ 2025-26 లో మన దేశ ప్రాథమిక క్యాపిటల్ మార్కెట్లు అద్భుతంగా రాణించాయి. అనిశ్చిత పరిస్థితుల్లోనూ ఐపీఓల్లో అంతర్జాతీయ అగ్రగామిగా నిలిచాం.

◈ భారత పౌర విమానయానం స్థిర వృద్ధి బాటలో వెళు తోంది. 2014లో విమానాశ్రయాల సంఖ్య 74 కాగా, ఇప్పుడు 164కు చేరాయి. 2024-25లో 41.2 కోట్ల మంది దేశీయ విమానాశ్రయాల ద్వారా ప్రయాణించారు. ప్రస్తుతం పది లక్షల మందికి 0.11 చొప్పున విమానాశ్రయాలున్నాయి, మన దేశంలో ఈ రంగంలో వృద్ధికి మరిన్ని అవకాశాలున్నాయి.

◈ బంగారం, వెండి ధరలు అధికంగా ఉన్నా ద్రవ్యోల్బణం పెద్దగా పెరిగే అవకాశాలు తక్కువ.

◈ దేశీయ ఔషధ రంగం నుండి భారత కార్పొరేట్ రంగం స్ఫూర్తిని పొందాలి. అంతర్జాతీయ టారిఫ్ తట్టుకుని లాభా లను ఎలా ఆర్జించాలో ఈ రంగం తెలియ చేసింది.

◈ కృత్రిమ మేధ, డేటా సెంటర్ల విద్యుత్ వల్ల గిరాకీ పెరగ నుంది. దీనివల్ల రాగికి కొరత ఏర్పడే అవకాశం ఉంది.

◈ అంతర్జాతీయంగా పోటీనివ్వాలంటే భారత్ తన పారిశ్రామిక క్లస్టర్ వ్యూహాన్ని మరింత బలోపేతం చేయాలి. అధిక ఉత్పాదకత, సంస్కరణలతో కూడిన వ్యవస్థను పునర్ని ర్మించాలి. ఐ.ఎఫ్.ఎస్.సీ.ఏ, గిఫ్ట్ సిటీ తరహాలో సంస్థాగత వ్యవస్థలతో కలపటం వల్ల మరింత సాధికారత లభిస్తుందని సర్వే వెల్లడించింది.

◈ ఎగుమతుల విషయంలో ఎదురవుతున్న అవాంతరాల దృష్ట్యా భారత్ 'స్వదేశీ' బాట పట్టటం అత్యవసరం. అయితే అది దిగుమతులకు అడ్డుకట్ట వేయకూడదు. దిగుమతుల విషయంలో తెలివైన, షరతులతో కూడిన, పోటీతత్వాన్ని

**తెలంగాణలో పెరుగుతున్న రెవెన్యూ లోటు**

రాష్ట్రంలో గడచిన ఆరేళ్లలో రెవెన్యూ లోటు పెరిగిందని ఆర్థిక సర్వే వెల్లడించింది. జి.ఎస్.డి.పి వృద్ధితో పోలిస్తే సొంత రెవెన్యూ రాబడి తగ్గటం, ఆదాయం కన్నా నగదు బదిలీ పథకాల వంటి ఖర్చులు పెరగటం ఈ పరిస్థితులకు కారణం. మిగులు రాష్ట్రం నుండి 2025 నాటికి రెవెన్యూ లోటులోకి వెళ్లింది. ఇదే సమయంలో ఆహారం, ఇంధనం సహా ప్రజలు రోజూ వినియోగించే వస్తువుల ధరలు స్థిరంగా ఉన్నాయి. హెడ్‌లైన్ ద్రవ్యోల్బణం ప్రస్తుత ఏడాదికి 0.20 శాతంగా ఉంది.

⋆ జనరేటివ్ ఏఐ స్టార్టప్‌లలో తెలంగాణ నాలుగో స్థానంలో నిలిచింది. సేవా రంగంలో కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు, తెలంగాణ కలిపి 40 శాతం వాటా కలిగివున్నాయి.

⋆ అత్యంత వేగంగా విస్తరిస్తున్న నగరాల జాబితాలో హైదరాబాద్ నాలుగో స్థానంలో ఉంది. అయితే, ముంబయి, ఢిల్లీ, బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ ఆ మేరకు ఉత్పాదకత, మెరుగైన నివాస ప్రాంతాలుగా మారటం లేదు. 2035 నాటికి పది నగరాల జాబితాలో జీడీపీ పరంగా హైదరాబాద్ రెండో స్థానంలో ఉంటుందని సర్వే అంచనా వేసింది.

పెంచే తరహా పద్ధతులను అనుసరించాలి. సామర్థ్యం, ఆవిష్కరణలకు అవరోధం కాకుండా చూసుకోవాలి.

◈ ఇంధన భద్రత వ్యూహంలో భాగంగా మొక్కజొన్న ఆధారిత ఇథనాల్ సాగు లాభసాటి కావటంతో, రైతులు ఆహార ధాన్యాలు, పప్పులు, నూనె గింజల సాగుకు దూరమవుతున్నారు. దీనివల్ల ఆహార భద్రత ప్రమాదంలో పడే అవకాశం ఉంది.

◈ ప్రపంచ భౌగోళిక రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో భారత్ 'స్ప్రింట్ లాగా మారథాన్ పరుగు తీయాలని' సర్వే సూచించింది. స్వల్పకాలంలో పరిష్కారాలు కోరుకునే బదులు.. బలమైన, వినూత్నమైన ఆవిష్కరణలతో వికసిత్ భారత్ దిశగా అడుగులు వేయాలి. విధానపరమైన విశ్వసనీయత, అంచనాలు, పరిపాలనాపరమైన క్రమశిక్షణ చాలా కీలకంగా మారొచ్చు.

◈ అంతర్జాతీయ ఇంధన మార్పులకు ఇప్పటివరకు టెక్నాలజీపరమైన అడ్డంకులు ఎదురయ్యేవి. అయితే ఇప్పుడు కీలక ఖనిజాలు, రాగి, అరుదైన భూ అయస్కాంతాల వంటివి వ్యూహాత్మక అడ్డంకులుగా మారుతున్నాయి.

◈ పర్యాటక రంగానికి ఊతమివ్వాలంటే వారసత్వ కట్టడాల వద్ద లైవ్ ఈవెంట్లు నిర్వహించాలి. ఇందుకోసం సింగిల్ విండో అనుమతుల విధానాన్ని తీసుకురావాలి. అంతర్జాతీయంగా మొత్తం మ్యూజిక్ ఆదాయాల్లో లైవ్ మ్యూజిక్ ఆదాయం వాటా మూడో వంతు ఉంది. అమెరికా ఒక్కటే 130 బిలియన్ డాలర్ల ఆదాయాన్ని ఆర్జించింది. 2019 ప్రాంతంలోనే 9 లక్షల ఉద్యోగాలను సృష్టించింది.

◈ వాహన పరిశ్రమ ఎగుమతుల్లో గణనీయ వృద్ధి నమోదైంది. 2024-25లో ప్రయాణీకులు, వాణిజ్య, ద్విచక్ర, త్రిచక్ర విభాగాల్లో 53 లక్షల వాహనాలు ఎగుమతి అయ్యాయి. ఈ రంగంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా 3 కోట్ల మంది ఉపాధి పొందుతున్నారు.

◈ దేశంలో విదేశీ పోర్ట్ ఫోలియో మదుపర్లు (ఎఫ్.పి.ఐ) పెట్టుబడులు 2025-26లో ఊగిసలాటకు గురవుతున్నాయి. దేశంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్.డి.ఐ) లను బలోపేతం చేయటానికి బహుముఖ వ్యూహం అవసరం.

◈ అంతర్జాతీయ ఉక్కు ధరల్లో అసమానతలు, ముడి వస్తువుల రూపంలో దేశీయ ఉక్కు పరిశ్రమ సవాళ్లు ఎదుర్కొంటోంది. మన దేశ పారిశ్రామికీకరణ, మౌలిక సదుపాయాలకు ఈ రంగంలో సరఫరా కీలకం.

◈ మొబైల్ ఫోన్ల తయారీకి ఊతమిచ్చేందుకు ప్రోత్సాహక పథకం కింద ఇచ్చిన రూ.13,759 కోట్ల ఫలితంగా.. 2024-25లో దేశంలో ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తి 11.3 లక్షల కోట్లకు చేరుకుంది. ఎగుమతులు పెరిగాయి.

### రెవెన్యూ లోటు నుండి ఇంకా బయటపడని ఏపీ.. ఆర్థికాభివృద్ధి చర్యలు ప్రశంసనీయం

ఆంధ్రప్రదేశ్, పంజాబ్, పశ్చిమ బెంగాల్, హర్యానా, కేరళ, రాజస్థాన్ స్పష్టమైన రెవెన్యూలోటుతో ఉన్నాయని సర్వే తెలిపింది. ఏపీలో అమలు చేస్తున్న భూవినియోగ మార్పిడి విధానాన్ని ప్రశంసించింది. కొన్ని నిర్దిష్ట వర్గాలకు భూ వినియోగ మార్పిడి అవసరాన్ని తొలగించారని, విధాన ప్రక్రియలో జరిగే జాప్యాన్ని గణనీయంగా తగ్గించేందుకు నాలా రద్దు దోహదపడుతుందని సర్వే తెలిపింది. పర్యావరణ అనుమతులకూ థర్డ్ పార్టీ తనిఖీలు, స్వీయ ధృవీకరణ వంటి సులభతర పద్ధతులను అమలు చేస్తున్న రాష్ట్రాల్లో ఏపీ కూడా ఉందని పేర్కొంది. రాష్ట్రంలో ద్రవ్యోల్బణం తగ్గి నిత్యావసరాల ధరలు సామాన్యులకు అందుబాటులో ఉన్నాయని తెలిపింది. దేశానికి వచ్చే విదేశీ విద్యార్థుల్లో పెరుగుదల నమోదు చేసిన రాష్ట్రాల్లోనూ ఏపీ స్థానం సంపాదించిందని సర్వే పేర్కొంది. దేశానికి వచ్చే విదేశీ విద్యార్థుల సంఖ్య 2000-2001లో ఏడు వేల లోపు ఉండగా, 2020 నాటికి 49 వేలకు చేరింది. విదేశాలకు అత్యధికంగా విద్యార్థులను పంపుతున్న దేశంగా భారత్ నమోదైంది. విదేశాల్లో చదువుతున్న భారతీయ విద్యార్థుల సంఖ్య 2025లో 18 లక్షలకు చేరింది. ఏపీ, పశ్చిమ బెంగాల్, కర్ణాటక, గుజరాత్‌లలో మహిళా కార్మిక శక్తి ఎక్కువగా ఉంది. అయితే ఇప్పటికీ నిర్మాణాత్మక అడ్డంకులు ఎదురవుతున్నాయి. మహిళా కార్మిక శక్తి రేటు దేశవ్యాప్తంగా 2017-18లో 23.3% ఉండగా.. 2023-24 నాటికి 41.7 శాతానికి చేరింది. మహిళలు నిర్వహించే సంస్థల వాటా పెరిగింది. మహిళల భాగస్వామ్యాన్ని పెంచేందుకు బహుముఖ విధాన దృక్పథం అవసరమని సర్వే సూచించింది. పరిశ్రమలకు అవసరమైన అనుమతులను ఏపీ ప్రభుత్వం సింగిల్ విండో, బిజినెస్ రిఫార్మ్ యాక్షన్ ప్లాన్ ద్వారా ఇస్తూ సమయాన్ని తగ్గిస్తోందని, డిజిటల్, ఆన్‌లైన్ పద్ధతుల వల్ల వేగంగా పురోగతి సాధిస్తోందని తెలిపింది. తమిళనాడు, కేరళ రాష్ట్రాలూ సుస్థిర విధానాలతో పరిశ్రమలకు అనుకూల పరిస్థితులను కల్పించాయి. దేశంలో సిమెంటు ఉత్పత్తి చేసే రాష్ట్రాల్లో ఏపీ రెండో స్థానంలో ఉంది. దేశంలో 11 రాష్ట్రాల్లో కేంద్రీకృతమైన సిమెంటు ఉత్పత్తి వ్యవస్థాపక సామర్థ్యం 690 మిలియన్ టన్నులు. దేశంలో ప్రపంచ ప్రమాణాలతో యూనియన్ అభివృద్ధి చేసిన మూడు బల్క్‌డ్రగ్ పార్కులలో గుజరాత్, హిమాచల్ ప్రదేశ్‌లతోపాటు ఒకటి ఏపీలో ఉంది.

◈ స్వచ్ఛ ఇంధనం దిశగా అడుగులు వేస్తున్న మన దేశానికి ముడివస్తువుల కొరత, ఇంధన నిల్వ అవసరాలు వంటివి ప్రధాన అడ్డంకులుగా మారాయి. ఇంధన వనరులను విస్తరించటం, లభ్యతను పెంచటం, గ్లోబల్ వార్మింగ్ ను తగ్గించటంలో భారత్ బహుముఖ కృషి చేస్తోంది.

◈ ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణం అరుదైన అవకాశమని, సులభతర జీవనానికి ఇది భవిష్యత్ నగరంగా నిలుస్తుందని ఆర్థిక సర్వే పేర్కొంది. ✧

# గిగ్ ఎకానమీ.. మహిళల సాధికారత



సమ్మిళిత ఆర్థికాభివృద్ధికి, మన రోజువారీ జీవితానికి స్థానిక ప్రభుత్వాల సాధికారత ఎంతో కీలకమైనా, వాటి గురించి లోక్‌సత్తా జేపీ లాంటి వారు తప్ప ప్రజలు, పార్టీలు, పౌరసమాజం, ప్రజాసంఘాలు డిమాండ్ చేసే సందర్భాలు తక్కువ. అదే విధంగా మహిళా సమానత్వం గురించి మహిళలే పెద్దగా డిమాండ్ చేయరు. ఇస్తినమ్మ వాయనం, పుచ్చుకుం టున్నమ్మ వాయనం తరహా జీవితాన్నే ఎక్కువగా గడుపుతుంటారు కాబట్టి, ఎవరో వచ్చి తమకు సాధికారత కల్పిస్తారని ఎదురు చూస్తుంటారు.

అయితే ఉన్న స్థానిక ప్రభుత్వాల్లోనే కొందరు సర్పంచ్‌లు, ఛైర్మన్లు, మేయర్లు, వార్డు సభ్యులు అద్భుతాలు చేసినట్లే, ఉన్న పురుషాధిక్య వ్యవస్థలోనే మన దేశంలో మహిళలు గొప్ప విజయాలు సాధించటం ఇటీవల గణనీయంగా పెరిగింది. జపాన్ ఆర్థికంగా గొప్ప దేశమైనా, లింగ సమానత్వంలో మనలాగే వెనుకబడిన దేశం. 148 దేశాల మధ్య మనం 131వ స్థానంలో ఉంటే, జపాన్ ర్యాంకు కాస్త మెరుగ్గా 118గా ఉంది. అలాంటి దేశంలో కష్టపడి నేర్చుకోవటం, పనిచేయటం ద్వారా తొలి మహిళా ప్రధానమంత్రిగా ఎన్నికయ్యారు సనాయీ తకాయిచి. ఆమె తరచూ చెప్పే 'పని-పని-పని-పని' పదం 2025లో జపాన్‌లో అత్యంత ప్రాచుర్యపదంగా ఎంపికైంది. కొన్ని నెలలు అధికారంలో ఉందామని కాకుండా, మెజారిటీ లేనప్పుడు పదవి అనవసరం అనుకుని ఎన్నికలకు వెళ్లి ఘనవిజయం సాధిం చారు. తకాయిచి గణనీయ విజయంతో 2026 ప్రారంభమవటం ఆశావహ పరిణామం. మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి గొప్ప సందేశం. ఇదే సమయంలో భారత్ లో ఆర్థిక, రాజకీయ స్వావలంబన దిశగా మహిళల చొరవ పెరిగిందని పలు నివేదికలు వెలువడుతున్నాయి. స్థిరమైన ఉపాధి అవకాశాల కోసం ఎదురుచూడకుండా, గిగ్ ఎకానమీలో కూడా మహిళల భాగస్వామ్యం పెరుగుతోంది. అయితే ప్రభుత్వం తన బాధ్యతలను నెరవేర్చటంలో సమర్థంగా వ్యవహరించేందుకు కొన్ని రకాల చర్యలు తీసు కోవ టం కార్మికశక్తిలో మహిళల భాగస్వామ్యం పెరగటానికి అవసరమని రిపోర్టులు సూచి స్తున్నాయి. గిగ్ ఆర్థిక వ్యవస్థలో భారత మహిళల సాధికారతపై వీవీ గిరి కార్మిక కేంద్రం ఇటీవల ఒక ఆచరణసాధ్య నివేదికను విడుదల చేసింది.

గిగ్ ఎకానమీ మన దేశ మహిళలకు ఆర్థిక సాధికారత కల్పిస్తోందని నివేదిక తెలిపింది. వారు కుటుంబంలో ఆదాయం పెరగటానికి గణనీయంగా తోడ్పడుతున్నారు. అయితే పురుషులతో సమానంగా వేతనాలు, ఉద్యోగ భద్రత, ఆరోగ్య సంరక్షణ, వేతనంతో కూడిన సెలవులు, కచ్చితమైన పనివేళలు, పని ప్రదేశాల్లో వివక్ష వంటి సవాళ్లు వారికి ఎదురవుతున్నాయి. దేశంలో 2047 నాటికి 6.1 కోట్ల మంది గిగ్ కార్మికులు పనిచేస్తారని, వారిలో మహిళల శాతం పెరుగుతోందని పేర్కొంది. మహిళా కార్మికులకు భద్రత కల్పించాలని, మెరుగైన ఆదాయాలు

**భారతదేశంలో గిగ్ వర్కర్ల సంఖ్య పెరుగుదల**

| సంవత్సరం | మొత్తం గిగ్ వర్కర్లు (లక్షల్లో) | మహిళల శాతం (%) |
|---|---|---|
| 2020 | 68 | 18% |
| 2021 | 72 | 19% |
| 2022 | 77 | 20% |
| 2023 | 85 | 21% |
| 2030 (అంచనా) | 230 | 25% |



పొందేందుకు నైపుణ్య శిక్షణ, డిజిటల్ అక్షరాస్యత అందించాలని సూచించింది. **నివేదికలోని ముఖ్యాంశాలు:**

☞ పని ప్రదేశాల్లో సాయంత్రం, రాత్రి విధులు నిర్వహిం చటానికి 76% మంది మహిళలు అభద్రతకు గురవు తున్నారు.

☞ స్వేచ్ఛ, స్వయంప్రతిపత్తి, అనుకూల సమయాల్లో పనిచేసేందుకు అవకాశాలున్నా.. అక్కడి పరిస్థితులు, సామాజిక, వేతన అభద్రతలు, అల్గారిథమ్‌తో నియం త్రణ, లింగ వివక్ష అడ్డంకులుగా మారుతున్నాయి.

☞ గిగ్ రంగంలో పనిచేస్తున్న మహిళల్లో 83% మంది వివాహితలే. చాలా కుటుంబాలు మరొక్క సంపాందనతోనే మనుగడ సాగించగలుగుతున్నాయి.

☞ కార్మికుల్లో 57% మంది మహిళలు నెలకు రూ.20 వేలకు పైగా సంపాదిస్తున్నారు. 8.2% మంది మాత్రమే రోజుకి వెయ్యి రూపాయల చొప్పున సంపాదిస్తున్నారు. 88% మంది కార్మికులు ఆరోగ్య సమస్యలు, పని ఒత్తిడి, భద్రతా సవాళ్లు ఎదుర్కొంటున్నారు.

☞ గిగ్ కార్మికుల్లో 60.8% మంది ఇతర ప్రాంతాల నుండి వలస వచ్చినవారే. 68 శాతం మందికి రేషన్ కార్డులున్నా.. ఆ ప్రయోజనాలు పొందలేకపోతున్నారు.

**గిగ్ కార్మికుల నెలవారీ సంపాదన ఇలా (రూ. వేలల్లో):**

| | | |
|---|---|---|
| 37% మంది | - | 15-20,000 |
| 32% మంది | - | 20-25,000 |
| 17% మంది | - | 25-30,000 |
| 7.9% మంది | - | 30-34,000 |
| 0.3% మంది | - | 35,000 పైగా |

**రంగాల వారీగా మహిళా గిగ్ వర్కర్లు**

| రంగం | మహిళల శాతం | ప్రధాన పనులు |
|---|---|---|
| బ్యూటీ అండ్ వెల్నెస్ | 35% | బ్యూటీ సర్వీసులు |
| ఆన్లైన్ ఫ్రీలాన్సింగ్ | 25% | కంటెంట్ రైటింగ్, డిజైన్ |
| ఈ-కామర్స్ సపోర్ట్ | 20% | కస్టమర్ సపోర్ట్ |
| హోమ్ సర్వీసులు | 15% | ట్యూటర్, కుక్ |
| రైడ్/డెలివరీ సేవలు | 5% | డెలివరీ |

**ఇవీ సూచనలు:**

☞ మహిళలు ప్రసూతి ప్రయోజనాలు, శిశు సంరక్షణ, ఆరోగ్య, ప్రమాద బీమా, పింఛను పథకాలను ప్రభుత్వం, అగ్రిగేటర్లు కలిపి అందించాలి.

☞ మహిళల సమస్యల పరిష్కారం కోసం 24 గంటలూ అందుబాటులో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయాలి. జీపీఎస్ ట్రాకింగ్, కస్టమర్ రిస్క్ రేటింగ్ ను అమలు చేయాలి.

☞ అల్గారిథమ్ పేరిట మహిళల స్వయంప్రతిపత్తిని దెబ్బతీయకూడదు. రేటింగ్స్ తక్కువ పేరిట అపరాధ రుసుము వసూలు, అకౌంట్స్ నిషేధించటం వంటివి మానుకోవాలి.

☞ గిగ్ కార్మికులకు యూనియన్లు, సహకార వ్యవస్థలు ఏర్పాటు చేసుకునే అవకాశమివ్వాలి. వాటిల్లో మహిళా సభ్యులకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలి.

**వయసులవారీగా మహిళా కార్మికులు:**

| వయసు | 18-25 | 25-30 | 30-35 | 35-40 | 40-45 |
|---|---|---|---|---|---|
| శాతం | 7.32 | 39.44 | 30.99 | 18.31 | 3.66 |


✧

# సమాచార హక్కుకు సమాధి?

పనిగట్టుకొని ప్రజల సమాచార హక్కును కాలరాస్తున్నారు. 'పొమ్మనకుండా పొగబెట్టిన' చందంగా హక్కును తొలగించకుండానే అది అమలు కాని వాతావరణాన్ని పెంచి పోషిస్తున్నారు. పాలనలో పారదర్శకతకు తిలోదకాలిచ్చి గోప్యతను మళ్లీ అందలాలెక్కిస్తున్నారు. ఒకవైపు స్వచ్ఛంద సమాచార వెల్లడిని ప్రభుత్వ విభాగాలు నిర్లక్ష్యం చేస్తుంటే మరోవైపు ఆర్టీఐ దరఖాస్తులకు స్పందించాల్సిన అధికారుల్లో జవాబుదారీతనం మందగిస్తోంది. స్పందన లభించని దరఖాస్తులతో పాటు అప్పీళ్లు పెద్ద సంఖ్యలో పెండింగ్ పడుతున్నాయి. రెండో అప్పీళ్లూ సకాలంలో పరిష్కార మవట్లేదు. రాజ్యాంగం హామీ ఇచ్చిన 'తెలుసుకునే ప్రజల హక్కు' మసకబారే పరిస్థితి రెండు తెలుగు రాష్ట్రాల్లో కళ్లకు కడుతోంది.

దేశ పౌరులు పోరాడి సాధించుకున్న సమాచార హక్కు చట్టం అమలు రెండు తెలుగు రాష్ట్రాల్లో నీరుగారుతోంది. భయమో, భక్తో... అంతకు ముందు అడగ్గానే సమాచారం ఇచ్చిన అధికారులు కూడా ఇప్పుడు నిరాకరించడం లేదా నిర్లక్ష్యం చేయడం రివాజయింది. ఆర్టీఐ దరఖాస్తులకు స్పందించకపోయినా, సమాచారం ఇవ్వకపోయినా తమకు ఏమీ కాదనే ఓ గిడసబారుతనం అధికార యంత్రాంగంలో పెరిగింది. పారదర్శకతను భంగం చేసే కొత్త చట్టాలు-- ఉన్న చట్టంలో మార్పులు, వివిధ స్థాయుల్లో తీసుకునే సర్కారు నిర్ణయాలు, పలు పరిణామాలు... పౌరులు తెలుసుకునే హక్కును పలుచన చేస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరికి తోడు సమాచార కమిషన్లు, న్యాయస్థానాల పనితీరు కూడా కొంత మేర కారణమవుతోంది. వ్యక్తిగత గోప్యత ముసుగులో.... కేంద్రం 'డిజిటల్ వ్యక్తిగత సమాచార భద్రత-- డీపీడీపీ చట్టం' తీసుకువస్తూ సమాచార హక్కు చట్టం నడ్డి విరిచింది. వ్యక్తిగత గోప్యతా భద్రతకు సమాచార హక్కు చట్టం అవరోధమవుతోందంటూ, సదరు చట్టంలో ఇప్పటికే పొందుపరచిన 'జాగ్రత్త'ను విస్మరించి, పారదర్శకత స్ఫూర్తినే భంగపరుస్తూ నిర్ణయం తీసుకుంది. డీపీడీపీ చట్టంలోని కొన్ని అంశాలు సమాచార హక్కు చట్టం మౌలిక పారదర్శక విధానానికే విరుద్ధం.

2005లో సమాచార హక్కు చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత తొలిసారి, 2019లో కేంద్ర ప్రభుత్వం చేసిన సవరణలతోనే చట్టం బిగువును సడలించారు. కమిషన్ పదవీ కాలాన్ని, కమిషనర్ల హోదాని తగ్గించడమే కాకుండా పలు కీలక అంశాలను కేంద్రం పరిధిలోకి తెచ్చుకున్నారు. దాంతో ఆ చట్టానికీ, స్వతంత్ర ప్రతిపత్తికీ కొంతమేర కోరలు పీకినట్టయింది. డీపీడీపీ చట్టంలో పొందుపరచిన అంశాల వల్ల ఆర్టీఐలో వచ్చిన మార్పులు సదరు చట్టం అమలును




మరింత నీరుగార్చాయి. పాలనా ప్రక్రియలో అధికారులకు ఏదో రూపంలో వ్యక్తిగత సంబంధం కలదిగా పరిగణించే ఏ సమాచారాన్ని డీపీడీపీ చట్టప్రకారం పౌరులకు ఇవ్వనవసరం లేదనే నిబంధనను కొత్తగా తీసుకువచ్చారు. 'పర్సరీ ' అనే పదానికి ఇప్పటికే ఉన్న విస్తృతార్థం దృష్ట్యా ఇది వ్యక్తులకే కాకుండా సంస్థలకు, విభాగాలకూ వర్తించి, అలా చాలా చోట్ల సమాచార నిరాకరణకు తాజా నిబంధన ఓ ఆయుధంగా మారుతోంది. జస్టిస్ పుట్టుస్వామి వర్సెస్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా (2017) కేసులో సుప్రీంకోర్టు విస్తృత ధర్మాసనం వ్యక్తిగత గోప్యతను పౌరుల ప్రాథమిక హక్కులో భాగంగా సష్టం చేసింది. దరిమిలా పలు స్థాయి చర్చల తర్వాత డిజిటల్ వ్యక్తిగత గోప్య సమాచార భద్రతకు ప్రత్యేక చట్టం తెచ్చే ప్రక్రియ మొదలైంది. చివరకు 2025 నవంబరు 13న డాటా ప్రొటెక్షన్ బోర్డు అమలులోకి వచ్చింది. డీపీడీపీ చట్టం దశల వారీ అమలు ప్రక్రియను ప్రారంభించి, 2025 నవంబరు 14న ఈ చట్ట నిబంధనల్ని (రూల్స్) అమలులోకి తెచ్చారు. ఇదివరకే ఆ భద్రత ఉంది! పౌరుల వ్యక్తిగత గోప్యత ప్రాథమిక హక్కే అని సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం తేల్చడానికి చాలా ముందే 'సమాచార హక్కు చట్టం' పౌరుల గోప్యత హక్కును గుర్తించింది.

**సమాచారాన్ని 'వ్యక్తిగత గోప్యత' కారణం చూపి డీపీడీపీ సెక్షన్ 44 (3) ప్రకారం నిరాకరించే ఆస్కారం ఏరడు తోంది. దీంతో నియామకాల ఫైళ్లు, ప్రొక్యూర్మెంట్ రికార్డులు, ఆడిట్ నివేదికలు, ప్రజానిధుల వ్యయ నివేదికలు... ఇలాంటివేవీ ప్రజలకు అందుబాటులో ఉండవు, ఆర్టీఐ చట్టం ఇప్పించదు. ఇది పాలనలో పారదర్శకతకు భంగకరం. కోర్టుల మాట పెడచెవిని పెట్టడమే!**




వ్యక్తిగత గోప్యత పౌరుల తెలుసుకునే సమాచార హక్కుకు ప్రతిబంధకం కావొద్దనీ, అదే సమయంలో సమాచారం తెలుసుకునే హక్కు పౌరుల వ్యక్తిగత గోప్యతకు భంగకరం కాకూడదనీ ఎంతో జాగ్రత్త వహించిన తీరు మనకు 'సమాచార హక్కు చట్టం--2005'లో స్పష్టంగా కని పిస్తుంది. పౌరులు కోరినప్పటికీ ఏయే సందర్భాల్లో సమా చారం ఇవ్వనవసరం లేదో సమాచార హక్కు చట్టం సెక్షన్ 8(1)లో పలు సందర్భాలను పేర్కొన్నారు. అందులో, సబ్ సెక్షన్ 8(1) జె ఒకటి. 'ప్రజావ్యవహారాలతో ఏ నిమిత్తం లేని, పూర్తి వ్యక్తిగత సమాచారాన్ని ఇవ్వనవసరం లేదు' అని అందులో పేర్కొన్నారు. ఇటువంటి సందర్భాల్లో ప్రజా సమాచార అధికారి (పీఐవో) నేరుగా నిరాకరించవచ్చు. కానీ, 'అలా సమాచారం కోరటం ఒకరి వ్యక్తిగత గోప్యత లోకి అనుచితంగా చొరబడటం కాకుండా నిజంగా సదరు సమాచారానికి ప్రజా వ్యవహారాలకు ప్రత్యక్ష సంబంధం ఉంటే, నిబంధనతో నిమిత్తం లేకుండా పీఐవో సమాచారం ఇచ్చి తీరాల్సిందే' అన్న వివరణ ఆర్టీఐ చట్టంలో ఉంది. దీన్ని, ప్రస్తుత డీపీడీపీ చట్టం ద్వారా తొలగించారు. ఫలితంగా ప్రజా వ్యవహారాలతో సంబంధం ఉండే బోలెడు సమాచారాన్ని 'వ్యక్తిగత గోప్యత' కారణం చూపి డీపీడీపీ సెక్షన్ 44 (3) ప్రకారం నిరాకరించే ఆస్కారం ఏర్పడు తోంది. దీంతో నియామకాల ఫైళ్లు, ప్రొక్యూర్మెంట్ రికార్డులు, ఆడిట్ నివేదికలు, ప్రజానిధుల వ్యయ నివే దికలు... ఇలాంటివేవీ ప్రజలకు అందుబాటులో ఉండవు, ఆర్టీఐ చట్టం ఇప్పించదు. ఇది పాలనలో పారదర్శకతకు భంగకరం. కోర్టుల మాట పెడచెవిని పెట్టడమే! కమిషన్లు క్రియాశీలంగా ఉండటం సర్కార్లకు ఇష్టమున్నట్టు లేదు.

అందుకే, కమిషనర్ల నియామకం కూడా తరచూ వివాదాస్పదం అవుతోంది. కొన్నిసార్లు ఉద్దేశ పూర్వకంగానే కమిషన్లను ఖాళీ ఉంచుతున్నారు. అందరూ రిటైరయి, కనీసం ఒక్క కమిషనర్ కూడా విధుల్లో లేని పరిస్థితి తెలంగాణ గత ప్రభుత్వ హయాంలో దాదాపు రెండేళ్లపాటు సాగింది. 'ఫలానా తేదీ లోపు చర్యలు తీసుకోండి' అంటూ అప్పటికే హైకోర్టు పలుమార్లు హెచ్చరించింది. 2023లో కొత్త ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత కమిషనర్ల నియామక ప్రక్రియ చేపట్టి పూర్తి చేసింది. జార్ఖండ్ ఆర్టీఐ కమిషన్‌కు సంబంధించిన ఓ కేసు విచారిస్తూ దేశ సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఈ విషయంలో తీవ్రమైన వ్యాఖ్యలే చేసింది. దేశ వ్యాప్తంగా సమాచార కమిషన్లలో ఉన్న ఖాళీలను సత్వరం భర్తీ చేయడమే కాకుండా, అప్పీళ్ల పెండింగ్ పరిస్థితిని బట్టి అవసరమైతే తగు సంఖ్యలో కొత్తగా అదనపు కమిషనర్లను నియమించుకోవాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

సమాచార హక్కు చట్టం అమలులోకి వచ్చిన రెండు దశాబ్దాల తర్వాత ఇప్పుడు, పూర్తిస్థాయి 'ఆన్‌లైన్ ఆర్టీఐ దరఖాస్తు' విధానాన్ని ఏపీలో అందుబాటులోకి తెస్తున్నారు. ఎప్పుడో ప్రారంభించిన తెలంగాణలో ఇప్పుడిది అంత ఆశావహమైన స్థితిలో లేదు. ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా చేసుకున్న దరఖాస్తుల్లో 98 శాతం పరిష్కారానికి నోచుకోకుండా పడి ఉన్నట్టు సమాచారం! ఇదీ ఆర్టీఐ దరఖాస్తు ద్వారా సేకరించిన అధికారిక సమాచారమే! పరిస్థితి ఇలా ఉంటే... ఇక పౌరులకు సమాచారానికి దిక్కేది? ఆర్టీఐ చట్టం అమలుకు దారేది? ✧

**(-దిలీప్ రెడ్డి, 'సాక్షి' సౌజన్యంతో)**

## ఆర్టీఐ కమిషన్‌కు కొత్త చీఫ్, నలుగురు కమిషనర్లు

రాష్ట్ర సమాచార హక్కు కమిషన్‌లో ఖాళీగా ఉన్న పదవులను భర్తీ చేస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కొత్తగా ఒక చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్‌తో పాటు నలుగురు ఇన్ఫర్మేషన్ కమిషనర్లను నియమించింది. గుంటూరుకు చెందిన సీనియర్ న్యాయవాది వజ్జా శ్రీనివాసరావును రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్‌గా నియమించారు.ఇక రాష్ట్ర సమాచార కమిషనర్లుగా పరవాడ సింహాచలం నాయుడు, వట్టికుట్టి శరత్ చంద్ర కల్యాణ చక్రవర్తి, వొంటేరు రవిబాబు, గజుల ఆదెన్నలను ప్రభుత్వం నియమించింది. ఈ నియామకాలను ఎంపిక కమిటీ సిఫారసుల మేరకు ప్రభుత్వం ప్రకటించింది.సమాచార హక్కు చట్టం కింద ప్రజలు దాఖలు చేసే అప్పీలు, ఫిర్యాదులను రాష్ట్ర సమాచార కమిషన్ పరిశీలించి నిర్ణయాలు తీసుకుంటుంది.

# 'అర్బన్ ఛాలెంజ్ ఫండ్' తో చిన్న పట్టణాల్ని ఉపాధి కేంద్రాలుగా అభివృద్ధి చేయండి

ఆంధ్రప్రదేశ్ 2026-27 బడ్జెట్ లో వినూత్న అభివృద్ధి ఆలోచనలున్నాయిగానీ, తాత్కాలిక వ్యక్తిగత సంక్షేమ పథకాల విషయంలో సాంప్రదాయ రాజకీయ ధోరణి వల్ల అంకెలు అహేతుకంగా ఉన్నాయని లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ విజయనగరంలో అన్నారు. విశాఖపట్నం, తిరుపతి, అమరావతి ప్రధాన ఆర్థిక ప్రాంతీయ అభివృద్ధి కేంద్రాలుగా పెంచటం ఆహ్వానించదగ్గ పరిణామమన్నారు. అదేవిధంగా, ఆస్తులు సృష్టించే పెట్టుబడుల కోసం 'వెల్త్ ఫండ్' మంచి ఆలోచన అన్నారు. పోర్టులు, విమానాశ్రయాలు, పర్యాటకాభివృద్ధి, హార్టీకల్చర్‌కి అడుగులు సరైన దిశలో ఉన్నాయన్నారు. అయితే ఆర్థికంగా మన కంటే బలమైన రాష్ట్రాలు కూడా ఇవ్వని రీతిలో పెన్షన్లు వగైరాలకు భారీ కేటాయింపుల వల్ల అసలే అప్పుల్లో ఉన్న రాష్ట్రం ఇంకా దెబ్బ తినే ప్రమాదం ఉందన్నారు.

లోక్‌సత్తా వ్యవస్థాపకులు జేపీ చెప్పినట్లు, ఆదాయాలు పెరిగే వరకూ సంక్షేమ పథకాలను హేతు బద్ధీకరిస్తే, ఇంకా ఎక్కువ సంక్షేమానికి అవకాశం ఏర్పడేదన్నారు. జలవనరుల ప్రాజెక్టుల్లో ముందు పెండింగ్ లో ఉన్నవి పూర్తి చేయాలన్నారు. విద్యకు కేటాయింపులు సమస్య కాదని, అంత డబ్బిచ్చినా చదువు ఎందుకు రావటం లేదో లోతుగా అధ్యయనం చేయాలన్నారు. గేట్స్-మెలిందా ఫౌండేషన్, టాటా గ్రూప్‌తో కలిసి ఏఐ సహకారంతో అమలు చేస్తున్న 'సంజీవని' పథకం ఆరోగ్య రంగంలో సర్వరోగనివారణిగా భావించవద్దని, ప్రాథమిక ఆరోగ్యానికి ఎంబీబీఎస్ స్థాయి డాక్టర్లు అవసరమని, వారి పరిధిలో ఏఐ పనిచేయాలన్నారు. రెవెన్యూ, ద్రవ్యలోటు ఎలా భర్తీ చేస్తారో, అప్పులు తీరే ఆదాయ మార్గమేంటో చెప్పలేదన్నారు.

సంక్షేమం, అభివృద్ధి మధ్య సమతూకం సాధించాలనే ఆలోచన కనిపిస్తున్నా.. ఆచరణలో కనిపించలేదని విమర్శించారు. సహకార రంగంలో అవకాశాల్ని సద్వినియోగం గావించుకోవాలన్నారు. యూనియన్ ప్రభుత్వం ప్రకటించిన అర్బన్ ఛాలెంజ్ ఫండ్ ద్వారా చిన్న పట్టణాలను అభివృద్ధి చేసి గ్రామీణ యువతకు తయారీరంగంలో ఉపాధికి అవకాశం కల్పించాలన్నారు.

## ఏపీ AI 'సంజీవని'తో యూనివర్సల్ హెల్త్ కేర్?

**(22వ పేజీ తరువాయి)**

మన దేశ పరిస్థితులకనుగుణంగా బీపీ, దయాబెటిస్ తదితర గణాంకాల్ని నిర్ధారించటం ఫ్యామిలీ వైద్యుల విధుల్లో భాగం కావాలి.

⏭ ఇవన్నీ సక్రమంగా అమలు కావటానికి, ఒక రెగ్యులేటర్ అథారిటీని స్థానిక స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకూ ప్రభుత్వానికి జవాబుదారీగా ఉండేలా ఏర్పాటు చేయాలి.

⏭ సేవలు దుర్వినియోగం కాకుండాకొద్దిపాటి ఫీజులేదా ఆరోగ్య పన్ను రూపంలో కొంత మొత్తం తీసుకోవచ్చు. యూనివర్సల్ హెల్త్ కేర్ అంటే అందరికీ వర్తిస్తుంది కాబట్టి.. ప్రశ్నించే గొంతున్న మధ్య, ఎగువ తరగతి వర్గాలు కూడా భాగమవటం సేవల నాణ్యతను పెంచుతుంది. ప్రజల వాటా డబ్బుని ప్రభుత్వం సంక్షేమం పేరుతో అమలు చేస్తున్న పథకాలలో కొద్దిమొత్తం ఆరోగ్య పన్ను రూపంలోనూ మినహాయించుకోవచ్చు. ప్రభుత్వాలు మంచి ఆరోగ్యాన్ని అందిస్తుంటే, ప్రజలు సంతోషంగా ఇందుకు అంగీకరిస్తారు.. సొంతంగా కూడా కొంత చెల్లించటానికి ముందుకొస్తారు.

⏭ ప్రజారోగ్య కార్యక్రమాలు సవ్యంగా జరగటానికి స్థానిక ప్రభుత్వాలకు జవాబుదారీతనంతో నిధుల్ని, అధికారాల్ని ఇవ్వటం.

.. ఇలా ప్రభుత్వ, ప్రయివేటు భాగస్వామ్యాన్ని మన బలాలు, బలహీనతలు, ప్రజల అవసరాలు, బడ్జెట్ కి అనుగుణంగా అమలు చేయాలి. కాలం మారింది కాబట్టి ప్రయివేటు భాగస్వామ్యం; ప్రయివేటు వర్గాల వల్ల పేదలకు నష్టం వంటి వాదోపవాదాలతో రాజకీయం చేస్తే ప్రయోజనం లేదు.

గ్రామాలకు క్వాలిఫైడ్ వైద్యులు వెళ్లని సమస్యను చిన్న పట్టణాలలో ఏఐ అనుసంధానిత, పోటీ, ఎంపిక స్వేచ్ఛ ఉన్నఫ్యామిలీ డాక్టర్వైద్యంఅత్యుత్తమ ఆచరణసాధ్య పరిష్కారమవుతుంది. ఈ పునాది మీద సమగ్ర ఆరోగ్య విధానాన్ని ప్రభుత్వం నిర్మించాలి. ఆపైన ద్వితీయ స్థాయిలో ప్రభుత్వ సి.హెచ్.సిలు, ప్రయివేటు నర్సింగ్ హోంల మధ్య పోటీ; ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ తదితర ఇన్సూరెన్స్ సేవల్ని ఈ మధ్యస్థాయికి పరిమితం చేయటం; తృతీయ స్థాయిలో పూర్తిగా ప్రభుత్వ ఆధ్వర్యంలో కొంతమేర ప్రయివేటు నిపుణుల సేవలు.. ఈ నమూనా ద్వారా తలకిందులుగా ఉన్న ప్రభుత్వ వైద్య విధానాన్ని సరిచేయవచ్చు. డాక్టర్ జేపీ లాంటి వారు చెబుతున్నట్లు ఈ పరిష్కారాల నేపథ్యంలో సింగపూర్ నమూ నాను పరిశీలించాలి. ✦

# అవినీతి తగ్గిపోయిందట!

‘ఎవరు స్వామీ తమరు నాముందు ప్రత్యక్షమయ్యారు, ఏం కావాలి?’

‘నీకే ఏదైనా వరం ఇచ్చేందుకు వచ్చాను’

‘నేనేదో మామూలు ఆటో డ్రైవర్ని, నాకు వరాలెందుకు స్వామీ’

‘నీ ఆటోలో దొరికిన బంగారు నగల సంచీని సొంతదారులకు చేర్చావు చూడూ, నీ నిజాయతీకి మెచ్చి వచ్చాను!’

‘దేశంలో అవినీతి తగ్గిందట, అదేదో ఇండెక్స్లో మన ర్యాంకూ పైకొచ్చిందట! మరి, నేను కూడా నిజాయతీగా ఉండాలి కదా’

‘అదంతా, నిజమే!’

‘నిజంగానే నిజం స్వామీ!’

‘అయితే పుట్టుక నుంచి చావుదాకా మనిషికి అవసరమైన కొన్ని పత్రాలను తీసుకురా! ఎక్కడా లంచం ఇవ్వద్దు, అదే షరతు!’

‘అవినీతి తగ్గాక, లంచంతో పనేముంది స్వామీ’

‘మాటలెందుకు, ముందు పని చూడు’

★★★★

‘సార్, మా అబ్బాయి బర్త్ సర్టిఫికెట్లో కరెక్షన్ చేయాలి’

‘కరెక్షన్కు ఆధారంగా పత్రాలేమున్నాయి?’

‘పిల్లాడికి బర్త్ సర్టిఫికెటే తొలి పత్రం, అంతకన్నా ముందు ఆధారాలంటే, పూర్వజన్మలోకి వెళ్లాల్సిందే సార్’

‘ఆ పంచులన్నీ పక్కింటోళ్లతో రీల్స్‌లో వేసుకో, ఆధారం ఉంటే చూపించు, లేకపోతే బయల్దేరు’

‘పనయ్యే మార్గమే లేదా సార్’

‘రెండువేలు కొడితే మార్గం, రోడ్డు, రహదారి అన్నీ కనిపిస్తాయి. ఇదీ పంచంటే, అదుర్స్ కదూ!’

★★★★

‘ఏయ్ ఆటో ఆపు, కాగితాలన్నీ చూపించు’

‘ఆర్సీ, లైసెన్సూ, ఇన్సూరెన్సూ, పొల్యూషనూ, బండి రెన్యువలూ, ఖాకీచొక్కా.. అన్నీ ఉన్నాయి సార్’

‘డ్రంకెన్ డ్రైవింగ్ సంగతేంటి?’

‘మిషిన్ పగిలేలా ఊదుతా, చెక్ చేసుకోండి’

‘నంబర్ ప్లేట్ సరిగ్గా కనిపించడం లేదు’

‘రోడ్లన్నీ గుంతలే.. పడితే బురదలే...’




## భారత్‌లో స్వల్పంగా తగ్గి, అమెరికాలో పెరిగిన అవినీతి

భారత్‌లో అవినీతి కొద్దిగా తగ్గగా, అమెరికాలో స్వల్పంగా పెరిగింది. ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ ఇటీవల విడుదల చేసిన 2025 నివేదిక ప్రకారం.. ప్రపంచ అవినీతి సూచీలో (2024) 96వ స్థానంలో ఉన్న భారత్ 2025 నాటికి 91వ స్థానానికి చేరింది. విభిన్న కసరత్తులు, నిపుణుల విశ్లేషణలు, సర్వేల ఆధా రంగా ఈ సూచీని రూపొందిస్తారు. ఇందులో శూన్య (0) పాయింట్లు సాధించిన దేశం పూర్తి అవినీతి మయమని, 100 పాయింట్లు సాధించిన దేశంలో అవినీతి అనేదే లేదని అర్థం. డెన్మార్క్ 100కు 89 పాయింట్లు పొంది అతి తక్కువ అవినీతి కలిగిన దేశంగా అగ్రభాగాన నిలిచింది. తదుపరి రెండు స్థానాలు ఫిన్లాండ్, సింగపూర్ లకు దక్కాయి. అంతకుముందు సంవత్సరమూ ఈ మూడు దేశాలే అగ్రస్థానాల్లో నిలి చాయి. అవినీతి నిర్మూలన విషయంలో భారత్ 39 పాయింట్లు సాధించగలిగింది. పాకిస్థాన్, ఇరాక్ లు 28 చొప్పున పాయింట్లు పొందాయి. దక్షిణ సూడాన్, సోమా లియా దేశాలు ఈ సూచీలో 9 పాయింట్లతో అట్టడుగున నిలిచాయి.ట్రంప్ పగ్గాలు చేపట్టిన తర్వాత ఏడాది కాలంలో అమెరికాలో అవినీతి పెరిగిందని నివేదిక తెలిపింది. అంతకుముందు సంవత్సరంతో పోలిస్తే 2025లో ఒక పాయింటు తక్కువ పొంది అవినీతి సూచీ లో ఆ దేశం 29వ స్థానంలో నిలిచింది.

‘ప్రశ్నకు పాట సమాధానం కాదు’

‘గుంతలో పడితే, బురద పడిందని ‘షార్ట్’గా చెబుతున్నా, తుడిచేద్దాం సార్’

‘ఇది నోపార్కింగ్ ప్లేస్, ఇక్కడెందుకు ఆపావ్’

‘నేనెక్కడ ఆపాను, మీరే చెకింగంటూ ఆపారు’

'ఇప్పుడు బండి ఆగి ఉందా లేదా?'
'మీరు ఆపితేనే ఆగింది కదా'
'ఆగినచోట నోపార్కింగ్ బోర్డు ఉంది కదా, ఫైన్ తీయ్'
'వసూళ్ల వేటకు డిసైడయ్యాక, కాటు తప్పదనుకుంటా!'
'చలానా ఆన్లైన్లో కట్టుకో, ఇప్పుడు వెయ్యి కొట్టు'
'ఇది డబ్బుల్ ధమాకా సార్'

☆☆☆☆

'సార్, నా రేషన్ కార్డు సంగతేమైంది'
'నువ్వు పేదరిక రేఖ పైకి ఎక్కేశావు కదయ్యా'
'ఆటోవాణ్ని జంక్షన్లో స్టాఫ్ లైనే ఎక్కను, పేదరిక రేఖ పైకెప్పుడు ఎక్కాను సార్'
'పేదోడివని ప్రూఫు తెచ్చుకో'
'రోజంతా రోడ్డు మీద తిరిగే నా బతుకే ఒక పెద్ద ప్రూఫ్ సార్'
'ఆ మాట పత్రాలు చెప్పాలి. పత్రాలుంటేనే పనవుతుంది'
'మరెలా?'
'కాగితాలతోనే పనవుతుందంటే అర్థం కావడం లేదా?'
'ఏం కష్టం చేశారని ఇచ్చుకోవాలి సార్'
'ప్రజలకోసం చెమటోడ్చి కష్టపడితే, ముష్టి నాలుగు రాళ్లు తప్ప మాకేం వస్తుంది. ఇంతగా కష్టపడుతున్నప్పుడు ఇల్లయినా కాస్త సౌకర్యంగా ఉండాలా, ఇల్లంటే కనీసం కోటి పెట్టి కట్టాలా, హాయిగా పనిచేయాలంటే కారులో రావాలా... ఇలాంటి చిల్లర ఖర్చులన్నీ మీరే పెట్టుకోవాలి. ఏదో ఫ్రెండ్కు టీ తాగిచ్చామనుకోవాలంతే!'
'మీ టీ ఖర్చులు చాలా కాస్ట్లీ సార్'
'కొన్ని విలువలంతే, అన్ని లెక్కలకు అందవు'

☆☆☆☆

'సార్, మా నాన్న డెత్ సర్టిఫికెట్ కావాలి'
'చచ్చిపోయాడు అనేందుకు ఆధారాలున్నాయా?'
'మనిషిగా గుర్తించే ఆధార్ కార్డు, తన జీవితాన్ని ఒక్కరైనా బాగు చెయ్యకపోతారా అన్న ఆశతో బతికున్నంత కాలం ఓట్లేసిన ఓటరు కార్డు, చచ్చిపోయినట్లు చెప్పే ఆస్పత్రి రికార్డు, అంత్యక్రియలు జరిపించినట్లు శ్మశాన పత్రం.. అన్నీ ఉన్నాయి సార్'
'అదేంటయ్యా, ఆస్పత్రి రికార్డులో 'బ్రాట్ డెడ్' అనీ, శ్మశానంలో ఇచ్చిన కాగితంలో 'నేచురల్ డెత్' అనీ ఉంది, ఇలాగైతే కష్టం'
'మరెలాగైతే ఈజీ సార్'
'చచ్చిన మనిషి ఏమీ తీసుకుపోడు, వదిలేసిన దాంట్లో కొంచెం పంచాలంతే!'
'లంచాల దెబ్బకి చావు కూడా తప్పించుకోలేదన్న మాట!'

☆☆☆☆

'స్వామీ, నా వల్ల కాలేదు, డబ్బుల్లేకుండా ఒక్కపనీ అవ్వలేదు, మన్నించండి... ఎక్కడో ఉంటారనుకుంటా కొందరు నిజాయతీపరులు. నాకందరూ మేత మహానుభావులే తగిలారు'
'ఇప్పుడు కూడు గూడుతో పాటు అవినీతి కూడా కనీస అవసరమైందయ్యా చాలా మందికి. ఆకలి, అవినీతి రెండూ వాళ్లకి ప్రకృతి సహజాలు. పదోపరకో పుచ్చుకుంటే మామూళ్లు అంటారు. పనిచేసిపెడితే ఇచ్చేవి టీ ఖర్చులు. సాయం చేస్తే బీరుబిర్యానీ పార్టీ. ఆర్థిక ప్రయోజనాలుంటే కమీషన్లు. ఏదీ, ఎక్కడా లంచాలనే పేరే లేదే! ఇప్పుడన్నీ పేమెంట్లే! మారిన లెక్కల్లో అవినీతి చిక్కిపోయినట్లు కనిపిస్తుందన్నమాట!'
'అయితే, అవినీతి తగ్గిందన్న రేటింగ్లనూ అనుమానించాలంటారా స్వామీ?'
'మారుతున్న కాలానికి మారాల్సిన ఆలోచనలంటే ఇవే! కాన్సెప్టులు చూడగానే అన్ని కంటెంట్లనూ నమ్మొద్దంతే!'

**-శ్రీనివాస్ దరెగోని**
**(కర్టసీ: ఈనాడు)**

✧

# పోలవరం నిర్మాణ పనులు 81.45% పూర్తి

పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులు 2025 అక్టోబర్ నాటికి 81.45% పూర్తయినట్లు యూనియన్ జలశక్తి శాఖ వార్షిక నివేదిక వెల్లడించింది. భూసేకరణ, సహాయ, పునరావాస కల్పన 27.40% చేసినట్లు తెలిపింది. ప్రాజెక్టు నిర్మాణ పనులు, భూ సేకరణ, సహాయ, పునరావాస కార్యక్రమాలను కలిపి చూస్తే మొత్తంగా 60.40% పూర్తయినట్లు పేర్కొంది. ఈ వార్షిక లెక్కల ప్రకారం ఏడాదిలో ప్రాజెక్ట్ ఓవరాల్ పనుల్లో 6.94% మేర పురోగతి నమోదైంది. ఇందులో నిర్మాణ పనుల్లో 4.66%, సహాయ పునరావాసంలో 4.82% వృద్ధి కనిపించింది. ప్రాజెక్టులో తొలిదశ కింద (41.15 మీటర్ల వరకు) ముంపుకి గురయ్యే కుటుంబాలు 38,060 మేర ఉండగా, ఇప్పటివరకు 14,371 కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. 2025 డిసెంబర్ నాటికి మట్టి పనులు 90.20%, కాంక్రీట్ పనులు 85%, స్ట్రక్చర్స్ 55% పూర్తయినట్లు నివేదిక వెల్లడించింది.





# భాష, సంస్కృతి, తర్కం .. సమాజ భవిష్యత్తుకి కీలకం : జేపీ

ప్రాథమిక పాఠశాల స్థాయిలో ఇంట్లో మాట్లాడే భాష ద్వారా విద్యాబోధన వల్ల పిల్లలకు ఎక్కువ విషయ పరిజ్ఞానం పట్టుబడుతుందని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్.డి.ఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ఇంగ్లిష్ మీడియం పేరుతో.. ఇంగ్లిష్ తెలియని టీచర్లు, ఇంగ్లిష్ తెలియని పిల్లలకు, అర్థంకాని రీతిలో పాఠాలు చెప్పటం వల్ల విద్య ఇంకా అధ్వాన్నమవుతుందన్నారు. తెలుగు భాషను పిల్లలకు ఆనందంగా, ఆహ్లాదకరంగా, సులభంగా అర్థమయ్యేలా బోధించేందుకు సాగర్ అనిసింగరాజు బృందం రూపొందించిన 'లిపి ఎపిక్స్ రామాయణ్ యాప్' ఆవిష్కరణ కార్యక్రమంలో జేపీ పాల్గొన్నారు. హైదరాబాద్ లో జరిగిన ఈ కార్యక్రమంలో.. ఒకప్పుడు తెలుగు లెక్చరర్ గా పనిచేసిన సినీ నటుడు బ్రహ్మానందం, సీనియర్ జర్నలిస్టులు హాజరయ్యారు.

జేపీ మాట్లాడుతూ.. సమాజంలో అనేక ప్రత్యేకతలున్నాయని, అలాంటి ఓ వైవిధ్యం భాష ద్వారా ఏర్పడిందన్నారు. మనిషికి, సమాజానికి బొడ్డుతాడు భాష అన్నారు. తెలుగు తెలియకపోవటం గొప్పతమని, ఇంగ్లిష్ రావాలంటే తెలుగు తెలియకూడదనే మూర్ఖత్వం ప్రస్తుతం సమాజంలో రాజ్యమేలుతోందన్నారు. రాజ్యాంగంలో 22 అధికారిక భాషలున్నాయని, ఏ భాష వారికీ తెలుగువారిలా తమ మాతృభాష పట్ల చులకన భావం లేదన్నారు. భాష కేవలం ప్రాస, అందం, అలంకారం కోసం కాదని.. గుండె లోతుల్లో నుంచి భావాన్ని వ్యక్తం చేయటానికని అన్నారు. ప్రపంచంలో అసాధారణ ప్రభావం చూపిన తత్వవేత్తలు, శాస్త్రవేత్తలు, ఇతర మహనీయులు ప్రతి రంగంలోనూ తమ సొంత భాష ద్వారానే భావాల్ని వ్యక్తం చేశారన్నారు. ప్రభుత్వంలో కూడా తెలుగులో మాట్లాడటం, సంతకం చేయటం నామోషీగా ఉందన్నారు. ఇటీవల ఓ హైకోర్టు న్యాయమూర్తి ఇంగ్లిష్ లో ఇచ్చిన తీర్పు అధ్వాన్నంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగు రాక, ఆంగ్లమూ రాక అధ్వాన్న భావవ్యక్తీకరణ దశలో కొట్టుమిట్టాడుతున్నామన్నారు. ప్రజలకు అర్థం కాని భాషలో పరిపాలన, ప్రాథమిక విద్య సరికాదన్నారు. తాను నలభై ఏళ్లుగా ఇంగ్లిష్ లోనే ఆలోచిస్తూ తెలుగులో అనువదిస్తూ మాట్లాడుతుంటానని, రచనలు కూడా అదేవిధంగా చేస్తుంటానని.. ఇంగ్లిష్ వద్దనటం లేదన్నారు. పిల్లలకి చదువు అర్థంకావటంలో భాష ప్రాధాన్యతను గుర్తించకపోవటం వల్ల వారి మేధస్సు వికాసం కొరవడుతోందన్నారు.

ప్రపంచంలో పాఠశాల విద్య మన దేశంలో ఉన్నంత అధ్వాన్నంగా ఏ పెద్ద దేశంలోనూ లేదన్నారు. ఇందుకు భాష మాత్రమే కారణం కాకున్నా, భాష కీలక పాత్ర పోషిస్తుందన్నారు. తెలుగు భాషను సాంకేతికంగా, వినూత్న ఆలోచనలపరంగా సుసంపన్నం చేయాలన్నారు. కొన్నేళ్ల క్రితం ఒకాయన చెప్పిన ఉదంతాన్ని జేపీ ప్రస్తావించారు. ఆయన ఇండొనేషియా వెళ్లినప్పుడు ఎక్కడ చూసినా రామాయణ ఘట్టాలు కన్పించాయని, ఇస్లాం మెజారిటీ దేశంలో అలా ఉండటం ఆయనకు ఆశ్చర్యం కలిగించిందన్నారు. అదే ప్రశ్న అక్కడి వారిని అడగ్గా, 'ఇస్లాం మా మతం, రామాయణం మా సంస్కృతి' అని సగర్వంగా చెప్పారన్నారు. ఏ దారిలోనైనా సత్యాన్ని చేరుకోవచ్చంటూ లోతైన తాత్విక అవగాహన కలిగిన దేశం ప్రపంచంలో భారత్ తప్ప మరోటి లేదన్నారు. లొంగిపోకుండా, అందరినీ ఇముడ్చుకునే తత్వం వల్లే భారత్‌లో పార్శీలు, క్రైస్తవులు, యూదులు, ముసల్మాన్‌లు కలిసి జీవిస్తున్నారన్నారు. శ్రీమద్ రామాయణ కల్పవృక్షం విశ్వనాథ వారు రాస్తే.. అందుకు వ్యతిరేకంగా రంగనాయకమ్మ గారు శ్రీమద్ రామాయణ విషవృక్షం రాశారని, ఆమెపై ఎవరూ కర్రలూ, కత్తులూ దూయలేదని, నిక్షేపంగా ఉన్నారన్నారు. ఈ మధ్య కూడా తనతో ఫోన్‌లో మాట్లాడారన్నారు. భాష, సంస్కృతి, తర్కం.. ఈ మూడూ స్థానిక, రాష్ట్ర, దేశ, మానవాళి వికాసానికి కీలకమని చెప్పటానికే తాను ఈ కార్యక్రమానికి వచ్చానన్నారు. తెలుగు లిపిని ప్రోత్సహించాలని, సినిమా ఎలా ఉన్నా రూ.500 టికెట్టుకి చెల్లించి చూస్తామని, అలాంటిది మనకు ఎన్నో రకాలుగా ఉపయోగపడే భాష, సంస్కృతి వంటి అంశాల్ని కొద్దిపాటి డబ్బులిచ్చి పోషించుకోవటానికి సంకోచించకూడదని జేపీ విజ్ఞప్తి చేశారు.

RNI. Regd No. 69976/98 Postal Reg. No. HCD-913/2024-2026 Published on 10th March 2026 Posting Date 15 &16th of every month
Posted at BPC-IV Patrika Channel, Nampally, HYDERABAD-500 001




# ఆరోగ్యానికి ‘కిక్ స్టార్ట్’

వైద్యం కన్నా నివారణ మేలని, క్రమశిక్షణతో కూడిన జీవనశైలి అలవాటు చేసుకుంటే వైద్యులు, ఆస్పత్రుల అవసరం ఉండదని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్.డి.ఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. పోషకాహార నిపుణురాలు సాహిత్య లలితా కామేశ్వరి రచించిన ‘కిక్ స్టార్ట్’ పుస్తకాన్ని హైదరాబాద్ లో ఆవిష్కరించారు. చిన్న వయసులో సమాజానికి ఉపయోగపడే పుస్తకం రాసినందుకు అభినందించారు. వ్యక్తిత్వ వికాస నిపుణుడు ఆకెళ్ల రాఘవేంద్ర, సూరి బుచ్చిరామయ్య, ఆర్.సి మూర్తి, కృష్ణ కిరణ్, కె. శ్రీరామచంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.

*If undelivered please return to:*
*LOKSATTA UDYAMA SAMSTHA,*
*H.NO. 6-3-678,B-106,*
*PASHA COURT 71, Somajiguda,*
*Behind TRIBHUVANDAS*
*JEWELLERS (TBZ),*
*Hyderabad - 500 082*

**Edited, Printed and Published by Dr. Jayaprakash Narayan, National Coordinator, Loksatta for and behalf of Foundation for Democratic Reforms, H.NO. 6-3-678,B-106,PASHA COURT 71, Somajiguda, Behind TRIBHUVANDAS JEWELLERS , Hyderabad- 500 082.**
**Printed at Kala Jyothi Process Pvt Ltd, Plot No : CFC-1 and 2, Survey No: 18, E-City, SEZ, General industrial park, Raviryal & Srinagar village, Maheswaram mandal, Rangareddy district-501359, Telangana.**